శ్రీకాళహస్తీశ్వర శతకము
రూ॥40/-
పేజీలు:48

నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★


నియోజకవర్గాల పునర్విభజన : సమస్యలు, ప్రభావాలు

పేదల బ్రతుకులపై భారం మోపుతున్న కేంద్ర బడ్జెట్

వెనిజులాపై ఆంక్షలతో ట్రంప్ కొత్త ట్రేడ్‌వార్

లోపలి పేజీల్లో


సంపుటి 08, సంచిక: 116 | బుధవారం | 26-03-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00


# ఉపాధి హామీపై వివక్ష ఎందుకు?

- లోక్‌సభలో ప్రతిపక్షాల ఆందోళన
- తక్షణం వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్
- పార్లమెంట్ ఆవరణలో రాహుల్, ప్రియాంక నిరసన

**న్యూఢిల్లీ:** ఉపాధి హామీ పథకం కింద చెల్లింపుల విషయంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలపై వివక్ష చూపుతోందని లోక్‌సభలో ప్రతిపక్షాలు ధ్వజమెత్తాయి. మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఈ విషయాన్ని లేవనెత్తిన కాంగ్రెస్, డిఎంకె, తృణమూల్ కాంగ్రెస్ ఎంపిలు స్పీకర్ వెల్‌లోకి వచ్చి నిరసన తెలిపారు. కొన్ని రాష్ట్రాలకు చెల్లింపులు ఆలస్యం అయ్యాయని పేర్కొన్నారు. నిరసన తెలుపుతున్న ఎంపిలనుద్దేశించి స్పీకర్ ఓం బిర్లా... తమ సీట్లలో వెళ్లి కూర్చోవాలని కోరారు. ప్రశ్నోత్తరాల సమయంలో లేవనెత్తిన ప్రశ్నలను రాజకీయం చేయవద్దన్నారు. కాగా ప్రతిపక్ష ఎంపిలు పట్టు విడవకుండా పెద్ద పెట్టున నినదిస్తూ... ఆందోళన చేశారు. ద్రవ్యోల్బణానికి అనుగుణంగా వేతనాలు పెంచాలని, పని దినాలు కూడా పెంచాలని డిమాండ్ చేశారు. ఎంపిల నిరసన నడుమ సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. కేరళకు చెందిన కాంగ్రెస్ ఎంపి అదూర్ ప్రకాశ్ మాట్లాడుతూ తమ రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కూలీల సంఖ్య తగ్గిపోతోందని... చెల్లింపులు తరువాయి 2లో





## ఎస్ఎల్‌బిసి టన్నెల్‌లో మరో మృతదేహం వెలికితీత

- ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇంజనీర్ మనోజ్‌కుమార్‌గా గుర్తింపు
- ప్రభుత్వం తరపున రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా
- మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించనున్నట్లు కలెక్టర్ వెల్లడి
- మిగతా ఆరుగురి కోసం సహాయక చర్యలు ముమ్మరం

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి

శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగ మార్గం (ఎస్ఎల్‌బిసి) ప్రమాదంలో చిక్కుకుపోయిన రెండో మృతదేహాన్ని మంగళవారం వెలికితీసినట్లు నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. ఈ ఘటనలో ఇప్పటివరకు రెండు మృతదేహాలు లభ్యమైనట్లు చెప్పారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ తరువాయి 2లో

## వ్యవసాయ రంగ సమస్యలకు పోరాటంతోనే పరిష్కారం

- రైతులను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం
- జై జవాన్ జై కిసాన్ నినాదానికి బదులు జై అంబానీ, జై అదానీ అంటున్న మోడీ
- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం విమర్శ
- ఘనంగా ప్రారంభమైన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం 3వ మహాసభలు
- ప్రెస్‌క్లబ్ నుంచి గోనేరెడ్డి ఫంక్షన్ వరకు భారీ ర్యాలీ

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి

రైతాంగ పోరాటం ద్వారానే వ్యవసాయ రంగ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని, రైతులు ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. నిజామాబాద్‌లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర 3వ మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదట నిజామాబాద్ ప్రెస్‌క్లబ్ నుంచి ర్యాలీ ప్రారంభం కాగా, పూలాంగ్ చౌరస్తా మీదుగా గోనేరెడ్డి ఫంక్షన్ హాల్ వరకు వేలాది మందితో నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న రైతులపై పువ్వులు చల్లి ఆహ్వానం పలికారు. పూలాంగ్ చౌరస్తాలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గోనేరెడ్డి ఫంక్షన్ హాల్‌లో బహిరంగ సభ నిర్వహించగా ఎఐకెఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఆహ్వాన సంఘం కోశాధికారి కంజర భూమయ్య తరువాయి 12లో








## దంతెవాడ జిల్లాలో మళ్లీ ఎన్‌కౌంటర్

- ముగ్గురు నక్సల్స్ హతం
- ఒకరిపై 25లక్షల రివార్డు
- నిర్ధారించిన పోలీసులు

ప్రజాపక్షం/భద్రాచలం

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లాలో మంగళవారం ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. భద్రతా బలగాలు మావోయిస్టుల మధ్య హోరాహోరీగా 8గంటల పాటు సాగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు హతమయ్యారు. మృతి చెందిన మావోయిస్టుల్లోని ఒకరిపై తరువాయి 2లో




03 గిరిజన సంస్కృతి, వారసత్వాలకు వేదిక ట్రైబల్ మ్యూజియం
- గిరిజనుల ఉత్పత్తులకు మ్యూజియం ద్వారా మార్కెటింగ్ : పొంగులేటి



03 బడుగు, బలహీనవర్గాల కోసం నిరంతరం పోరాటం
- సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి



05 అన్‌లైన్ అడ్వర్‌టైజ్‌మెంట్లపై డిజిటల్ పన్ను రద్దు
- ఆర్థిక బిల్లు 2025కు లోక్‌సభ ఆమోదం



05 పిఎం కిసాన్ పథకం కింద అనర్హుల నుంచి రూ.416 కోట్లు రికవరీ

05 7.81 లక్షలకు పైగా సిమ్‌కార్డులు బ్లాక్




## విద్యా సంస్థలపై నిఘా లేమితో పడిపోతున్న ప్రమాణాలు

- భవిష్యత్ తరాలకు బలహీన పునాదులు వేస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర ప్రభావం
- గత పదేళ్లలో జరిగిన లోపాలు గుర్తించి వాటిని సరిదిద్దితే సమస్యలు పరిష్కారం
- విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు కేటాయించాలి
- ప్రభుత్వానికి సిపిఐ శాసన సభాపక్షనేత కూనంనేని విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

భావితరాలకు విద్యా రంగంలో బలహీనమైన పునాదులను వేస్తే, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని, విద్యా ప్రమాణాలు కునారిల్లుతాయని సిపిఐ శాసనసభా పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు ఆందోళన వ్యక్తం చేశారు. పదేళ్ల కాలంలో ప్రాథమిక, ఉన్నత విద్యరంగంలో విద్యార్థుల సంఖ్య, డ్రాప్ అవుట్స్, పరిణామాలు, వాటి ఫలితాలు, నష్టాలు, కష్టాలు, ఉపయోగాలపై ప్రత్యేకమైన కమిటీతో సమగ్రంగా విచారించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన సూచించారు. తద్వారా లోపాలను గుర్తించి, వాటిని సరిదిద్దితే అనేక సమస్యలు పరిష్కారమౌతాయన్నారు. శాసనసభలో మంగళవారం ''పాఠశాల, ఉన్నత విద్య, సాంకేతిక విద్య, వాణిజ్య పన్నులు, యువజన, క్రీడలు, రోడ్డు భవనాలు, మద్య నిషేధం, ఆబ్కారీ,పర్యాటక ,కళలు, సాంస్కృతిక, అడవులు, శాస్త్ర సాంకేతిక, పర్యావరణం, మత సంబంధ ధర్మాదాయాల శాఖలకు'' సంబంధించిన పద్దులపై జరిగిన చర్చలో కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా రంగంలో ప్రభుత్వం నిధులను ఖర్చు చేస్తూ, మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నప్పటికీ విద్యా సంస్థలపై నిఘా పెట్టకపోవడంతో విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయని, తద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. అమెరికాలో ప్రభుత్వ రంగంలో ఉన్న ఉన్నత విద్యను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రైవేటుపరం చేశారని, అదే బాటలో ప్రధాని మోదీ అడుగులు వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా ఉన్నత విద్య విషయంలో ప్రభుత్వాలు తమ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నాయని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలోని అనేక ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తే, తెలంగాణ 'టూరిజం హబ్'గా మారుతుందన్నారు. విద్యా ప్రమాణాలను పెంచేందుకు విద్యా రంగానికి అధిక నిధులను కేటాయించి, ప్రత్యేక దృష్టిని సారించాలని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యా ప్రమాణాల విషయంలో తెలంగాణ రాష్ట్రం 14వ స్థానంలో ఉండడం విచారకరమన్నారు. 9,10వ తరువాయి 2లో

## మద్యం పాపం బిఆర్‌ఎస్‌దే

- గత ప్రభుత్వం హయాంలో భారీగా విక్రయాలు
- రూ.25 వేల కోట్ల ఆదాయం పెంపు
- తాగుడు అలవాటు ఎవరు నేరిపించినట్టు : మంత్రి జూపల్లి
- బెల్టు షాపులకు అడ్డగోలుగా అనుమతులు ఇచ్చిందే బిఆర్‌ఎస్ : మంత్రి శ్రీధర్‌బాబు

బెల్టు షాపులను తొలగిస్తామని అదనంగా రూ.12 వేల కోట్ల అదాయం ప్రతిపాదిస్తారా? : బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ వేముల ప్రశాంత్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్



గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో మద్యం విక్రయాల ద్వారా రూ.25 వేల కోట్ల ఆదాయాన్ని పెంచారని,దీంతో రాష్ట్రంలో తాగే అలవాట్లను ఎవరు నేరిపించినట్టు అని ఆబ్కారీ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశ్నించారు. తాము ఎటువంటి పన్నులను, మద్యాన్ని పెంచకుండా శాఖలోని లోపాలను సవరిస్తూ ఆదాయం పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నామని స్పష్టం చేశారు. ''పాఠశాల, ఉన్నత విద్య, సాంకేతిక విద్య, వాణిజ్య పన్నులు, యువజన, క్రీడలు,రోడ్డు భవనాలు, మద్యనిషేధ, అబ్కారీ, పర్యాటక ,కళలు, సాంస్కృతిక, అడవులు,శాస్త్ర సాంకేతిక ,పర్యావరణం, మత సంబంధ ధర్మాదాయాల శాఖలకు'' సంబంధించిన పద్దులపైన శాసనసభలో మంగళవారం జరిగిన చర్చలో బిఆర్‌ఎస్ సభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ బెల్టు షాపులను తొలగిస్తామని కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిందని, ప్రస్తుత బడ్జెట్‌లో మాత్రం మద్యం ద్వారా వచ్చే ఆదాయాన్ని గత ఏడాది కంటే అదనంగా రూ.12వేల కోట్లను ప్రతిపాదించారని తెలిపారు. కొత్త బ్రాండ్లు, బీర్లు, బార్లు , బెల్టుషాపులు ఇదే కాంగ్రెస్ పాలసీ అని ఆరోపించారు. దీనిపైన శాసనసభ వ్యవహారాలు, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జక్యం చేసుకుని మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలోనే బెల్టు షాపులు వచ్చాయని బిఆర్‌ఎస్ అంగీకరించిందని, తాము ఆబ్కారిలో ఉన్న లికేజీలను అరికట్టడం ద్వారా మద్యం ఆదాయన్ని పెంచుతున్నామని వివరించారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం అడ్డగోలుగా బెల్టు షాపులకు అనుమతినిచ్చిందని, ఇప్పుడు దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. తాము పరిపాలన సంస్కరణాలను తరువాయి 2లో

## గచ్చిబౌలిలో 400 ఎకరాలు ప్రభుత్వ భూమే

- అందులో అటవీ భూమి లేదు
- స్పష్టం చేసిన మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలిలో సర్వే నెం.25లో 400 ఎకరాల భూమిపై వస్తున్న వార్తలపై మంత్రి శ్రీధర్‌బాబు మంగళవారం వివరణ ఇచ్చారు. ఈ 400 ఎకరాల భూమిని 2003లో టిడిపి ప్రభుత్వం ఐఎంజి అకాడమీస్ భారత్‌కు ఇచ్చిందని, అయితే ఇక్కడ ఐఎండి అకాడమీ ప్రాజెక్టును ప్రారంభించకపోవడంతో 2006లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆ భూముల కేటాయింపులను రద్దు చేస్తూ తిరిగి ప్రభుత్వ భూములుగా పరిగణిచాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులపై ఐఎంజి సంస్థ హైకోర్టుకు వెళ్లగా ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. దీంతో ప్రస్తుతం ఈ 400 ఎకరాల భూమి ప్రభుత్వం ఆధీనంలో, ప్రభుత్వ గుర్తింపుగా చేర్చడం జరిగిందన్నారు. ఈ భూమిలో అటవీ శాఖకు సంబంధించిన భూములు లేవని స్పష్టం చేశారు. ఈ భూమిని గత ఏడాది జూన్ 26న టిజిఐఐసికు కేటాయిస్తూ రెవెన్యూ తరువాయి 12లో






## అందాల పోటీలు రద్దు చేయాలి

మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి

ప్రజాపక్షం/హైదరాబాద్

భారతదేశ నైతిక విలువలు, సాంస్కృతిక నైతికతను దిగజార్చే అసభ్యకరమైన అందాల పోటీలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని భారత జాతీయ మహిళా తరువాయి 2లో

## సిరియా ఎయిర్‌బేస్‌పై ఇజ్రాయెల్ దాడులు

- జర్నలిస్టు సహా గాజాలో 23 మంది మృతి
- ఆస్కార్ అవార్డు గ్రహీత అరెస్టు
- ఇప్పటి వరకూ ఆరుగురు అల్ జజీరా జర్నలిస్టులు మృతి

**గాజా :** గాజాలో ఇజ్రాయెల్ మంగళవారం ఎనిమిదో రోజు కూడా దాడులు కొనసాగించింది. ఈ దాడుల్లో 23 మంది మరణించారు. మృతుల్లో ఏడుగురు పిల్లలు కూడా ఉన్నారు. అదేవిధంగా సిరియా పాల్మీరా నగర సమీపంలో ఉన్న వైమానికదళస్థావరంపై ఇజ్రాయెల్ గగనతల దాడులు చేసింది. ఒక్క వారం రోజుల్లో ఈ విధంగా సిరియా వైమానికస్థావరాలపై దాడులు చేయడం ఇది రెండోసారి. కాగా గాజాలో జరిపిన దాడుల్లో అల్‌జజీరా జర్నలిస్టు షేమ్ షాబత్ మరణించారు. అదేవిధంగా ఆస్కార్ అవార్డు గ్రహీత హమ్దాన్ బల్లాల్‌ను కూడా వెస్ట్‌బ్యాంక్‌లో దాడులు సందర్భంగా ఇజ్రాయెల్ బలగాలు అరెస్టు చేశాయి. ''నో అదర్ ల్యాండ్'' టైటిల్‌తో హమ్దాన్ బల్లాల్ తీసిన డాక్యుమెంటరీ అస్కార్ బహుమతి గెలుచుకుంది. కాగా 2023 అక్టోబరు ఏడో తేదీ నుండి ఇప్పటివరకూ గాజాలో ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో 50,000 మంది పైగా మరణించారు. శిథిలాల్లో మరో తరువాయి 12లో





# ప్రపంచం
WORLD NEWS

## టర్కీలో నిరసనలు ప్రతిపక్షాల హింసాత్మక ఉద్యమం



**అంకారా:** టర్కీలో ఆరు రోజులుగా జరుగుతున్న నిరసన ప్రదర్శనలు ప్రతిపక్షాలు రేకెత్తించిన హింసాత్మక ఉద్యమం అని ఆ దేశ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్దొగాన్ విమర్శించారు. ప్రతిపక్ష రిపబ్లికన్ పీపుల్స్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా ఎంపికైన ఇమామోగ్లూపై అవినీతి ఆరోపణలు చేసి జైలుకు తరలించారు. ప్రస్తుత అధ్యక్షుడు ఎర్దొగాన్‌కు ఇమామోగ్లూ ప్రధాన ప్రత్యర్థిగా మారడంతో ఎర్దొగాన్ ఉద్దేశపూర్వకంగా ఆయనను భ్రష్టుత్వం పట్టించేందుకు అవినీతి కేసులో ఇరికించారని టర్కీలో మెజారిటీ ప్రజలు గట్టిగా విశ్వసిస్తున్నారు. దీంతో ఆయనకు ఇప్పుడు ప్రజల్లో ఆయనకు పాపులారిటీ బాగా పెరిగింది. టర్కీ న్యాయస్థానం అధికారికంగా ఆయనను అరెస్టు చేయాలని ఆదేశించిన తర్వాత ఈనెల 19వ తేదీన ఆ దేశంలో ఇమామోగ్లూకు అనుకూలంగా ప్రదర్శనలు ఉద్ధృతమయ్యాయి. రోజు రోజుకూ ఇమామోగ్లూకు భారీగా మద్దతు పెరుగుతూ ఉండటంతో ఎర్దొగాన్ మొదటిసారి నోరు తెరచి ఇమామోగ్లూకు వ్యతిరేకంగా ప్రకటన చేశారు. ప్రతిపక్షాలు కావాలనే ఈ హింసను దేశంలో రెచ్చగొడుతున్నాయని విమర్శించారు. 2028లో టర్కీలో మళ్ళీ అధ్యక్ష ఎన్నికలు నిర్ణీత ప్రకారం జరగాల్సి ఉంది.

# వెనిజులాపై ఆంక్షలతో ట్రంప్ కొత్త ట్రేడ్‌వార్

### భారత్‌చైనాలపై తీవ్ర ప్రభావం





**వాషింగ్టన్ :** వెనిజులా నుండి చమురు దిగుమతి చేసుకునే దేశాలపై ఆంక్షలు విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఒక ఉత్తర్వుపై మంగళవారంనాడు సంతకం చేశారు. దీనివల్ల భారత్‌చైనాలు తీవ్రంగా నష్టపోతాయి. 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' (మాగా) నినాదాన్ని అమలు చేయడంలో భాగంగా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 'వసూల్ రాజా' అవతారమెత్తారు. నయానో భయానో ఆదాయాలు పెంచుకునే అన్వేషణలో కొత్త సుంకాలు వసూలు చేసేందుకు వెనిజులాపై ఆంక్షలమార్గం ఎంచుకున్నారు. దీని ప్రకారం అమెరికాతో వ్యాపారం చేసేవారు ఆ దేశానికి 25 శాతం సుంకాలు చెల్లించాలి. మరీముఖ్యంగా వెనిజులా నుండి ముడి చమురును ప్రత్యక్షంగా, పరోక్షంగా దిగుమతి చేసుకునేవారికి ఈ అంక్షలు మరీ భారంగా మారనున్నాయి. ఈ ఉత్తర్వులు ఏప్రిల్ రెండో తేదీ నుండి అమలులోకి వస్తాయి. ట్రంప్ ఉత్తర్వులు భారత్‌చైనా దేశాలపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి. ముఖ్యంగా గత ఏడాది జనవరి గణాంకాల ప్రకారం వెనిజులా ఎగుమతి చేసే మొత్తం చమురులో సగానికి సగం కొనుగోలు చేస్తున్నది భారతదేశమే. 2023 డిసెంబరు నుండి 2024 జనవరి నాటికి వెనిజులా నుండి భారతదేశం అత్యధిక చమురు కొనుగోలు దేశంగా అవతరించింది. 1,91,600 బ్యారెళ్ళ నుండి 2.54 లక్షల బ్యారెళ్ళ చమురును వెనిజులా నుండి భారత్ కొనుగోలు చేస్తున్నది. 2024లో భారతదేశం 22 మిలియన్ బ్యారెల్స్ చమురును వెనిజులా నుండి దిగుమతి చేసుకుంది. అంటే ఆ దేశం ఎగుమతుల్లో 1.5 శాతం ముడిచమురును భారత్ కొనుగోలు చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో చైనా రోజుకు ఐదు లక్షల బ్యారెల్స్ ముడిచమురును వెనిజులా నుండి కొనుగోలు చేసింది. అమెరికా కూడా ప్రతిరోజూ 2.24 లక్షల బ్యారెల్స్ చమురును వెనిజులా నుండే కొనుగోలు చేస్తుంది.ట్రంప్ రాకతో ప్రపంచమార్కెట్లలో ఒడిదొడుకులు వస్తున్న తరుణంలో అనిశ్చితి ఇంకా పెరుగుతుంది. ఆసియా మార్కెట్లపై కూడా ఈ ఆంక్షలు తీవ్ర ప్రభావం చూపిస్తాయి. ''అమెరికా సమర్థించే ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ నినాదాలకు వెనిజులా విధానాలు చాలా వ్యతిరేకంగా ఉన్నాయని తన సొంత ట్రూత్ సోషల్ మీడియా వేదికపై పెట్టిన పోస్టింగ్‌లో ట్రంప్ పేర్కొన్నారు. ఈ సుంకాలను ఎత్తివేయాలని ట్రంప్ నిర్ణయించుకుంటేతప్ప ఏడాదిపాటు ఇవి అమలులో ఉంటాయి. తర్వాత ట్రంప్ ఇష్టప్రకారం దీని రద్దుపద్దు జరుగుతుంది. ట్రంప్ చర్యను అమెరికా తీవ్రంగా ఖండించింది. ముఖ్యమైన విషయం ఏమిటంటే అమెరికాకు, స్పెయిన్‌కు కూడా వెనిజులాయే ప్రధాన సరఫరాదారుగా ఉంది.ట్రంప్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, వెనిజులా నుండి చమురు, గ్యాస్ దిగుమతి చేసుకునే దేశాలు గనుక అమెరికాలో కూడా ఏదోఒక వ్యాపారం చేస్తూ ఉన్నట్లయితే అనివార్యంగా 25 సుంకాలను అమెరికా ప్రభుత్వానికి చెల్లించాలి. వెనిజులా నుండి దిగుమతి చేసుకునే దేశాలు ఎలాంటి వ్యాపారం అమెరికాతో చేస్తున్నారనే విషయంతో సంబంధం లేకుండా ఈ సుంకాలు వసూలు చేస్తారు. ఐతే సబంధిత దేశాలకు అమెరికాతో వ్యాపార సంబంధాలు లేకపోతే ఈ సుంకాల వసూలు ప్రసక్తే ఉండదు.

# రెండేళ్ల తర్వాత ఐదుగురు అమెరికా వ్యాపార సిబ్బంది విడుదల

**బీజింగ్ :** రెండు సంవత్సరాల నిర్బంధం తర్వాత అమెరికాకు చెందిన ఐదుగురిని చైనా మంగళవారం నాడు విడుదల చేసింది. విదేశీ వ్యాపారాలతో పని చేసే కన్సల్టింగ్ సంస్థలపై కఠినచర్యలు తీసుకునే విధానంలో భాగంగా చైనా అధికారులు మింట్జ్ గ్రూపులోని డ్యూడిలిజెన్స్ సంస్థకు చెందిన ఐదుగురిని రెండేళ్ళక్రితం నిర్బంధించింది. వ్యాపారం ముసుగులో గూఢచర్యం చేస్తున్నారన్న సందేహంతో చైనా ప్రభుత్వం2023లో వారిని అరెస్టు చేసింది. బెయిన్ అండ్ కంపెనీ, క్యాప్విజన్ అండ్ పార్ట్‌నర్స్‌పై కూడా చైనా నిఘాపెట్టి వరుస దాడులు చేసింది. టిమ్‌కుక్ (ఆపిల్), ఆల్బర్ట్ బౌర్లా (ఫైజర్) సహా అనేక కంపెనీల ప్రతినిధులు హాజరైన బీజింగ్‌లో కజరిగిన ఒక వ్యాపార వేదిక సదస్సు సందర్భంగా వారిని చైనా ప్రభుత్వం విడుదల చేసింది. గడచిన మూడు సంవత్సరాలుగా చైనా ఆర్థిక వ్యవస్థ దిగజారుతున్న పరిస్థితుల్లో విదేశీ పెట్టుబడులను భారీగా పెంచుకోవాలని ఆ దేశం ప్రయత్నాలు చేస్తున్నది. మూడేళ్ళుగా చైనాలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 99 శాతం మేరకు తగ్గిపోయాయని ఒక నివేదిక వెల్లడించింది. ఈ సదస్సులో ఆదివారంనాడు చైనా ఉప ప్రధానమంత్రి హె లీఫెంగ్ మాట్లాడుతూ, చైనాలో వ్యాపార అవకాశాలు మెండుగా ఉన్నాయని, విదేశీ వ్యాపారులకు పూర్తి భరోసా ఇస్తామని చెప్పారు.









# 50ఏళ్ళ తర్వాత నిర్దోషి అని తేలింది

### జపాన్‌లో బాధితుడికి అతిభారీ పరిహారం

**టోక్యో:** యజమాని సహా కుటుంబాన్ని హత్యచేసిన కేసులో యాభై సంవత్సరాలు శిక్ష అనుభవించిన ఒకవ్యక్తికి పునర్విచారణలో నిర్దోషిగా తేలాడు. దీంతో న్యాయస్థానం చరిత్రలో ఎన్నడూలేనంత భారీస్థాయిలో అతడికి 1.45 మిలియన్ డాలర్లు పరిహారం చెల్లించనున్నది. ఈ కేసులో నిర్దోషిగా బయటపడిన నిందితుడు ఇవావో హకమాటోకు 89 సంవత్సరాలు వయసు. 1968లో తన యజమానిని అతడి భార్య, ఇద్దరు పిల్లలను హత్యచేశాడని ఆరోపణలు ఎదుర్కొని జైలుశిక్ష పడింది. యాభైయేళ్ళు శిక్ష అనుభవించాక పునర్విచారణలో నిర్దోషిగా బయపడ్డాడు. అతడి మానసిక పరిస్థితి బాగోలేదని, అతడికి భారీగా పరిహారం చెల్లించాలని అతడి తరపు న్యాయవాదులు కోరారు. అందుకు అనుగుణంగా న్యాయమూర్తి కునికోషి హకమాటో మానసిక పరిస్థితిని అర్థం చేసుకుని అతడికి ప్రత్యేక అనుమతి ఇచ్చారు. ప్రస్తుతం అతడు తన సోదరి వద్ద ఉంటున్నాడు. జపాన్‌లో సుదీర్ఘంగా విచారణ జరిగిన కేసుగా చరిత్రలో ఇది నిలిచిపోయింది. అతడి పరిస్థితి కారణంగా అతడిని విచారణకు కూడా హాజరుకావాల్సిన అవసరం లేకుండా న్యాయమూర్తి ఇప్పటివరకూ అనుమతి ఇచ్చారు.

# పాపం బిఆర్‌ఎస్‌దే

**(మొదటి పేజీ తరువాయి)**

తీసుకొస్తున్నామని శ్రీధర్‌బాబు వివరించారు.

**దొంగనే...దొంగ అన్నట్టు : జూపల్లి**

ఆ తర్వాత సభలోనికి వచ్చిన ఆబ్కారి మంత్రి జూ పల్లి కృష్ణారావు స్పందిస్తూ తెలంగాణ రాష్ట్రంలో 2014 జూన్ 2వ తేదీ నాటికి మద్యం ఆదాయం రూ. 9వేల కోట్లు ఉండగా, బిఆర్‌ఎస్ ప్రభుత్వం దిగిపోయే సమయానికి 2023 డిసెంబర్ నాటికి రూ.34 వేల కోట్లకు ఆదాయం పెరిగిందని వివరించారు.రూ.9 వేల కోట్ల ఆదాయం నుంచి రూ. 34వేల కోట్ల ఆదాయాన్ని పెంచారని , ఈ ఆదాయం ఎవరు పెంచారని నిలదీశారు. గతంలోనే రూ.9వేల కోట్ల అదనంగా ప్రతిపాదించారని, దీనినే తాము కొనసాగిస్తూ, అదనంగా మూడు నుంచి నాలుగు శాతం మాత్రమే బడ్జెట్‌లో ప్రతిపాదించామని వివరించారు. తాము ఏ ఒక్క శాతం కూడా పన్నును పెంచలేదన్నారు. ఫామ్‌హౌజ్‌లో అక్రమంగా మందు సరఫరా, మద్యం ఉత్పత్తి సంస్థలలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసి, వాటిని పోలీసు కమాండ్ కంట్రోల్ రూముకు అనుసంధానం చేశామని, చెక్ పోస్టులను పెంచామని, విద్యుత్ వినియోగంపైన కూడా దృష్టి పెట్టామని, ఇలాంటి చర్యల ద్వారా లికేజీను అరికట్టి , ఆదాయాన్ని పెంచుకుంటామని జూపల్లి వివరించారు. మద్యం పెంచేందుకు బిఆర్‌ఎస్ ప్రయత్నించి, ఇప్పుడు ''ఉల్టా చోర్ కొత్వాల్‌కు డాంటే'అన్నట్టుగా దొంగనే దొంగ ..దొంగ అన్నట్టుగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మళ్లీ ఎన్‌కౌంటర్

**(మొదటి పేజీ తరువాయి)**

రూ.25 లక్షల రివార్డు ఉన్నట్లు ఆ రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులు ప్రకటించారు. గీడం పోలీస్ స్టేషన్ పరిధిలోని గిర్సాపర, నెల్లోడ, బోడ్గా, ఇకేలి గ్రామాల నడుమ అడవుల్లో మావోయిస్టులు ఉన్నారనే పక్కా సమాచారం మేరకు డిఆర్‌జి, బస్తర్ ఫైటర్స్‌కు చెందిన పోలీస్ బలగాలు ఈ ఎదురుకాల్పుల్లో పాల్గొన్నాయి. ఘటనా స్థలం నుండి ఇన్సాస్ రైఫిల్ శ్రీ, 303రైఫిల్, పేలుడు పదార్థాలు,రోజువారీ ఉపయోగించే వస్తువులు , వంట సామాగ్రిని స్వాదీనం చేసుకున్నారు. ఎదురు కాల్పుల్లో మృతి చెందిన ముగ్గురు మావోయిస్టుల్లో ఒకరైన సుధీర్ అలియాస్ సుధాకర్ అలియాస్ మురళీది తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈయన దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడని, ఇతని తలపై 25 లక్షల రివార్డు ఉందని పోలీస్ అధికారులు వెల్లడించారు. మరో ఇద్దర్ని ఇంకా గుర్తించాల్సి ఉంది. ఇదిలా ఉండగా సంఘటనా ప్రాంత సమీపంలో మావోయిస్టుల కోసం కూంబింగ్ కొనసాగుతోంది. 2026 మార్చి 31 నాటికి దేశాన్ని మావోయిస్టు రహితంగా మారుస్తామని కేంద్ర బిజేపి ప్రకటించిన మాట విధితమే. కాగా మార్చి 20న జరిగిన ఎదురు కాల్పుల్లో ఏకంగా 30 మంది మావోయిస్టులు హతమయ్యారు. తాజా ఎన్ కౌంటర్‌తో ఈ ఏడాది ఇప్పటి వరకు 116 మంది మావోయిస్టులు ఎదురు కాల్పుల్లో మృత్యువాత పడ్డారు.

# వెలికితీత

**(మొదటి పేజీ తరువాయి)**

మండలం దోమలపెంటగ్రామంలోని ఎస్ఎల్‌బిసిటన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న ఎనిమిదిమందిలో ఈ నెల 9న పంజాబ్‌రాష్ట్రానికి చెందిన గురుప్రీత్ సింగ్ మృతదేహం లభించగా తాజాగా మంగళవారం జయప్రకాష్ ఆసోసియేట్స్ లిమిటెడ్ కంపెనీలో ఇంజనీర్‌గా విధులు నిర్వహించిన ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మనోజ్‌కుమార్ మృతదేహంగా గుర్తించినట్లు తెలిపారు. ప్రభుత్వం తరపున రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియో వారి కుటుంబసభ్యులకు అందించనున్నట్లు , వైద్య పరీక్షల అనంతరం మృతదేహాన్నివారి స్వగ్రామానికి తరలించనున్నట్లు తెలియజేశారు. ఉత్తరప్రదేశ్‌రాష్ట్రం ఉన్నావ్‌జిల్లా బంగార్మౌ గ్రామానికి చెందిన మనోజ్‌కుమార్ తండ్రి అర్జున్‌ప్రసాద్. మృతుడికి భార్య స్వర్ణలత, కుమారుడు ఆదర్శ్, కుమార్తెశైలజ, తల్లి జమున దేవిలు ఉన్నారన్నారు.

= మిగిలిన వారి కోసం ముమ్మరంగా సహాయక చర్యలు

టెన్నెల్‌లో చిక్కుకున్న వారిని కనుగొనే ఆపరేషన్‌లో 25 కేంద్ర, రాష్ట్ర , ప్రైవేట్‌సంస్థలకుచెందిన 700లమంది సిబ్బంది నిమగ్నమై ఉన్నారని అధికారులు తెలిపారు. సోమవారం జరిగిన అధికారిక సమావేశంలో అధికారులు , రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రమాదం జరిగిన ప్రదేశం సొరంగంలోపల 14కిలోమీటర్లలోతులో జరిగిందని, అక్కడ వెంటిలేషన్ వెలుతురు తక్కువగా ఉండటంవలన ఆపరేషన్ మరింత క్లిష్టంగా మారిందని తెలియజేశారన్నారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో 30మీటర్ల ప్రాంతాన్ని ముఖ్యంగా ప్రమాదకరమైనదిగా గుర్తించామని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రభుత్వ నిర్ణయంమేరకు మిగిలిన ఆరు మృతదేహాలను గుర్తించేవరకు ఎస్ఎల్‌బిసిటన్నెల్లో సహాయక చర్యలు కొనసాగుతాయని కలెక్టర్ తెలిపారు.

## సిపిఐ వాయిదా తీర్మానం తిరస్కరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతుల ద్వారా ఉద్యోగులకు చెల్లించే వేతనాలను ఏజెన్సీల ద్వారా కాకుండా కార్పొరేషన్ల ద్వారా చెల్లించాలని సిపిఐ శాసనసభా పక్షనాయకులు కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి సంవత్సరం వారికి ఇంక్రిమెంట్లు, ఉద్యోగ నోటిఫికేషన్‌లో వెయిటేజీని ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. శాసనసభ మంగళవారం ఉదయం సమావేశం కాగానే రాష్ట్ర వ్యాప్తంగా అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతుల ద్వారా ఉద్యోగులకు చెల్లించే వేతనాలను ఏజెన్సీల ద్వారా కాకుండా కార్పొరేషన్ల ద్వారా చెల్లించాలని సిపిఐ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. అకారణంగా మరణించిన, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు రూ.10 లక్షల నష్టపరిహారంతో పాటు వారి కుటుంబంలో ఒకరికి ఉపాధి సౌకర్యం కల్పించాలని కూనంనేని సాంబశివరావు వాయిదా తీర్మానంలో కోరారు.

## రద్దు చేయాలి (మొదటి పేజీ తరువాయి)

సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో 72వ మిస్ వరల్డ్ 2025 అందాల పోటీలను నిర్వహించడాన్ని వ్యతరేకిస్తూ, మహిళలను హానికరమైన వస్తురూపీకరణ, సామ్రాజ్యవాద ప్రయోజనాలను ప్రోత్సహించే ఈ పోటీలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ హిమాయత్‌లో మంగళవారం భారత జాతీయ మహిళా సమాఖ్య ప్రదర్శన నిర్వహించింది. అందాల పోటీలను రద్దు చేయాలని, మహిళల అభివృద్ధిని ప్రోత్సహించాలని, మహిళా సాధికారతకు ఎక్కువ నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఎన్ఎఫ్ఐడబ్ల్యూ శ్రేణులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నేదునూరి జ్యోతి మాట్లాడుతూ తెలంగాణ సమాజంలో అసభ్యతకు చోటు లేదన్నారు. హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ అందాల పోటీని నిర్వహించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతించడాన్ని ఆమే తీవ్రంగా ఖండించారు. అందాల పోటీలు స్త్రీ శరీర ప్రదర్శన తప్ప మరేమీ కాదన్నారు. సామ్రాజ్యవాద మార్కెట్‌ల విస్తరణను ప్రోత్సహించడానికి, వాణిజ్య ఉత్పత్తులను విక్రయించడానికి రూపొందించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ సృష్టికి పథకాలను ప్రవేశపెట్టడంలో, మహిళల భద్రతను నిర్ధారించడంలో, మహిళలపై హింసాత్మక చర్యలపై తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైందని తీవ్రస్థాయిలో విమర్శించారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యూ సీనియర్ నాయకురాలు పి. ప్రేమ పావని మాట్లాడుతూ సామ్రాజ్యవాద ప్రయోజనాలను ప్రోత్సహించే ఈ అందాల పోటీని హైదరాబాద్‌లో నిర్వహించాల్సిన అవసరం లేదని, వెంటనే రద్దు చేయాలడి ప్రేమ్ పావని డిమాండ్ చేశారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యూ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శు పడాల నళిని, ఎస్. ఛాయాదేవి మాట్లాడుతూ మహిళల విద్య, నైపుణ్యాలు, కెరీర్, సాధికారత మెరుగుపరచడంపై దృష్టి పెట్టకుండా అందాల పోటీలను నిర్వహించడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందాల పోటీలకు అనుమతినిచ్చి సమాజంలో అసభ్యతకు చోటు కల్పించడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో జరగబోయే అందాల పోటీలను వెంటనే రద్దు చేయాలని, లేనిపక్షం మే 7 నుండి 31 వరకు జరిగే ఈ అందాల పోటీలను అడుగడునా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఫైమీద, నాయకులు ఎన్. కరుణ కుమారి, జ్యోతి శ్రీమాన్, షహనా అంజూమ్, రొయ్యల గిరిజ, ఎం. లక్ష్మి , కె. అరుణ, వి. కమల, ఎ. దేవమ్మ, సి.హెచ్. లావణ్య పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థను సరిచేసేందుకు సమయం పడుతుంది

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కుప్పకూలిన విద్యా వ్యవస్థను సరిచేసేందుకు సమయం పడుతుందని శాసనసభ వ్యవహారాల, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. గత ప్రభుత్వంలో టీచర్లను కూడా నియమించలేదని ఆరోపించారు. రాష్ట్రంలో 79 అదనపు పాఠశాలలను తాము పునరుద్ధరించామని వివరించారు. ''పాఠశాల, ఉన్నత విద్య, సాంకేతిక విద్య, వాణిజ్య పన్నులు, యువజన,క్రీడలు,రోడ్డు భవనాలు, మద్యనిషేధ, అబ్కారీ,పర్యాటక ,కళలు, సాంస్కృతిక, అడవులు,శాస్త్ర సాంకేతిక ,పర్యావరణం, మత సంబంధ ధర్మాదాయాల శాఖలకు'' సంబంధించిన పద్దులపైన శాసనసభలో మంగళవారం జరిగిన చర్చలో బిఆర్‌ఎస్ సభ్యులు సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో ఆరు వేల పాఠశాలలు మూతపడ్డాయని, తాము అధికారంలో వచ్చిన తర్వాత వాటిని పునరుద్ధరిస్తామని ప్రస్తుత సిఎం , ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హామీనిచ్చారని , ఇందులో ఎన్ని పాఠశాలలను పునరుద్ధరించారని ప్రశ్నించారు. దీనిపైన మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ విద్యావ్యవస్థబాగు కోసం గతంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన కడియం శ్రీహరి అప్పటి ముఖ్యమంత్రిని కలిసి విన్నవించినా ఆయన స్పందించలేదని, సబితాఇంద్రారెడ్డి కూడా విద్యాశాఖ మంత్రిగా మంచి చేద్దామని భావించినప్పటికీ ఆ పరిస్థితులు ఆ వ్యవస్థలో (కెసిఆర్ )అంతా ఒక్కటే వైపు ఉంటుందని ఎద్దేవా చేశారు. డిఎస్‌సి ద్వారా తాము 11వేల మంది టీచర్లను నియమించామని వివరించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు జోక్యం చేసుకుంటూ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులను ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు పాఠశాలలోనే ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అప్పటి టిఆర్‌ఎస్ ప్రభుత్వంలో జిల్లా కలెక్టర్ల సమావేశంలోనే సిఎం కెసిఆర్‌కు సూచించినప్పటికి ఆయన స్పందించలేదని తెలిపారు. గత ప్రభుత్వం గురుకులాలకు ఇచ్చిన ప్రధాన్యత ప్రభుత్వ పాఠశాలలపై శ్రద్ధ చూపలేదని ఆరోపించారు.

## ఎఐసిసి డ్రాఫ్టింగ్ కమిటీలో డిప్యూటీ సిఎంమల్లు భట్టి విక్రమార్కకు చోటు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఏప్రిల్ 8, 9 తేదీలలో జరగనున్న అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) కీలక సమావేశాల కోసం ఏర్పాటు చేసిన డ్రాఫ్టింగ్ కమిటీలో తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నియమితుల య్యారు. ఎఐసిసి అధ్య క్షులు మల్లిఖార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ ఎఐసిసి డ్రాఫ్టింగ్ కమిటీని ప్రకటించా రు.అహ్మదాబాద్‌లో జరిగే ఎఐసిసి సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు వ్యూహాలు, విధానాలు, రాజకీయ నిర్ణయాలను రూపొందించడంలో డ్రాఫ్టింగ్ కమిటీ ముఖ్యమైన పాత్ర పోషిస్తుం ది. ఇందులో భట్టి విక్రమార్కకు చోటు దక్కడం ఆయన రాజకీ య నైపుణ్యం, అనుభవం, పార్టీ పట్ల నిబద్ధతకు నిదర్శనమని కాంగ్రెస్ వర్గాలు చెబుతు న్నాయి. ఏప్రిల్ 8న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) సమావేశం జరగనుంది.ఆ తర్వాత ఏప్రిల్ 9న ఎఐసిసి ప్రతినిధుల సమావేశం జరు గుతుంది.

## వివక్ష ఎందుకు? (మొదటి పేజీ తరువాయి)

ఆలస్యం కావడం, తక్కువ వేతనాలే దీనికి కారణమని అన్నారు. గత మూడు నెలలుగా కూలీలకు వేతనాలు అందలేదని, ఈ పథకం కింద రూ. 811 కోట్లు రావాల్సి ఉందని తెలిపారు. గ్రామీణాభివృద్ధిపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఉపాధి హామీ కూలీల వేతనాలను ద్రవ్యోల్బణంతో అనుసంధానించి... పనిదినాలను 150కి పెంచాలని సిఫార్సు చేసిందని... ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న మొత్తాన్ని ఆలస్యం లేకుండా విడుదల చేస్తుందా అని ప్రకాష్ ప్రశ్నించారు. డిఎంకె ఎంపి కనిమొళి కూడా ఈ విషయంపై ఆందోళన వ్యక్తం చేశారు. తమిళనాడుకు ఉపాధి హామీ పథకం కింద గత ఐదు నెలలుగా రూ. 4,034 కోట్ల చెల్లింపులు రావాల్సి ఉందని చెప్పారు. 'ఈ పథకం డిమాండ్ ఆధారితమైంది. చెల్లింపులు 15 రోజులకు పైగా ఆలస్యమైతే... వాటిని కార్మికులకు వడ్డీతో సహా చెల్లించాలి. తమిళనాడు ముఖ్యమంత్రి ప్రధానమంత్రికి లేఖ రాశారు. మేము మంత్రిని కలిశాము. బకాయిలు చెల్లిస్తామని ఆయన మాకు హామీ ఇచ్చారు. కానీ మేము ఇంకా ఏమీ జరగలేదు' అని ఆమె అన్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి చంద్రశేఖర్ పెమ్మసాని సమాధాన మిస్తూ... నిధులను నిలిపివేశారనే వాదనలను తోసిపుచ్చారు. ఈ సంవత్సరం కేరళకు ఇప్పటికే దాదాపు రూ. 3,000 కోట్లు అందాయన్నారు. 'చట్టం ప్రకారం, ఆలస్యం జరిగితే... రాష్ట్ర ప్రభుత్వం మొదట్లో ఆ మొత్తాన్ని చెల్లిస్తుంది. కేంద్ర ప్రభుత్వం దానిని తిరిగి చెల్లిస్తుంది. తమిళనాడు ఇప్పటికే రూ. 7,300 కోట్లు అందుకుంది. ఏడు కోట్ల జనాభా ఉన్న తమిళనాడు రూ. 10,000 కోట్లకు పైగా అందుకుంటుంది. ఇది 20 కోట్ల జనాభా కలిగిన ఉత్తరప్రదేశ్‌తో పోల్చవచ్చు. పక్షపాతం అనే ప్రశ్న లేదు' అని మంత్రి అన్నారు. కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కూడా ప్రభుత్వాన్ని సమర్థిస్తూ... ''తమిళనాడు అయినా, పశ్చిమ బెంగాల్ అయినా, మోదీ ప్రభుత్వం ఏ రాష్ట్రం పట్లా ఎప్పుడూ వివక్ష చూపలేదు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి పథకం బకాయిలు, మెటీరియల్ ఖర్చులు సహా, త్వరలో విడుదల చేయబడతాయని చెప్పారు.

**'ఉపాధి' వేతనాలు పెంచాలి: రాహుల్, ప్రియాంక**

కేంద్రప్రభుత్వం ఉపాధి హామీ కార్మికులను నిర్లక్ష్యం చేస్తోందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, వయనాడ్ ఎంపి ప్రియాంకగాంధీ మండిపడ్డారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి అనుగుణంగా వారి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్రం ఉపాధి హామీ వేతన బకాయిలు విడుదల చేయకపోవడంపై కేరళకు చెందిన కాంగ్రెస్ ఎంపిలు పార్లమెంటు ప్రాంగణంలో చేపట్టిన నిరసనలో రాహుల్, ప్రియాంక పాల్గొన్నారు. ప్రభుత్వ నిష్క్రియాపర్వం లక్షలాది కుటుంబాలకు జీవనోపాధి లేకుండా చేసిందని, పేదరికాన్ని పెంచిందని కాంగ్రెస్ వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీ అన్నారు. కేంద్రప్రభుత్వం తక్షణమే ఉపాధి హామీ వేతన బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పనిదినాలను 150 రోజులకు పెంచాలన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు కేసీ వేణుగోపాల్ ,శశి థరూర్, కేరళకు చెందిన ఇతర పార్టీ ఎంపిలు కూడా నిరసనలో పాల్గొన్నారు.

# పడిపోతున్న ప్రమాణాలు

**(మొదటి పేజీ తరువాయి)**

తరగతుల విద్యార్థుల డ్రాప్ అవుట్‌లో 2020–21లో దేశం 13.9 శాతం ఉండగా, తెలంగాణలో 22.1 శాతంగా ఉన్నదన్నారు. కేరళలో వంద శాతం అక్షరాస్యత ఉన్నదని, తమిళనాడులో ఐఐటి, ఎఐఎం, దేశంలోనే రెండవ స్థానంలో ఉన్నదని, హిమాచల్‌ప్రదేశ్ 4వ స్థానం, గోవా 5వ, ఢిల్లీ6వ, కర్నాటక 7వ, రాజస్థాన్ 8వ స్థానం, ఉత్తరాఖండ్ 9వ స్థానం, పంజాబ్ 10వ స్థానంలో ఉన్నాయని వివరించారు. సైన్స్, మ్యాథ్స్, ఇంగ్లీష్ సబ్జెక్ట్ విషయంలో మన పదవ తరగతి విద్యార్థులు ఇతర దేశాలలో చదువుతున్న ఐదవ తరగతి విద్యార్థులతో కూడా సమానంగా ఉండడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ చర్యల కారణంగా ఇప్పటికీ తెలంగాణ రాష్ట్రం కేరళ, తమిళనాడు రాష్ట్రాల కంటే దిగువన ఉన్నామన్నారు. డిగ్రీ, పిజి కళాశాలలకు ప్రభుత్వం స్వయం ప్రతిపత్తి కల్పిస్తున్నప్పటికీ వాటిపై తిరిగి నిఘా పెట్టడంలేదని ఆరోపించారు. గురుకులాల్లో కూడా ప్రభుత్వం నిధులను బాగా ఖర్చు చేస్తున్నప్పటికీ అందుకు తగిన నిఘా, నియంత్రణ లేదన్నారు. విద్య, వైద్య రంగాల బాధ్యతలను జిల్లా స్థాయిలో ఐఎఎస్ అధికారులకు అప్పగిస్తే కొంత మేరకు సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన అన్నారు. బిటెక్ అంటే ఇంటర్‌మీడియట్ మాదిరిగా మారిందని చెప్పారు. స్విడ్జర్‌లాండ్, డెన్మార్క్, ఫిన్‌లాండ్, నెదర్లాండ్, ఐస్‌లాండ్ దేశాలలో అక్కడి టీచర్లకు ఐఎఎస్ కంటే ఎక్కువ మొత్తంలో వేతనాలు ఇస్తారని, ఎక్కువ గౌరవంగా చూసుకుంటారని, విద్యా ప్రమాణాలు, విద్యార్థులు సంతోషంగా ఉన్న దేశాలలో ప్రపంచంలోనే పిన్‌లాండ్ నంబర్ వన్ దేశంగా నిలిచిందన్నారు.

**తక్కువ వేతనాల కోసమే రకరకాల పేర్లతో టీచర్ల నియామకం**

ప్రాథమిక, ఉన్నత, సాంకేతిక విద్య సంస్థలలో అవసరం మేరకు బోధన సిబ్బందిని నియమించకుండా, తక్కువ వేతనాలు ఇచ్చేందుకు రకరకాల పేర్లతో ఉపాధ్యాయులను నియమించారని కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఒకే తరహా బోధన అందిస్తున్న వారిని గెస్ట్, పార్ట్ టైమ్, రెగ్యులర్, కాంట్రాక్టు ఇలా రకరకాల పేర్లతో తక్కువ వేతనాలకు నియమించారని, వీరందరిని ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి వేతనాలను పెంచాలన్నారు. ఫ్యాకల్టీలకు తక్కువ వేతనాలు చెల్లించడం కూడా విద్యా ప్రమణాలు పడిపోవడానికి ఒక కారణమన్నారు.

**బెల్టు షాపులు ఎత్తివేయండి.. కుదిరితే మద్యనిషేధం విధించండి**

రాష్ట్ర వ్యాప్తంగా మద్యం బెల్టు షాపులను ఎత్తివేయాలని, కుదిరితే మద్యనిషేధం విధిస్తే బాగుటుందని కూనంనేని సాంబశివరావు ప్రభుత్వానికి సూచించారు. బెల్టు షాపుల ఎత్తివేత, ఆబ్కారీ ఆదాయం పెంపు విషయంలో బిఆర్‌ఎస్ మాట్లాడడం విడ్డూరమన్నారు. బెల్టు షాపులు ఎవరి నుంచి వచ్చాయని, ఆదాయం పెరగడం ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు. రాష్ట్రంలో బెల్టు షాపులు పూర్తిగా ఎత్తివేసే ధైర్యం బిఆర్‌ఎస్, కాంగ్రెస్‌లకు ఉన్నదా? అని ప్రశ్నించారు. బెల్టు షాపులు ఎత్తివేయాలనే హక్కు బిఆర్‌ఎస్, కాంగ్రెస్‌లకు లేదని, కమ్యూనిస్టు పార్టీగా తమకు మాత్రమే ఉన్నదన్నారు. నకిలీ మద్యం, గుండుంబాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కల్లును ఒక పరిశ్రమగా గుర్తిస్తే, ఆ కల్లుపై ఆధారపడిన కల్లు గీత కార్మికుల కుటుంబాలకు మేలు జరుగుతుందని, ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని సూచించారు. స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల ఎగవేతలు ఎన్ని ఉన్నాయో గుర్తించారా? అని ఆయన ప్రశ్నించారు.

**భద్రాచలం శ్రీరాముల దేవాలయాన్ని అభివృద్ధి చేయండి**

గోదావరి, కృష్ణ పరివాహక ప్రాంతాలతో పాటు చార్మినార్, గోల్కొండ, అంబేద్కర్ విగ్రహం, ట్యాంక్‌బండ్, సాలార్‌జంగ్ మ్యూజియం, గడీలను, యాదగిరిగుట్ట, వీరభద్రగుడి, నేలకొండపల్లి, కొత్తగూడెం, అటవీ క్షేత్రాలు, కిన్నెరసాని, నల్లమల అటవీప్రాంతం, ఆదిలాబాద్ ఇలా తదితర ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తే తెలంగాణ రాష్ట్రం పర్యాటక హబ్‌గా మారుతుందని కూనంనేని సాంబశివరావు తెలిపారు. గతంలో భద్రాద్రి శ్రీరాముల దేవాలయాన్ని ఎందుకు నిర్లక్ష్యం చేశారని, చాలా అన్యాయం జరిగిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా భద్రాచలంను అభివృద్ధి చేస్తే తెలంగాణ రాష్ట్రంలో రెండవ స్థానంలో ఉంటుందని, రాములవారి దేవాలయాల్లో దక్షిణ భారతదేశంలో మొదటి స్థానంలో ఉంటుందని తెలిపారు.

**ప్రతి జిల్లా, పట్టణ కేంద్రాలలో సాంస్కృతిక కేంద్రాలను ఏర్పాటు చేయండి**

ప్రతి జిల్లా, పట్టణ కేంద్రాల్లో సాంస్కృతిక కేంద్రాలను నిర్మించాలని, కళాకారులను ప్రోత్సహించాలని కూనంనేని సాంబశివరావు ప్రభుత్వానికి సూచించారు. విప్లవ సంఘాలను నిర్లక్ష్యం చేస్తున్నారని, పాట పుట్టిందే విప్లవ సంఘాల నుంచి అని, పాటల నుంచే పోరాటం, పోరాటం నుంచి పాట పుట్టాయని గుర్తు చేశారు. ప్రజా నాట్యమండలి, అరుణోదయ లాంటి విప్లవ సంఘాలను గుర్తించి, పెన్షన్ ఇతర సౌకర్యాలను అమలు చేయాలని కోరారు. గద్దర్, అందెశ్రీలను ప్రభుత్వం గుర్తించిందని, ఇంకా దాశరథి, సినారె, సురవరం ప్రతాప రెడ్డి లాంటి సాహిత్యవేత్తలు, కళాకారులతో ఒక మ్యూజియం ఏర్పాటు చేయాలన్నారు. గత ప్రభుత్వం ఉత్తర తెలంగాణ తరహా ఖమ్మం రహదారులను ఎందుకు అభివృద్ధి చేయలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారుల అభివృద్ధి విషయంలో రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తన స్థాయికి మించి కష్టపడుతున్నారని, ఢిల్లీకి వెళ్తున్నారని కూనంనేని అభినందించారు.




# జనరల్

STATE NEWS REGIONAL NEWS

## ఎస్‌బిఐ ఉద్యోగుల సహకారం ఉన్నతమైంది

గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికిగాను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్ మంగళవారం రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్, సాయుధ దళాల పతాక దినోత్సవనిధి చైర్మన్ జిష్ణుదేవ్ వర్మకు రూ. 37,16,500 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ ఎస్‌బిఐ ఉద్యోగుల కృషిని అభినందించారు. వారి సహకారం ఉన్నతమైనదని, ఇలాంటి సహాయం ఇతర సంస్థలు, పౌరులు అనుసరించడానికి ప్రేరణనిస్తుందన్నారు. గత 10 సంవత్సరాలుగా వారు చేస్తున్న సహాయానికి వారి అంకితభాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ కల్నల్ రమేష్ కుమార్, ఎస్‌బిఐ డిజిఎం, సిడిఒ జితేంద్ర కుమార్ శర్మ పాల్గొన్నారు.

## హాని కలిగించే 'కోనోకార్పస్' చెట్లను తొలగించండి

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గత ప్రభుత్వ హయాంలో నాటిన మొక్కలల్లో ప్రజలకు హాని కలిగించే 'కోనోకార్పస్' చెట్లు పెద్ద సంఖ్యలో ఉన్నాయని,ఆ చెట్లు ఆక్సిజన్ ఉత్పత్తికి హానికరమని, వాటిపై పక్షులు కూడా కూర్చొవని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శాసనసభలో మంగళవారం పద్దులపై జరిగిన చర్చలో బిఆర్ఎస్ సభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి హరితహారం కార్యక్రమంలో మొక్కులు నాటిన విషయాన్ని ప్రస్తావించారు. దీనిపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జోక్యం చేసుకునిపై విధంగా స్పందించారు. అనంతరం వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ ఎక్కడో ఒక్క దగ్గర ఉండొచ్చని,అలాంటి మొక్కలు ఒక్క శాతం కూడా ఉండబోదని వివరించారు. దీనిపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మరోసారి స్పందిస్తూ 'కోనోకార్పస్' చెట్లను పెద్ద సంఖ్యలో నాటారని, హైవేలు, డివైడర్లు సహా అనేక ప్రాంతాల్లో ఈ చెట్లు కనిపిస్తున్నాయని, ఈ చెట్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు.



## ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కారం

మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అసెంబ్లీ సమావేశాలనంతరం దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్, అసెంబ్లీ ఆవరణలో మంగళవారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివ రావుతో కలసి ఎఐటియుసి ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు విఎస్ బోస్, ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్స్ జెఎసి కన్వీనర్ బి. వెంకటేశం మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలసి వినతిపత్రం అందజేశారు. గత నెలలో జరిగిన చర్చల్లో ఏప్రిల్ నెలలో ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరిస్తానని ఇచ్చిన హామీని వారు మంత్రికి గుర్తు చేసారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల మేరకు సంవత్సరానికి రూ.12వేల ఆర్థిక సహాయం, ఇంధన చార్జీల పెంపునకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలు పెంచడం, రవాణారంగా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు, కొత్త ఆటో పర్మిట్ల మంజూరు, రాష్ట్ర ప్రభుత్వమే రవాణా అప్ ఏర్పాటు, స్కూల్ వ్యాన్లు, ఓలా, రాపిడో, ఉబెర్ ద్విచక్ర వాహనాలు, ఇతర జిల్లాల ఆటో లను నిషేధించడం వంటి ప్రధాన డిమాండ్ లను తక్షణమే పరిష్కరించాలని బి. వెంకటేశం విజ్ఞప్తి చేసారు. అందుకు స్పందించిన మంత్రి పొన్నంప్రభాకర్ అసెంబ్లీ సమావేశాల అనంతరం ఆటో యూనియన్లతో చర్చించి సమస్యలను పరిష్కరించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపడుతుందని భరోసా ఇచ్చారు.

## హోంమంత్రి పదవి చాలా ఇష్టం

కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తనకు మంత్రి పదవి వస్తుందనే అనుకుంటున్నానని, హోంమంత్రి పదవి అంటే చాలా ఇష్టమని కాంగ్రెస్ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన మనసులోని మాటను బయటపెట్టారు. శాసన సభా ప్రాంగణంలో మంగళవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మంత్రి పదవుల కేటాయింపుపై ఢిల్లీలో కాంగ్రెస్ అధిష్టానం వద్ద జరుగుతున్న కసరత్తుపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. అధిష్టానం ఏ పదవి ఇచ్చినా చేస్తానని, తనకు మంత్రి పదవి వస్తుందని ఆశిస్తున్నానని అన్నారు. అలాగే సామర్థ్యాన్ని బట్టి మంత్రులను ఎంపిక చేయాలన్నారు. భువనగిరి ఎంపి ఎన్నికల బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తించానని చెప్పారు. తనకు హోంశాఖ అంటే ఇష్టమని, కానీ ఏ పదవి ఇచ్చినా సమర్థవంతగా నిర్వహిస్తానన్నారు. ప్రస్తుతానికి తనకు ఢిల్లీ నుంచి ఎటువంటి ఫోన్ రాలేదన్నారు. కాగా సోమవారం ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో కాంగ్రెస్ అధిష్టాన పెద్దలతో సిఎం, డిప్యూటీ సిఎం, ఇతర ముఖ్య నాయకులు భేటీ అయిన విషయం తెలిసిందే. ఈ సమావేశంలో మంత్రి పదవులు, డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్ తదితర పదవులపై చర్చ జరిగినట్లు సమాచారం. ఇందులో ముఖ్యంగా మంత్రివర్గ విస్తరణ గురించి చర్చ జరిగింది. ఇందులో పలు సామాజిక వర్గాల నుంచి నలుగురికి చోటు దక్కనున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో మంత్రివర్గంలో చోటు కోసం ఎదురు చూస్తున్న ఆశావహుల మధ్య తీవ్ర ఉత్కంఠత నెలకొంది. ఈ విషయాలపై మంగళవారం అసెంబ్లీ లాబీల్లో కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల మధ్య ఇష్టాగోష్టిగా మాట్లాడుకోవడం కనిపించింది. ప్రస్తుతం తెలంగాణలో మంత్రివర్గ విస్తరణపై జోరుగా చర్చ నడుస్తోంది.



## క్యాన్సర్ బాధితుడికి మంత్రి శ్రీధర్‌బాబు భరోసా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'సార్, నాకు క్రికెట్ అంటే చాలా ఇష్టం. పెద్ద క్రికెటర్ కావాలని కలగన్నా.. నాకో క్రికెట్ కిట్ ఇప్పించండి సార్' క్యాన్సర్‌తో పోరాడుతున్న ఓ యువకుడి మాటలివి. వింటే మనసున్న ప్రతీ మనిషికీ గుండె చెమర్చక మానదు. ఈ మాటలకే మంత్రి శ్రీధర్ బాబు ఏకంగా కన్నీళ్లు పెట్టుకున్నారు. భూపాలపల్లి జిల్లా పాలిమల మండలం సర్వాయ్‌పేట గ్రామానికి చెందిన భౌత్ నితిన్ కాన్సర్‌తో బాధపడుతూ... ఖాజాగూడలోని ఓ ప్రైయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి శ్రీధర్ బాబు స్వయంగా ఆసుపత్రికెళ్లి పరామర్శించారు. నేనున్నానని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా నితిన్ మాటలకు కన్నీళ్లు పెట్టుకున్న శ్రీధర్‌బాబు.. అప్పటికప్పుడు క్రికెట్ కిట్ తెప్పించి అతని కోరికను నెరవేర్చారు. సొంతన్నగా వెంట నిలుస్తానని, ఏ అవసరమున్నా నేరుగా నన్ను సంప్రదించండి అంటూ నితిన్ తల్లిదండ్రులకు మంత్రి ధైర్యం చెప్పారు.

## గిరిజనుల సంస్కృతి వారసత్వాలకు వేదికగా ట్రైబల్ మ్యూజియం

బ్రోచరును విడుదల చేసిన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భద్రాచలంలో ట్రైబల్ మ్యూజియం ఏర్పాటుతో గిరిజనుల గొప్ప సంస్కృతి, వారసత్వాన్ని ప్రపంచానికి తెలియజేయడానికి మరింత అవకాశం ఏర్పడిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శాసనసభ ఆవరణలో మంగళవారం భద్రాచలం ట్రైబల్ మ్యూజియం బ్రోచర్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఈ మ్యూజియం గిరిజన సంప్రదాయాలను, వేషభాషలను, జీవన విధానాన్ని, హస్తకళలను, ప్రజా గీతాలను, ఆచార వ్యవహారాలను ప్రత్యేకంగా ప్రదర్శించేందుకు ఉపయోగపడుతుందన్నారు. మ్యూజియంను భద్రాచలంలో శ్రీరామనవమి వేడుకల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తామని వెల్లడించారు. ట్రైబల్ మ్యూజియం ఏర్పాటుతో భద్రాచలం పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చెందుతుందని, ఇది స్థానిక గిరిజనులకు ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని మంత్రి తెలిపారు. గిరిజన సంస్కృతి పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత అని పేర్కొంటూ, 'గిరిజనుల జీవన విధానం, వారి సంప్రదాయాలు క్రమంగా మాయమవుతున్నాయని, వారి వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించడానికి ఇలాంటి మ్యూజియం ఎంతో అవసరమని మంత్రి అన్నారు.

గిరిజన కళాకారుల ప్రతిభను ప్రపంచానికి చాటేందుకు, వారి చేతిపనులకు విస్తృత మార్కెట్‌ను అందించేందుకు ఈ మ్యూజియం దోహదపడుతుందని, భద్రాచలం చుట్టుపక్కల ఉన్న గిరిజన గ్రామాల అభివృద్ధికి ఇది ఒక కీలకమైన అడుగు అని ఆయన పేర్కొన్నారు.

## ఆ ముగ్గురు సల్లంగుంటే సరిపోతుందా?

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గజ్వేల్, సిరిసిల్లా, సిద్దిపేట రహదారులు బాగుంటే చాలా?, ఆ 'ముగ్గురు' సల్లంగుంటే సరిపోతుందని అనుకున్నారని రహదారుల, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేసిన రహదారుల పనులను తాము 15నెలల్లో చేశామన్నారు. రూ.6600 కోట్ల పనుల్లో సగం పనుల ప్రక్రియ మొదలైందని వివరించారు. ఆర్ఆర్ఆర్ ప్రాజెక్ట్‌కు సంబంధించి రెండు నెలల్లో పెండింగ్‌లో ఉన్న అనుమతులను మంజూరు చేస్తామని కేంద్రం రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ హామీఇచ్చిన విషయాన్ని ఆయన సభలో వివరించారు. "పాఠశాల, ఉన్నత విద్య, సాంకేతిక విద్య, వాణిజ్య పన్నులు, యువజన, క్రీడలు, రోడ్డు భవనాలు, మద్యనిషేధ, అబ్కారీ, పర్యాటక, కళలు, సాంస్కృతిక, అడవులు, శాస్త్ర సాంకేతిక, పర్యావరణం, మత సంబంధ ధర్మాదాయాల శాఖలకు" సంబంధించిన పద్దులపైన శాసనసభలో మంగళవారం జరిగిన చర్చలో బిఆర్ఎస్ సభ్యులు వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్ఆర్ఆర్ జాతీయ రహదారుల నంబర్ కేటాయించలేదని,ఈ ప్రాజెక్ట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఎకరా కూడా భూ సేకరణ చేపట్టలేదన్నారు. రహదారుల నిర్మాణంపై ప్రశాంత్ రెడ్డి ప్రస్తావించిన అంశాలపైన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పందిస్తూ ఆర్ఆర్ఆర్‌కు జాతీయ రహదారుల నంబర్ కేటాయించారన్నారు. బిఆర్ఎస్ హయాంలో వేసిన రహదారులకు ప్రస్తుతం తమ ప్రభుత్వం బిల్లులను చెల్లిస్తుందని తెలిపారు. ఒఆర్ఆర్ ప్రాజెక్ట్‌ను గత కాంగ్రెస్ ప్రభుత్వం చేపడితే, ఎన్నికల ముందు ఆ ప్రాజెక్ట్‌ను బిఆర్ఎస్ ప్రభుత్వం అమ్ముకున్నదని ఆరోపించారు.

## బడుగు, బలహీనవర్గాల కోసం నిరంతరం పోరాటం

చేర్యాలలో సిపిఐ శతాబ్ది ఉత్సవాల్లో చాడ వెంకట రెడ్డి




**ప్రజాపక్షం/చేర్యాల :** గ్రామ గ్రామాన కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి కార్యకర్తలు సన్నద్ధం కావాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి అన్నారు. సిపిఐ 100 సంవత్సరాల వార్షికోత్సవాల సందర్భంగా మంగళవారం చేర్యాల పట్టణంలోని గాంధీ చౌరస్తా నుండి అంగడి బజారు వరకు సిపిఐ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం షాదీ ఖానా ఫంక్షన్ హాలులో నిర్వహించిన సభకు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ అధ్యక్షతన వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చాడ వెంకటరెడ్డి హాజరై మాట్లాడుతూ..1925 డిసెంబరు 26న కాన్పూర్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా సిపిఐ నిరంతరం భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం సామాజిక న్యాయం కోసం అణగారిన వర్గాల ఆశయ సాధనకు పోరాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై అలుపెరుగని పోరాటాలు చేస్తుంది ఒక్క సిపిఐ పార్టీనే అని అన్నారు. ప్రపంచంలో సూర్యచంద్రులు ఉన్నంత కాలం ఎర్రజెండా ప్రజల కోసం జీవిస్తూ ఉంటుందని అన్నారు. నాటి నుండి నేటి వరకు పేద బడుగు బలహీన వర్గాల పక్షాన నిరంతరం పోరాడుతునే ఉంటుందని ప్రభుత్వాలు పాలకులు మారిన పేద కార్మిక రైతుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు.ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ శ్రేణులు బలమైన ఉద్యమ పోరాటాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర నాయకులను సీనియర్ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్, జనగామ జిల్లా కార్యదర్శి మాజీ ఎంఎల్‌ఏ రాజారెడ్డి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపే మల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు బట్టు దయానంద రెడ్డి,జాగిరి సత్యనారాయణ, ఎడల వనేష్, కిష్టపురం లక్ష్మణ్, కనుకుంట్ల శంకర్, జేరుపోతుల జనార్ధన్, ఈరి భూమయ్య, బాల్ మోహన్, పద్మ, నరేష్, రజిని, మమత, సత్యానారాయణ, మహేందర్, కృష్ణ, బాస్కర్ రెడ్డి, ప్రేమ్ కుమార్, సుదర్శన్, బాల్‌రెడ్డి, రాజేశం, కనుకయ్య, శ్రీకాంత్, సుధాకర్, అంజయ్య తదితరుల పాల్గొన్నారు.

## ఎంపిల వేతనాల పెంపును ప్రజలు హర్షించరు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎంపిలు ఏ విధానాలతో జీతాలు పెంచుకున్నారో అదే రకంగా దేశంలోని కార్మికుల, ఉద్యోగస్తుల మరియు స్కీం వర్కర్ల, కాంట్రాక్ట్ కార్మికులు లాంటి సకల కష్టజీవులకు జీతాలు పెంచాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు విఎస్ బోస్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. లేకపోతే ఎంపిల వేతన పెంపుదల స్వార్థపూరిత చర్యగా చరిత్రలో మిగిలిపోతుందని ఆయన హెచ్చరించారు. ఎవరి వేతనాలు వారే పెంచుకునే వ్యవస్థ కేవలం మన ఎంపిలకు మాత్రమే ఉన్నదని, దేశంలో మరెవరికి లేదని వియస్ బోస్ అన్నారు. దేశంలోని వివిధ రంగాలలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులు వారి జీతాలు పెంపుదలను కోరితే ప్రభుత్వాలు కాలయాపన చేసి తర్వాత కమీషన్, కమిటీల పేరుతో మరింత కాలయాపన చేస్తూ వేతనాలు నిర్ణయిస్తారు. కానీ ఎంపిల వేతనాల పెంపుదలకు ఏలాంటి కమిటీ, కమిషన్ లేకుండానే వారి జీతాలు అమాంతం కొండంత పెంచేసుకున్నారని అన్నారు. కార్మికులు, ఉద్యోగస్తులు వారికి పెరిగిన జీతాలను వెనుక తేదీ నుండి అమలు చేయమంటే డబ్బులు లేవని, లేక గత బడ్జెట్లో ఏలాంటి కేటాయింపులు జీతాల కొరకు చేయలేదని మాటలతో మభ్యపెడతారు. కానీ దేశ ప్రజలకు తెలిసినంత వరకు ఎంపిల జీతభత్యాలు పెంపుదలకు 2023–2024, 2024–2025 బడ్జెట్లలో కేటాయింపులు చేసినట్లుగా ఎలాంటి దాఖలాలు లేవు. అయినా ఎంపిలు వారి పెరిగిన జీతాలు మరియు భత్యాలు 2023 ఏప్రిల్ నుంచి పొందటానికి తీర్మానం ఏకగ్రీవంగా చేసుకున్నట్లు వార్తా పత్రికల ద్వారా తెలుస్తున్నది. కనీసం 10వేలు జీతం కూడా పొందని అభాగ్యులు మన దేశంలోనే సుమారుగా కోటి మంది ఉంటారని ఒక అంచనా.

## రన్నింగ్ రైలులో అత్యాచారయత్నం ఘటనలో నిందితుడి గుర్తింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎంఎంటిఎస్ రన్నింగ్ రైలులో అత్యాచార యత్నాం, తప్పించుకునే క్రమంలో యువతి రైలులోంచి దూకి తీవ్రంగా గాయపడిన కేసులో రైల్వే పోలీసులు పురోగతి సాధించారు. అత్యాచార యత్నానికి పాల్పడిన యువకుడిని గుర్తించారు. సికింద్రాబాద్ నుంచి మేడ్చల్ వేళ్తున్న ఎంఎంటిఎస్ రైలులో మహిళా బోగిలో సోమవారం యువతి ప్రయాణించింది. ఆల్వాల్ స్టేషన్‌లో బోగిలో ఉన్న మరో ఇద్దరు మహిళలు దిగిపోయారు. ఆ సమయంలో యువతి ఒక్కతే ఆ బోగిలో ఉంది. ఈ విషయం గమనించిన ఓ యువకుడు యువతిపై అత్యాచార యత్నానికి ఒడిగట్టాడు. అతని నుంచి తప్పించుకునే క్రమంలో ధైర్యం చేసిన యువతి రన్నింగ్ రైలులోంచి బయటికి దూకిన విషయం తెలిసిందే. తీవ్ర గాయాలకు గురైన యువతికి పోలీసులు మెరుగైన చికిత్స అందిస్తున్నారు. ఆమెకు ప్రాణాపాయం తప్పిందని రైల్వే ఎస్పి చందనాదీప్తి పేర్కొన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని రైల్వే స్టేషన్ లలో ఉన్న సిసి కెమెరాలను చెక్ చేశారు.సుమారు 200లకు పైగా సిసి కెమెరాలను పోలీసులు పరిశీలించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి గుండ్లపోచంపల్లి వరకు 14 రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలను పోలీసులు పలు బృందాలుగా ఏర్పడి జల్లెడ పడుతున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో సిసి కెమెరాలు లేకపోవడంతో నిందితుడిని గుర్తించడంలో కొంత జాప్యం జరిగింది. అల్వాల్ రైల్వే స్టేషన్ వద్ద మహిళా కోచ్లోకి నిందితుడు వచ్చినట్లు గుర్తింపు పోలీసులు ప్రాథమిక విచారణలో నిర్ధారించారు. ఇప్పటికే పలువురు పాత నేరస్తుల ఫొటోలు భాధిత యువతికి చూపించగా నిందితుడిని గుర్తించలేదు. సిసిటివిలో రికార్డు అయిన ఫోటోలను యువతికి చూపించగా.. నిందితుడిని బాధితురాలు గుర్తుపట్టిందని తెలిసింది. అనంతరం వివరాలు సేకరించిన పోలీసులు యువతి పై దాడికి యత్నించిన వ్యక్తి జంగం మహేష్‌గా గుర్తించారు. నింధితుడు గత కొంత కాలంగా గంజాయికి బానిసగా మారి.. ఇంటికి దూరంగా ఉంటున్నట్లు పోలీసులు నిర్ధారించారు. ప్రస్తుతం నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలిపారు.

### బేగంబజార్‌లో గుర్తు తెలియని వ్యక్తి హత్య..

గుర్తు తెలియని వ్యక్తి హత్యకు గురైన సంఘటన బేగం బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. నాంపల్లి గాంధీ భవన్, ఎగ్జిబిషన్ గ్రౌండ్ సమీపంలో మనోరంజన్ కాంప్లెక్స్ వెనకాల ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించింది. కాగా మృతుని మెడపై గాయాలు అయిన ఆనవాళ్లు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని మార్చురికి తరలించారు. హతుడి, హంతకుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

### ఫ్లైఓవర్ పైనుంచి దూకి మహిళ ఆత్మహత్య

హైదరాబాద్‌లోని పాతబస్తీలో సోమవారం అర్ధరాత్రిషాదం చోటుచేసుకుంది. దబీర్ పూరా ఫ్లైఓవర్ పైనుంచి దూకి ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. సుమారు 50 అడుగుల ఎత్తు నుంచి దూకడంతో తీవ్రగాయాలపాలై ఆమె అక్కడికక్కడే మరణించింది. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతురాలిని పాతబస్తీకి చెందిన తాహనజర్ గా గుర్తించామని పోలీసులు తెలిపారు. పోస్ట్ మార్టం కోసం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. కాగా, తాహనజర్ ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదని పోలీసులు పేర్కొన్నారు. కుటుంబంలో గొడవలేమైనా జరిగాయా లేక మరేదైనా కారణమా అనేది తేల్చేందుకు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## న్యాయవాది హత్యను ఖండించిన ఐఎఎల్

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది ఇజ్రాయిల్‌ను దారుణంగా పొడిచి చంపడాన్ని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. ఇటీవల దేశంలో, తెలంగాణ రాష్ట్రంలో న్యాయవాదులపై జరుగుతున్న వరుస ఘటనలు న్యాయవాదులలో అభద్రతా భావాన్ని కలిగిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల హక్కులు, ఆస్తుల పరిరక్షణ కోసం కృషి చేసే న్యాయవాదులకు రక్షణ లేకుండా పోతే గుండాయిజం రౌడీయిజం రాజ్యమేలడం ఈ దేశానికి నష్టదాయకమని ప్రభాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కేసులో ముద్దాయిని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ నిర్వహించి శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం అమలు చేయాలని బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్ చేశారు.

## 100 ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉస్మానియా యూనివర్సిటీలోని ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో అపోలో ఫార్మసీ ఆధ్వర్యంలో ఈ నెల 28 న ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నది. ఉస్మానియా యూనివర్సిటీ, ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నారు. అపోలో ఫార్మసీ లోని ఫార్మాసిస్టు, అసిస్టెంట్ ఫార్మసిస్ట్ లకు చెందిన 100 పోస్టులను ఈ జాబ్ మేళా ద్వారా భర్తీ చేయనున్నారు. డీ ఫారసీ, బీ ఫార్మసీ, ఎం.ఫార్మసీ, డిగ్రీ చేసిన 18 నుండి 35 సంవత్సరాల వయసు వారికి మాత్రమే ఈ జాబ్ మేళాలో అవకాశం కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఒక ప్రకటనలో తెలియజేసింది. రూ.11,000 నుండి రూ.25,000 వేలవరకు వేతనం ఉండే ఈ ఫార్మసిస్ట్ ఉద్యోగాలకు మరిన్ని వివరాలకు పరిపాలన విభాగంకు చెందిన అధికారి టి. రఘుపతి, సెల్‌నెంబర్ 82476 56356 ను సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు. విద్యార్థతల సర్టిఫికెట్ల జిరాక్స్ తో ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరో వద్ద నేరుగా మార్చ్ 28న హాజరు కావాలని ప్రకటనలో పేర్కొన్నారు



## ప్రజలను దగా చేస్తున్న ప్రభుత్వం

మాజీ మంత్రి హరీష్ రావు, శాసనమండలి ప్రతిపక్ష నేత ఎమ్మెల్సీ మధుసూదనాచారి

**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** చట్టసభలలో ప్రశ్నోత్తరల సమయాన్ని రద్దు చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కుతుందని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను బయట ప్రశ్నిస్తే పోలీసు కేసులు, అసెంబ్లీలో ప్రశ్నిస్తే సస్పెన్షన్లు చేస్తుందని, అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం దగా చేస్తుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు, శాసనమండలి ప్రతిపక్ష నేత ఎమ్మెల్సీ మధుసూదనా చారిలు మండిపడ్డారు. మంగళవారం మెదక్ బిఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పద్మా దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున గౌడ్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ లావణ్య రెడ్డి, మాజీ ఏఎంసి ఛైర్మెన్ బట్టి జగపతి లతో కలిసి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు శాసనమండలి ప్రతిపక్ష నేత ఎమ్మెల్సీ మధుసూదనాచారిలు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు లక్షల రుణమాఫీ మీద ప్రభుత్వం చేతులెత్తేసిందని, రుణమాఫీ అయినవాళ్లు తక్కువ, కానివాళ్లు ఎక్కువ ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు ఆంజనేయులు, కృష్ణారెడ్డి, జయరాజ్,తో పాటు సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

**పురపాలక సంఘం గజ్వేల్ - ప్రజ్ఞాపూర్, సిద్దిపేట జిల్లా.**

ఫైల్ నెం. ఇ1/206/యమ్.సి.జి.పి./2025 (ఇ - ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్) తేదీ : 24-03-2025

మునిసిపల్ సాధారణ నిధులతో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పురపాలక సంఘం యందు ఇ -ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలవడమైనది. **1. పనుల సంఖ్య:** 01, **2. పనుల విలువ:** రూ.2.40 లక్షలు, **3. బిడ్స్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేదీ :** 26-03-2025 ఉ.11.00 లకు, **4. బిడ్స్ డౌన్‌లోడింగ్ ఆఖరు తేదీ:** 28-03-2025 సా.4.00 లకు, **5. బిడ్స్ సమర్పించు ఆఖరు తేదీ:** 28-03-2025 సా.5.00 లకు, **6. ప్రైస్ బిడ్స్ తెరుచు తేదీ :** 28-03-2025 సా.5.30 లకు. మిగతా వివరములకు http://tende.eprocurement.gov.in వివరములకు కార్యాలయ పని వేళల యందు ఫోన్ నెంబర్ 8008104099, 9948296849 నకు చూడగలరు మరియు మిగతా సంప్రదించగలరు.

సం/- కమిషనర్, పురపాలక సంఘము, గజ్వేల్-ప్రజ్ఞాపూర్.

DIPR R.O. No. : 12142-PP/CL/ADVT/1/2024-25, Date: 25-03-2025

ప్రజాపక్షం
బుధవారం, మార్చి 26

# కార్మికవర్గ ప్రచారాందోళన

పనిగంటల పెంపుకోసం కొందరు కార్పొరేట్ పెద్దలు ప్రచారం చేస్తుండగా, కార్మిక హక్కులను కార్పొరేట్ ప్రయోజనాలకు అనుగుణంగా దిగజార్చిన నాలుగు లేబర్ కోడ్‌ల అమలుకై మోదీ ప్రభుత్వం సన్నాహాలు ముమ్మరం చేయగా, 10 కేంద్ర కార్మిక సంఘాలు, నిర్దిష్ట రంగాలకు చెందిన స్వతంత్ర ఫెడరేషన్‌లు, అసోసియేషన్‌లు ఆ కోడ్‌లకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళనోద్యమం ప్రారంభించాయి. ఇదీ ఈనాటి కార్మికరంగం దృశ్యం. రెండు నెలలపాటు వివిధ రూపాల్లో సాగే ఈ ప్రచారాందోళన మే 20న ముగుస్తుంది. 29కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో మోదీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా, వాటి ప్రతిపాదన దశ నుంచి గత ఐదారు సంవత్సరాలుగా కేంద్ర ట్రేడ్ యూనియన్‌లు పలుమార్లు సార్వత్రిక సమ్మె సహా బహురూపాల్లో నిరసన తెలియజేస్తున్నాయి. అయినా ప్రభుత్వం మొండితనం వీడలేదు. కోడ్‌ల అమలుకు రూల్సు రూపొందించటంలో రాష్ట్రాలు జాగు చేయటం, కార్మిక సంఘాల ప్రతిఘటనవల్ల అవి ఇప్పటివరకు నిలుపుదలలో ఉన్నాయి. అత్యధిక రాష్ట్రాలు రూల్సు తయారు చేయటం పూర్తి చేశాయి. అయితే కేంద్రం, రాష్ట్ర రూల్సు అనేకం మధ్య వ్యత్యాసాలు అలాగే ఉన్నాయి. ఈ తేడాలతో నాలుగు లేబర్ కోడ్‌లను ఒకేసారి అమలులోకి తేవటం సాధ్యం కాకపోవచ్చు. కార్మికుల ఆందోళన ప్రభావం కూడా ప్రభుత్వంపై ఉంటుంది. 2024 ఎన్నికల్లో కార్మికులు – కర్షకులు కలిసి బిజెపికి మెజారిటీ సీట్లను నిరాకరించినా మిత్రపక్షాల అండతో అధికారం నిలుపుకున్న ప్రధాని నరేంద్రమోదీకి జ్ఞానోదయం కలుగలేదు. ఏమీ జరగనట్లే, ఎప్పటివలె ఏకపక్షంగా దూకుడు ప్రదర్శిస్తున్నారు. వ్యవసాయ పంటలకు గిట్టుబాటు ధరకు లీగల్ గ్యారంటీ ఇస్తామన్న హామీతో రైతుల చరిత్రాత్మక ఆందోళనను విరమింపజేసిన నరేంద్రమోదీ, ఏరు దాటాక బోడిమల్లయ్య అన్నట్లు ఆ హామీ నెరవేర్చలేదు. ఏడాదిపైగా పంజాబ్, హర్యానా సరిహద్దులో ఆందోళన చేస్తున్న రైతులు ఢిల్లీ రాకుండా నిరోధించారు. కొద్దిరోజుల క్రితం పంజాబ్ ప్రభుత్వం రైతు నాయకులను అరెస్టు చేసి వారి ఆందోళన శిబిరాలు ధ్వంసం చేసింది. రైతులు–కార్మికులు కలిసికట్టుగా ఆందోళన చేస్తూ కార్మిక–కర్షక ఐక్యత చాటి చెబుతున్నారు.

ఏప్రిల్ 1న ఉంచి లేబర్ కోడ్‌లు అమలు జరిపే విషయాన్ని మోదీ ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తున్న దశలో ట్రేడ్ యూనియన్‌ల ప్రచారాందోళన ప్రాధాన్యత సంతరించుకుంది. మార్చి 18న న్యూఢిల్లీలో జరిగిన కార్మిక సంఘాల జాతీయ సదస్సు లేబర్ కోడ్‌ల అమలుకై మోదీ ప్రభుత్వం చూపుతున్న ఆతృతపట్ల ఆందోళన వ్యక్తం చేసింది. ఈ కోడ్‌లు పని ప్రదేశాల్లో కార్మికుల హక్కులన్నిటినీ, సదుపాయాలన్నిటినీ హరిస్తాయి. పనిగంటలు, కనీస వేతనాలు, సామాజిక భద్రత వగైరా నిర్దేశిత పని పరిస్థితులకు సంబంధించి, యూనియన్‌ల ఏర్పాటు, గుర్తింపు, సమష్టి బేరసారాలు, ఆందోళన సమష్టిగా నిరసన వ్యక్తీకరణ వగైరా హక్కులను లాగేసుకుంటాయి. అంటే స్వతంత భారతదేశంలో కార్మికులు ఎన్నో పోరాటాలు, అసమాన త్యాగాల ద్వారా సాధించుకున్న హక్కులన్నిటినీ ఈ కోడ్‌లు నిర్వీర్యం చేస్తున్నాయి. కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వం దాసోహం అయిందనటానికి ఇది ప్రబల నిదర్శనం.

కార్మిక కోడ్‌లేకాదు, భారతీయ శిక్షాస్మృతి (బిఎన్ఎస్) సైతం కార్మికులకు వ్యతిరేకంగా ఉద్దేశించబడింది. ఆ శిక్షాస్మృతిలోని సెక్షన్ 111 ప్రకారం కార్మికుల సమష్టి చర్య – కార్మికులు, యూనియన్‌లు ఉమ్మడి ఫిర్యాదులు అందజేయటం సైతం 'ఆర్గనైజ్డ్ క్రైమ్' అవుతుందని టియుల జాతీయ సదస్సు డిక్లరేషన్ వెల్లడించింది. అనేక రాష్ట్రాల్లో కార్మిక యూనియన్‌లపై, నాయకులపై ఈ సెక్షన్ కింద క్రిమినల్ చర్యలు ప్రారంభమైనాయని పేర్కొన్నది. కార్మికవర్గ ఉద్యమానికి, దేశ పరిపాలన రాజ్యాంగ, ప్రజాతంత్ర స్వరూపాన్ని రక్షించుకోవటానికీ ఇది పరీక్షా సమయంగా కార్మిక యూనియన్‌లు భావించాయి. దేశవ్యాప్త ఐక్యపోరాటాలు, రంగాలవారీ ఐక్య ప్రతిఘటనను ముమ్మరం చేయటం ద్వారా కార్మిక కోడ్‌ల అమలును వెనక్కి కొట్టాలని, ప్రభుత్వ ప్రయత్నాలను నిర్ణయాత్మకంగా ఓడించాలని 10 కేంద్ర ట్రేడ్ యూనియన్‌లు, స్వతంత్ర ఫెడరేషన్‌లు, అసోసియేషన్‌లు ఏప్రిల్ మధ్యవరకు రాష్ట్ర, జిల్లా సదస్సులు నిర్వహిస్తాయి. ఏప్రిల్, మే మాసాల్లో పాదయాత్రలు, సైకిల్, మోటారు శకటాలపై యాత్రలు నిర్వహిస్తారు. అందువల్ల వచ్చే రెండు మాసాలు దేశంలో పారిశ్రామిక సంబంధాలకు అత్యంత కీలకం.

# నియోజకవర్గాల పునర్విభజన : సమస్యలు, ప్రభావాలు



డి. రాజా,
సిపిఐ ప్రధాన కార్యదర్శి

నూతన పార్లమెంట్ భవనాన్ని 2023, మే 28వ తేదీన దేశానికి అంకితం చేసిన సందర్భంగా, దేశానికి కొత్త పార్లమెంట్ భవనం అవసరం ఎందుకో ప్రధాని నరేంద్ర మోదీ వివరించారు. 'సీట్ల సంఖ్య పెరిగినప్పుడు వారంతా ఎక్కడ కూర్చుంటారు? సమీప భవిష్యత్తులో పార్లమెంటు సీట్ల సంఖ్య పెరగబోతుండటాన్ని మనం పరిగణలోకి తీసుకోవాలి' అని ఆయన అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై విధించిన నిషేధం 2026లో ముగియనుండడంతో, ప్రధాని చేసిన పై వక్కాణింపు డీలిమిటేషన్‌పై చర్చను ముందుకు తీసుకువచ్చింది. జనాభా మార్పులకు అనుగుణంగా నియోజకవర్గాల సరిహద్దులను పునర్ నిర్ణయించటం ద్వారా సమతుల్య ప్రాతినిధ్యం ఉండేలా చూడటం ఈ ప్రక్రియ లక్ష్యంగా ఉంది. అయితే, ఈ ప్రక్రియ ప్రత్యేకించి దక్షిణ భారత రాష్ట్రాలలో భయసందేహాలు లేవనెత్తింది. డిలిమిటేషన్‌కు అనుసరిస్తున్న ఫార్ములాతో పాటు బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సమాఖ్యవాదం విషయంలో అవలంభిస్తున్న అనుమానాస్పద వైఖరి, ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య అసమాన జనాభా వృద్ధి వంటి అంశాలు న్యాయం,సమానత్వం గురించి ఆందోళనలను తీవ్రతరం చేశాయి.

ఈ నేపథ్యంలో ప్రస్తుత ఫార్ములాను అనుసరించి నియోజకవర్గాల పునర్విభజనను నిర్వహిస్తే ప్రభావితం కానున్న తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, పంజాబ్ రాష్ట్రాలకు చెందిన ప్రధాన రాజకీయ పార్టీల సమావేశాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ఏర్పాటు చేశారు. తమ ప్రాతినిధ్య హక్కును బిజెపి రద్దు చేసే ప్రమాదానికి వ్యతిరేకంగా ప్రధాన రాజకీయ శక్తులు ఏకం కావడం ఈ సమావేశంలో ద్యోతకమైంది. కాబట్టి నియోజకవర్గాల పునర్విభజన అంటే ఏమిటి, అది ఎందుకు స్తంభింపబడింది? మన రాజకీయ ముఖచిత్రంపై దాని ప్రభావాలను అర్థం చేసుకునేందుకు అర్థవంతమైన చర్చ తప్పనిసరి.

భారతదేశ రాజ్యాంగ చట్రం నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియకు స్పష్టమైన మార్గదర్శకాలను నిర్దేశిస్తోంది. జనాభా మార్పులను ప్రతిబింబించడానికి ప్రతి జనగణన తర్వాత పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన చట్టాన్ని రూపొందించాలని ఆర్టికల్ 82 ఆదేశిస్తోంది. జనాభా డేటా ఆధారంగా రాష్ట్ర శాసనసభల కూర్పును ఆర్టికల్ 170 నిర్దేశిస్తోంది. రాష్ట్రపతి ఎన్నికలలో రాష్ట్రాల దామాషా ప్రాతినిధ్యాన్ని ఆర్టికల్ 55 నిర్ధారిస్తోంది. లోక్‌సభలో గరిష్ఠ సీట్ల సంఖ్యను (ప్రస్తుతం 552) ఆర్టికల్ 81 నిర్ణయిస్తుంది. జనాభా ఆధారంగా రాష్ట్రాల మధ్య సీట్ల పంపిణీ జరుగుతుంది. 1976లోని 42వ సవరణ తర్వాత, కుటుంబ నియంత్రణ చర్యలను విజయవంతంగా అమలు చేసిన రాష్ట్రాలను శిక్షించకుండా నిరోధించడానికి పార్లమెంటరీ సీట్ల పెంపు ప్రక్రియను స్తంభింపజేశారు. 2001లోని 84వ సవరణ ద్వారా వాజ్‌పాయి ప్రభుత్వం సీట్ల సంఖ్యను పెంచకుండా నిషేధాన్ని 2026 జనాభా లెక్కల తర్వాత వరకు పొడిగించింది.

2026 జనాభా లెక్కల ఆధారంగా జరగబోయే నియోజకవర్గాల పునర్విభజన వైరుధ్య జనాభా పొందికలను దృష్టిలో ఉంచుకుని దక్షిణ భారత రాష్ట్రాల ప్రాతినిధ్యానికి భారీగా కోత పడొచ్చు. అదే సమయంలో ఉత్తర భారత రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని గణనీయంగా పెంచవచ్చు. ప్రస్తుతం లోక్‌సభలోని 543 స్థానాలలో ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లతో కూడిన ముఖ్యమైన ఉత్తరాది రాష్ట్రాలకు మొత్తం 174 స్థానాలు ఉన్నాయి. ఇది మొత్తం సీట్లలో 32 శాతం. తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక కలిసి 129 స్థానాలు ఉండగా, అవి మొత్తం సీట్లలో 24శాతం. నియోజకవర్గాల పునర్విభజనను నిర్వహిస్తున్నప్పుడు మొత్తం సీట్ల సంఖ్య 543 వద్ద స్తంభింపజేసినా, ఈ తేడా మరింత పెరుగుతుంది. ఉత్తర భారత రాష్ట్రాలు గణనీయంగా లాభపడతాయని, మొత్తం 205 స్థానాలు లేదా 38శాతం కలిగి ఉంటాయని, దక్షిణ భారత రాష్ట్రాల ప్రాతినిధ్యం 103 స్థానాలు లేదా 19 శాతానికి తగ్గుతాయని అంచనాలు వెల్లడిస్తున్నాయి. నూతన పార్లమెంట్ భవనంలోని లోక్‌సభ సమావేశ మందిరంలో సీట్ల సంఖ్య ఆధారంగా లోక్‌సభ స్థానాల సంఖ్యను 848కి పెంచితే, ఉత్తర భారత రాష్ట్రాలకు 324 సీట్లు లేదా మొత్తంలో 39 శాతం వస్తాయని భావిస్తున్నారు. దక్షిణ భారత రాష్ట్రాలకు 164 సీట్లు వస్తాయి. వాటి వాటా 19 శాతానికి తగ్గుతుంది.

జనాభా వ్యత్యాసం స్పష్టంగా ఉంది. 1971లో బిహార్ , తమిళనాడులు సరిపోలిన జనాభాతో పాటు లోక్‌సభలో సమాన ప్రాతినిధ్యాన్ని కలిగి ఉన్నాయి. తరువాత దశాబ్దాలలో తమిళనాడుతో పోల్చితే బిహార్ జనాభా చాలా వేగంగా పెరిగింది. దీంతో ఆ రాష్ట్రంలోని లోక్‌సభ నియోజకవర్గాలు నేటి తమిళనాడులోని ఒక్కో ఎంపి స్థానం కంటే ఎక్కువమందికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఫలితంగా ఉత్తర రాష్ట్రాల ఎంపిలు ఇప్పుడు వారి దక్షిణ రాష్ట్రాల సహచరుల కంటే గణనీయంగా పెద్ద నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రాబోయే నియోజకవర్గాల పునర్విభజన విన్యాసంలో దక్షిణ రాష్ట్రాలు ఎదుర్కొంటున్న సవాలును ఈ అసమానత నొక్కి చెబుతుంది. 1971 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో 43శాతంగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాల జనాభా ప్రస్తుతం 50 శాతానికి పెరిగింది. అదే సమయంలో దక్షిణాది రాష్ట్రాల వాటా 25 శాతం నుంచి 20 శాతానికి తగ్గింది. ప్రస్తుత ఫార్ములాను అనుసరించినప్పుడు ఇది డీలిమిటేషన్ ప్రక్రియ నిష్పాక్షికత పట్ల ఆందోళనలను మరింత పెంచుతుంది.

> **ప్రస్తుతం లోక్‌సభలోని 543 స్థానాలలో ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లతో కూడిన ముఖ్యమైన ఉత్తరాది రాష్ట్రాలకు మొత్తం 174 స్థానాలు ఉన్నాయి. ఇది మొత్తం సీట్లలో 32 శాతం. తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక కలిసి 129 స్థానాలు ఉండగా, అవి మొత్తం సీట్లలో 24శాతం. నియోజకవర్గాల పునర్విభజనను నిర్వహిస్తున్నప్పుడు మొత్తం సీట్ల సంఖ్య 543 వద్ద స్తంభింపజేసినా, ఈ తేడా మరింత పెరుగుతుంది. ఉత్తర భారత రాష్ట్రాలు గణనీయంగా లాభపడతాయని, మొత్తం 205 స్థానాలు లేదా 38శాతం కలిగి ఉంటాయని, దక్షిణ భారత రాష్ట్రాల ప్రాతినిధ్యం 103 స్థానాలు లేదా 19 శాతానికి తగ్గుతాయని అంచనాలు వెల్లడిస్తున్నాయి.**

2026 తర్వాత జరిగే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై దక్షిణ రాష్ట్రాలు అనేక కారణాల వల్ల స్థిరంగా బలమైన ఆందోళనలను వ్యక్తం చేశాయి. అసమాన జనాభా వృద్ధి ప్రధాన అంశం. దక్షిణ రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ చర్యలలో ముందున్నాయి. తమ జనాభాను విజయవంతంగా స్థిరీకరించాయి. అదే సమయంలో, ఉత్తర రాష్ట్రాలు అధిక జనాభా వృద్ధిని చూశాయి. కేవలం జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేయడం ద్వారా జనాభా నియంత్రణ కోసం జాతీయ లక్ష్యాలను అనుసరించిన రాష్ట్రాలు శిక్షింపబడే ప్రమాదం ఉంది. రాజకీయంగా చెప్పాలంటే, కర్ణాటక మినహా బిజెపి ఇప్పటి వరకు దక్షిణ భారతదేశంలో పెద్దగా పురోగతి సాధించలేకపోయింది. ఈ రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించడం అంటే బిజెపిని ఎన్నికలలో తిరస్కరించినందుకు వారిని శిక్షించే మార్గంగా ఉండవచ్చు.

సమాఖ్య వ్యవస్థకు ముప్పు మరొక ముఖ్యమైన ఆందోళన. బిజెపి అధికారాన్ని కేంద్రీకరించడం, భారతదేశ సమాఖ్య నిర్మాణాన్ని బలహీనపరచడం వంటి విధానాన్ని ప్రదర్శించింది. హిందీ మాట్లాడని రాష్ట్రాలపై హిందీని రుద్దడం, కేరళ వంటి రాష్ట్రాలపై ఆర్థిక వివక్ష చూపడం, ఎన్ఇపిని రుద్దడం, రాష్ట్రనిర్దిష్ట సంక్షేమ విధానాలలో జోక్యం చేసుకోవడం వంటివి ఇందుకు ఉదాహరణలు. ఈ చర్యలు నియోజకవర్గాల పునర్విభజన కసరత్తు సమాఖ్య వ్యవస్థను మరింత బలహీనపరుస్తుందనే ఆందోళనలను రేకెత్తించాయి. రాజకీయ అధికారాన్ని దామాషా విరుద్ధంగా మార్చవచ్చు.

ఆర్థిక దోహదం వర్సెస్ రాజకీయ ప్రాతినిధ్యం ఈ వివాదంలోని మరొక కోణం. దక్షిణ రాష్ట్రాలు భారతదేశ ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన దోహదకారులు. తమిళనాడు, కేరళ, తెలంగాణ, కర్ణాటక వంటివి భారతదేశ జిడిపి, పన్ను ఆదాయాలకు వాటి ఉత్తరాది సహచరులతో పోలిస్తే అసమానంగా ఎక్కువ వాటాను అందిస్తాయి. అయినప్పటికీ, కొత్త నియోజకవర్గాల పునర్విభజన చట్రంలో వారి రాజకీయ ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం ఉంది.

తగ్గిన ప్రాతినిధ్యం ఆర్థిక అన్యాయం గురించి ఆందోళనల ఆస్కారాన్ని పెంచుతుంది. ఆరోగ్య సంరక్షణ, విద్య, సామాజిక మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి భారీగా పెట్టుబడి పెట్టిన రాష్ట్రాలు వాటి సమర్థవంతమైన పాలనకు శిక్షించబడే ప్రమాదం ఉంది.

సామాజిక అభివృద్ధిలో పెట్టుబడులకు ప్రాధాన్యతనిచ్చిన రాష్ట్రాలు, ప్రగతిశీల విజయాలు ఉన్నప్పటికీ రాజకీయ పరపతిని కోల్పోవచ్చు. 2026 వరకు నియోజకవర్గాల పునర్విభజన కసరత్తు నిలిపివేతను ప్రతిపాదిస్తూ, అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పాయి మంత్రివర్గంలోని న్యాయ మంత్రి అరుణ్ జైట్లీ లోక్‌సభలో 'కొన్ని రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని చాలా ప్రభావవంతంగా అమలు చేశాయి . కొన్ని రాష్ట్రాలు ప్రభావవంతంగా అమలు చేయలేదు' అని చెప్పారు. ఈ విషయంలో నాటి నుంచి అనేక సంవత్సరాలు గడిచినా ఎలాంటి మార్పు వచ్చిందో బిజెపి వివరించాలి.

అంతేకాకుండా, దక్షిణ రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గడం ద్వారా పార్లమెంటరీ వ్యవస్థ నిర్మాణం అసమానంగా మారి, ఉత్తరాది రాష్ట్రాల ప్రాధాన్యతలు, ఆందోళనలను ప్రతిబింబించవచ్చు. ఈ మార్పు ఉత్తర–దక్షిణ రాజకీయ విభజనను మరింత పెంచడమే కాకుండా, వనరుల కేటాయింపు, బలవంతంగా భాషను రుద్దడం భావజాల భేదాలను మరింత తీవ్రతరం చేస్తాయి.

రాబోయే నియోజకవర్గాల పునర్విభజన భారతదేశ రాజకీయ చట్రానికి మూలస్తంభమైన సహకార సమాఖ్య వ్యవస్థను బలహీనపరిచే ప్రమాదం ఉంది. భారతదేశంలో సమాఖ్య వ్యవస్థ రాష్ట్రాలు వాటి స్వంత వ్యవహారాలపై గణనీయమైన నియంత్రణను కలిగి ఉండేలా రూపొందించబడింది. బిజెపి ప్రభుత్వం ఆధ్వర్యంలో పెరుగుతున్న కేంద్రీకృత చర్యలు, నియోజకవర్గాల పునర్విభజన సమతుల్యతను బలహీనపరుస్తాయి. జాతీయ ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన సహకారం అందించినప్పటికీ, సామాజిక సంక్షేమం , ఆర్థిక వృద్ధిలో స్థిరంగా పెట్టుబడి పెట్టిన కేరళ , తమిళనాడు వంటి రాష్ట్రాలు రాజకీయంగా బలహీనపడే ప్రమాదం ఉంది. పార్లమెంటులో సంఖ్యాపరమైన ఆధిపత్యం భారత రాజకీయ సమతుల్యతను అస్థిరపరిచి, సమాఖ్య విలువలను క్షీణింపజేస్తాయి.

ఈ ఆందోళనలను తగ్గించడానికి, అనేక రాజ్యాంగ రక్షణలు అవసరం. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో జనాభా నియంత్రణకు వెయిటేజీని చేర్చాలి. తద్వారా తమ జనాభాను సమర్థవంతంగా స్థిరీకరించిన రాష్ట్రాలు అన్యాయంగా శిక్షించబడకుండా చూడాలి. సమతుల్య ప్రాతినిధ్యం కూడా చాలా కీలకం; ఆర్థిక సహకారం, అభివృద్ధి విజయాలు, పరిపాలనా సాఫల్యాలను ప్రాతినిధ్య ఫార్ములాలో పరిగణనలోకి తీసుకోవాలి. పార్లమెంటరీ సీట్ల కేటాయింపులో న్యాయం ఉండేలా చూడాలి. సమాఖ్య వ్యవస్థను బలోపేతం చేయడం కూడా చాలా కీలకం. జనాభా వృద్ధిని నియంత్రించిన, ఆర్థిక వ్యవస్థకు గణనీయంగా దోహదకారిగా ఉన్న రాష్ట్రాలకు సమానమైన ఆర్థిక కేటాయింపులను నిర్ధారించడానికి ద్రవ్య విధానాలను పునఃసమీక్షించడం ఆర్థిక వెనుకబాటుతనాన్ని నివారిస్తుంది.

రాబోయే నియోజకవర్గాల పునర్విభజన కసరత్తు భారతదేశ ప్రజాస్వామ్యం, సమాఖ్య నిర్మాణానికి కీలకమైన సవాలును ముందుకు తీసుకువస్తుంది. జనాభా పోకడల ఆధారంగా ప్రాతినిధ్యాన్ని సమతుల్యం చేయడం ఈ ప్రక్రియ లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, పాలనా నైపుణ్యం, ఆర్థిక దూరదృష్టిని ప్రదర్శించిన దక్షిణ రాష్ట్రాలను అసమానంగా శిక్షించే ప్రమాదం ఉంది. తగిన రక్షణలు లేకుండా, బిజెపి కేంద్రీకరణ చర్యలు సహకార సమాఖ్య వ్యవస్థను మరింత బలహీనపరచవచ్చు. రాజకీయ ప్రభావంలో ప్రాంతీయ అసమానతలను పెంచుతుంది. 2026 నియోజకవర్గాల పునర్విభజన సమధర్మం, నిష్పాక్షికత, అన్ని ప్రాంతాల సహకారానికి గౌరవం ఉండేలా చూడాలి. న్యాయం, ప్రజాస్వామ్య సూత్రాలను సమర్థిస్తూ అన్ని రాష్ట్రాల ప్రయోజనాలను పరిరక్షించే చట్రం అవసరం. భారతదేశ బలం దాని వైవిధ్యంలో ఉంది. సమతుల్యతను దెబ్బతీసే రీతిలో నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ దేశ పురోగమనానికి కీలక పాత్ర పోషించిన ప్రాంతాలను దూరం చేసే ప్రమాదం ఉంది. భారతదేశం ఈ పరివర్తనాత్మక క్షణాన్ని చేరుకుంటున్నప్పుడు, అన్ని ప్రాంతాల దోహదాలకు సమధర్మం, నిష్పాక్షికత , గౌరవాన్ని కలుగజేయటం నియోజకవర్గాల పునర్విభజనకు మార్గదర్శక సూత్రంగా ఉండాలి.

# పేదల బ్రతుకులపై భారం మోపుతున్న కేంద్ర బడ్జెట్



ఉజ్జిని రత్నాకర్ రావు
9490952646

కేంద్రంలో ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఇప్పటిదాకా అమలు జరుపుతున్న సరళీకృత ఆర్థిక విధానాలనే మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ప్రతిపాదించింది. ఇప్పటికే కార్మిక చట్టాలు రద్దు చేశారు. వాటి స్థానంలో కోరలు లేని లేబర్ కోడ్స్ తెచ్చిపెట్టా రు. రద్దయిన చట్టాల్లో వలస కార్మికుల భద్రతా చట్టం కూడా ఒకటి. ఇప్పుడు పరిశ్రమల్లో గాని, అసంఘటితరంగంలో గాని దాదాపు సగంమంది వలస కార్మికులే. యూనియన్ల ఏర్పాటు కూడా కష్టంగా మారింది. ఫలితంగా సమిష్టి బేరసారాల శక్తి కూడా తగ్గింది. వ్యవసాయ కూలీలు, పేద రైతులు, కౌలు రైతుల ఊసెత్తడానికి కూడా పాలకులు సిద్ధంగా లేరు. రైతు పండించిన పంటకు మద్దతు ధర చట్టబద్ధం చేసేందుకు మోదీ ప్రభుత్వం నిరాకరిస్తున్నది. వీటన్నింటి ఫలితంగా ప్రజల ఆదాయాలు పడిపోయాయి. ప్రజల అవసరాలు కూడా పెరిగాయి. మోటార్ సైకిల్, సెల్ ఫోన్లు, ఇంటర్నెట్ సౌకర్యం నిత్య జీవితావసరాలుగా మారాయి. విద్యుత్తు వినియోగం పెరిగింది. మారుమూల గ్రామాల్లో కూడా మంచినీరు కొనుక్కోవలసి వస్తుంది. పెట్రోల్ డీజిల్ ధరల పెరుగుదల ప్రజల మీద తీవ్ర ప్రభావం చూపుతున్నది. అంతిమంగా చదువు, వైద్యం కూడా ఖర్చుతో కూడినవిగా మారాయి. ఇంటి కిరాయి లు పెరిగాయి. ఈసారి బడ్జెట్‌లో కూడా విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి హామీ, ఎరువులు, వంటగ్యాసు, ఆహార సబ్సిడీలకు కేటాయింపులు బాగా తగ్గించింది. విద్యుత్తు రంగాన్ని ప్రైవేటు పరం చేయాలన్నది. భీమారంగంలో నూటికి నూరు శాతం విదేశీ పెట్టుబడులకు అవకాశం కల్పించింది. నగదీకర ణ పేరుతో ప్రభుత్వ ఆస్తులను అమ్మకానికి పెట్టి రూ.10లక్షల కోట్లు సమకూర్చుకోవాలని చెప్పింది. ఇప్పటికే జిఎస్‌టి పేరుతో ప్రజల మీద పన్నుల భారం బాగా పెరిగింది.

ఆర్థిక సర్వే రిపోర్ట్ ఏమి చెబుతున్నది? గత ఆర్థిక సంవత్సరం భారతదేశ స్థూల జాతీయోత్పత్తి అంచనాల కన్నా తగ్గిందనీ, ఇందుకు కారణాలను ఆర్థిక సర్వేలోతుగా విశ్లేషణ చేసింది. దేశంలో సరుకుల అమ్మకాలు తగ్గిపోయాయని, తగిన వేతనాలతో కూడిన ఉపాధి అవకాశాలు పడిపోయాయని, ద్రవ్యోల్బ ణం సమస్యగా మారిందని తెలిపింది. నెలసరి వేతన జీవుల కు, స్వయం ఉపాధి కార్మికులకు గత ఐదేళ్లలో నిజ వేతనాలు దిగజారిపోయాయి. 22కోట్ల ప్రజల దినసరి ఆదాయం కేవలం రూ.300. మోదీ ప్రభుత్వం విడుదల చేసిన జిఒ ప్రకారం క్షేత్రస్థాయి దినసరి కూలీ కనీస వేతనం రూ.78లు ఇస్తే చాలు. అంటే నెలకు రూ.4628లతో కుటుంబం బతకాలి. ఉపాధి హామీ చట్టం ప్రకారం కల్పించవలసిన వందరోజుల పని దినాలు కూడా 2019 తర్వాత సగటు 45కు తగ్గాయి. 2024 వచ్చే వరకు 36 రోజులకు తగ్గాయి. వీటన్నింటి ఫలితంగానే దేశ ప్రజలు సరుకుల కొనుగోలుపై పెట్టే ఖర్చు గాని, పొదుపుగాని తగ్గిపోయాయి. కేంద్ర ప్రభుత్వం చెబుతున్న వికసిత భారత్‌ను సాధించాలంటే రానున్న 10 నుంచి 20 సంవత్సరాల పాటు స్థూల జాతీయోత్పత్తి ఎనిమిది శాతానికి తగ్గవద్దని ఆర్థిక సర్వే రిపోర్ట్ చెప్పింది. కానీ రానున్న ఆర్థిక సంవత్సరంలో స్థూల జాతీయోత్పత్తి 6.3 నుంచి 6.8 శాతం మధ్య మాత్రమే ఉండే అవకాశం ఉందని కూడా ఇదే రిపోర్టు ఆందోళన వ్యక్తం చేసింది.

**బడా బాబులకు దోచిపెడుతుంది:**

జనం సమస్యలతో సతమతమవుతుంటే మోదీ ప్రభుత్వం మాత్రం బడా బాబుల వంచన చేరింది. సబ్సిడీలకు 'ఉచితాలు' అని పేరు పెట్టింది. వీటిని ప్రోత్సహించకూడదని సుప్రీంకోర్టు కు తన అభిప్రాయంగా తెలియజేసింది. బడా పెట్టుబడిదారులకు, ఫామ్ హౌస్ ల యజమానులకు మాత్రం ఖజానాను దోచిపెట్టింది. 'రాయితీలు' అని ముద్దు పేరు పెట్టింది. రైతుల రుణమాఫీకి అంగీకరించని మోదీ ప్రభుత్వం, గత పదిహేను ఏళ్లలో బడా బాబులు బ్యాంకులకు అప్పులు చెల్లించకుండా బకాయిలు పెట్టిన రూ.14.46లక్షల కోట్లు మాఫీ చేసింది. ఎగవేతదారులకు అండగా నిలిచింది. కార్పొరేట్ సంస్థలు చెల్లించవలసిన పన్ను 10శాతం తగ్గించింది. బడా బాబులకు పండగే కదా. ఏడాదికాలంలో దేశంలో శతకోటీశ్వరుల సంఖ్య 109 నుంచి 200కు పెరగటానికి ప్రోత్సహించినది. కార్పొరేట్ సంస్థల లాభాలు 22.3% పెరిగాయని ఎకనమిక్ సర్వే రిపోర్టు చెప్పింది. అంతేనా, గత 15నెలలు వీరి ఆదాయం అనన్యంగా పెరిగింది అని చెప్పింది. దేశ జనాభా లో ఒక శాతంగా ఉన్న ధనికుల చేతుల్లో 40.1 శాతం దేశ సంపద పోగయిందని ప్రపంచ అసమానతల రిపోర్టు తేల్చింది. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని ఎకనామిక్ సర్వే రిపోర్టు ప్రజల కొనుగోలు శక్తి మీద దృష్టి సారించింది. అంటే బడ్జెట్‌లో ప్రజల ఆదాయాలు పెంచే విధంగా ప్రతిపాదనలు ఉండాలి. ప్రభుత్వం చేసే ఖర్చు పెరగాలి. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆర్థిక సర్వే చెప్పింది. తయారీరంగం అభివృద్ధి గురించి హెచ్చరించింది. ఆహార సరుకుల ద్రవ్యోల్బణం పెరిగిన నేపథ్యంలో ధాన్యం కొనుగోలు పెంచాలన్నది. కొరత సమయంలో ఆహార నిల్వల ను మార్కెట్లోకి విడుదల చేయడం ద్వారా దిగుమతులను అరికట్టాలని చెప్పింది. తగిన నెలసరి ఆదాయం ఉన్న ఉద్యోగాలు కనీసం ఏడాదికి 78.5 లక్షలు కల్పించాలన్నది.



కార్మిక చట్టాల రద్దుతో ఎనిమిది గంటల పని దినం స్థానంలో ఇప్పటికే 12 గంటల పనిదినం అమల్లోకి వచ్చింది. దీనివల్ల కార్మికులు, వారి కుటుంబాల ఆరోగ్యాలు దెబ్బతింటాయని, స్థూల జాతీయోత్పత్తి మీద దాని ప్రభావం ఉంటుందని ఆర్థిక సర్వే రిపోర్ట్ హెచ్చరించింది. పారిశ్రామికవేత్తల సంఘాలకు మాత్రం ఇది రుచించడం లేదు. ఆర్థిక సర్వే రిపోర్టు చైనా గురించి కూడా ప్రస్తావించింది. గత పదేళ్లలో చైనా ప్రజల ఆదాయాలు పెరగడం వల్ల అంతర్గతంగా సరుకు ల వినిమయం బాగా పెరిగింది. ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ఉత్పత్తి కూడా శరవేగంగా పెరిగింది. మరోవైపు భారతదేశం మాత్రం ఈ కాలంలో ఇటు అభివృద్ధి చెందుతున్న దేశాలతో గానీ, అటు అభివృద్ధి చెందిన దేశాలతో గాని పోటీ పడగల స్థితిలో లేదని గుర్తు చేసింది. రానున్న కాలం కూడా అంత ఆశాజనకంగా ఏమీలేదని పెదవి విరిచింది. ట్రంప్ ప్రభుత్వం టారిఫ్ విధానాలు భారతదేశ ఆశల మీద నీళ్లు చల్లుతున్నాయని ఆర్థిక సర్వే హెచ్చరించింది. అంతర్జాతీయ మార్కెట్ ఒడిదుడుకులు కూడా మనకు ఆటంకమేనన్నది. దేశంలో పారిశ్రామిక సరుకుల ధరలు కూడా సమస్యగా మారవచ్చును అన్నది. ఇవన్నీ గమనించిన వారికి ఎవరికైనా మన దేశంలో ప్రజల ఆదాయాలు పెంచే చర్యలు తీసుకోవాలన్నది సులభంగానే అర్థమవుతుంది. ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో లేనిది కూడా ఇదే. ఇప్పుడు మనం ఎగుమతుల మీద ఆశలు పెంచుకోవడం హాస్యాస్పదం. ఏ విధంగానైనా ప్రజల కొనుగోలు శక్తి పెంచడం అత్యంత కీలకం.

**ధనికుల ఆదాయంపై పన్ను విధించాలి :**

మోదీ అధికారంలోకి రాగానే 2015లోనే బడా బాబుల కు సంపద పన్ను రద్దు చేశారు. అభివృద్ధి చెందిన దేశాల్లో వారసత్వపు పన్ను విధిస్తున్నప్పటికీ మోదీ ప్రభుత్వం మాత్రం సిద్ధంగా లేదు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆర్థికవేత్త పికెట్టి సూచించిన విధంగా రూ.10కోట్లు అంతకు మించిన ఆదాయం ఉన్న ధనికుల మీద సంపద పన్ను పురుద్ధరించి కనీసం 33 శాతం వారసత్వపు పన్ను విధిస్తే కేంద్ర ప్రభుత్వానికి కావాల్సినంత ఆదాయం పెరుగుతుంది. తద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెంచే విధంగా ప్రభుత్వం కేటాయింపులు బాగా పెంచవ చ్చు. కానీ పాలకులు సిద్ధంగా లేరు. నెల జీతం పొందుతున్న ఉద్యోగుల నుంచి ఆదాయం పన్ను రూపంలో 30 శాతానికి పైగా వసూలు చేస్తున్న కేంద్రం శతకోటీశ్వరుల నుంచి మాత్రం తక్కువ పన్ను వసూలు చేస్తున్నది. ఇప్పుడు రూ.12లక్షల ఆదాయం వరకు పన్ను మినహాయించి సంబర పడమంటుంది. బడా బాబులకు ఇస్తున్న రాయితీల్లో ఉద్యోగులకు ఇచ్చిన రాయితీ సముద్రంలో నీటి బొట్టు. సంపద పోగవుతున్న కుబేరులను నొప్పించడం పాలకులు ఇష్టం లేదు. అందుకే ఇది పేదల జీవన పరిస్థితులు మెరుగుదలకు తోడ్పడని బడ్జెట్.. ప్రజా, కార్మిక వ్యతిరేక బడ్జెట్.

# భారత్‌లో కోటి కి పైగా మూర్ఛ రోగులు!

ప్రపంచవ్యాప్తంగా 26 మార్చి రోజున ప్రపంచ మూర్ఛరోగ అవగాహన (లేదా ప్రపంచ పర్పుల్ డే) దినం నిర్వహించడం జరుగుతోంది. ఎపిలెప్సీ లేదా మూర్ఛరోగ లేదా కాకిసోమాల వ్యాధి పట్ల సామాన్యులకు అవగాహన కల్పించే వేదికగా 26 మార్చి 'వరల్డ్ పర్పుల్ డే' నిర్వహించడం జరుగుతోంది. ఈ వేదికగా పౌర, ప్రభుత్వ సంఘాలు/సంస్థలు ఊదా రంగు వస్త్రాలు లేదా బాడ్జీలను ధరించి తమ సంఘీభావాన్ని మూర్ఛరోగ బాధితులకు తెలియజేస్తారు.

విశ్వవ్యాప్తంగా 65 మిలియన్ల ఎపిలెప్సీ రోగులు ఉన్నారని, వీరిలో 80 శాతం అభివృద్ధి చెందుతున్న అల్పాదాయ, మధ్యాదాయ దేశాల్లోనే ఉన్నారని తేలింది. ప్రతి 26మంది అమెరికన్లలో ఒకరికి తన జీవితకాలం ఎపిలెప్సీ వచ్చే అవకాశం ఉందని తేలింది. ఎపిలెప్సీ రుగ్మత కలిగిన స్త్రీ పురుషులు పూర్తి జీవితాన్ని అనుభవించే అవకాశాలే ఎక్కువ. కొన్ని కేసుల్లో అకాల మరణాలు కూడా చోటు చేసుకోవచ్చు. ఎపిలెప్సీ వ్యాధి నయం కావడానికి చికిత్స, మరిజ్వానా లేదా కన్నాబిస్ ఆధారిత మందులను వినియోగిస్తారు. కొన్ని సందర్భాల్లో ఎలాంటి చికిత్సలు కూడా పని చేయవని తెలుసుకోవాలి.

**మూర్ఛరోగ లక్షణాలు, కారణాలు:**

మూర్ఛరోగ లక్షణాలుగా అసాధారణ ప్రవర్తన, స్పృహ కోల్పోవడం, తాత్కాలిక గందరగోళం, నిశ్చేష్టులుగా ఉండడం, కాళ్లు చేతుల కదలికల నియంత్రణ లేకపోవడం, భయపడడం, ఉద్రేక పడడం, అధిక జ్వరం, తలకు గాయాలు, రక్తంలో షుగర్ లెవల్స్ పడిపోవడం, ఆల్కహాల్ అలవాటు ఒకేసారి మానేయడం లాంటి లక్షణాలు బయట పడతాయి. సరైన చికిత్స అందుబాటులో లేని ఎపిలెప్సీ రుగ్మత అన్ని వయస్సుల వారిలో కనిపిస్తుంది. మహిళల కంటే పురుషులలో ఈ రోగం అధికంగా నమోదు అవుతున్నది. కేంద్ర నాడీమండల మెదడు సంబంధిత రుగ్మతల్లో మూర్ఛ రోగం 4వ అతి ముఖ్యమైనదిగా గుర్తించబడింది. భారత్‌లో కోటిమందికిపైగా మూర్ఛ రోగులు ఉన్నట్లు అంచనా. పేదరికం, సాంప్రదాయ నమ్మకాలు, అపోహలు, ఆరోగ్య కేంద్రాల కొరత, సుశిక్షితులైన సిబ్బంది లేకపోవడం, యాంటీఎపిలెప్సీ ఔషధాల పట్ల అవగాహన లేకపోవడం లాంటి కారణాలతో మూర్ఛ వ్యాధిగ్రస్తుల సంఖ్య దినదినం పెరుగుతోంది. మెదడుకు గాయాలు, బ్రెయిన్ ట్యూమర్లు, సూక్ష్మ జీవులు సోకడం లాంటి లక్షణాలతో ఎపిలెప్సీ మెదడుకు సంబంధించిన వ్యాధిగా గుర్తించారు.

**ఎపిలెప్సీ నివారణ లేదా చికిత్స మార్గాలు:**

ఎపిలెప్సీల్లో 25 శాతం నివారించదగినవిగానే గుర్తించబడ్డాయి. తలకు గాయాలు కాకుండా చూసుకోవడం, గర్భిమలోనే రోగాన్ని గుర్తించడం లేదా గర్భిణీలు తగు వైద్య చికిత్సలు తీసుకోవడం, జ్వరంలో ఉష్ణోగ్రత పెరగకుండా చూసుకోవడం, బిపి/షుగర్/స్థూలకాయ సమస్యలు లేకుండా చూసుకోవడం, పొగాకు/ఆల్కహాల్ దురలవాట్లకు దూరం జరగడం, మెదడుకు సూక్ష్మ జీవులు సోకకుండా చూసుకోవడం లాంటి చర్యలతో మూర్ఛరోగం కొంతవరకు అదుపు చేయవచ్చు. మూర్ఛ వ్యాధి పట్ల కుటుంబ సభ్యులు, యువత, సామాన్య ప్రజలు తగు అవగాహనను పొంది, రోగులకు ధైర్యాన్ని నూరిపోయడం, అపోహలను తుడిచేయడం లాంటివి చేయవచ్చు. అధిక జనాభా, పేదరికం, నిరక్షరాస్యత అధికంగా ఉన్న భారత్ లాంటి దేశాల్లో ఎపిలెప్సీ కేసులు అధికంగా నమోదు అవుతున్నాయి. ఇలాంటి ప్రమాదకర మూర్ఛ రోగాన్ని ముప్పేట దాడిచేసి పొలిమేరలు దాటే వరకు తరిమేద్దాం, ఎపిలెప్సీ కానరాని ప్రపంచాన్ని నిర్మించుకుందాం.

**(26 మార్చి అంతర్జాతీయ మూర్ఛరోగ అవగాహన లేదా పర్పుల్ దినం సందర్భంగా)**



డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037



# జాతీయం

NATIONAL NEWS GENERAL NEWS

## ఆర్మీ 'ఎయిర్‌క్రాఫ్ట్' హ్యాక్ నిరాధారం

**న్యూఢిల్లీ:** భారత సైన్యానికి చెందిన ఓ మానవరహిత ఎయిర్‌క్రాఫ్ట్‌ను చైనా హ్యాక్ చేసిందంటూ సామాజిక మాధ్యమాల్లో ఓ పోస్టు దర్శనమిచ్చింది. దీనిపై తాజాగా ఆర్మీ స్పందించింది. ఆ పోస్టులో సమాచారాన్ని ఖండించింది. నిర్ధారించుకోని, తప్పుదోవ పట్టించే సమాచారాన్ని పోస్ట్ చేయడం మానుకోవాలని హెచ్చరించింది. భారత ఆర్మీకి చెందిన ఆర్‌పీఏ ఆకస్మాత్తుగా చైనా భూభాగం వైపు దూసుకుపోయిందని, దానిని డ్రాగన్ హ్యాక్ చేసిందంటూ ఉన్న పోస్టు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. 'ఆ సమాచారమంతా పూర్తిగా నిరాధారం. అలాంటి ఘటన ఏదీ చోటుచేసుకోలేదు' అని ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. ఈ తరహా పోస్టులు తప్పుడు సమాచార వ్యాప్తికి, అనవసర ఆందోళనకు దారితీస్తాయని హెచ్చరించింది. అలాంటి వాటికి దూరంగా ఉండాలని మీడియా సంస్థలు, సోషల్ మీడియా యూజర్లకు సూచించింది. తన ఆస్తుల భద్రతకు ఆర్మీ పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేసింది. భారత్‌చైనా మధ్య సరిహద్దు వివాదం నడుస్తోంది. ఆ ఉద్రిక్తతలకు ముగింపు పలికేలా కొన్ని నెలల క్రితం కీలక గస్తీ ఒప్పందం జరిగింది. 2020 నాటి యథాస్థితి ఎల్‌ఏసీ వెంబడి కొనసాగనుంది. రెండు దేశాల సైనికులు 2020లో గస్తీ నిర్వహించిన పెట్రోలింగ్ పాయింట్లకు స్వేచ్ఛగా వెళ్లొచ్చు. అయితే మళ్లీ ఇటీవల డ్రాగన్ కవ్వింపు చర్యలకు పాల్పడింది. లద్దాక్ భూభాగంలోని కొన్ని ప్రాంతాల్లో కౌంటీలను ఏర్పాటుచేస్తోంది. ఈ విషయంపై భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇలాంటి దురాక్రమణను ఎన్నటికీ అంగీకరించబోమని స్పష్టంచేసింది.

## పిఎం కిసాన్ అనర్హుల నుంచి రూ. 416 కోట్లు వెనక్కి

### కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్



**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పిఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో అనర్హుల ఏరివేతకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇప్పటి వరకు అనర్హుల నుంచి రూ.416 కోట్లు రికవరీ చేసినట్లు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడించారు. లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. పిఎం కిసాన్ పథకం ద్వారా అర్హులైన రైతులకు ఏడాదికి రూ.6వేలను మూడు విడతల్లో కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది. 2019లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 19 విడతల్లో రూ.3.68లక్షల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అయితే, ఈ పథకం ప్రారంభంలో స్వీయ ధ్రువీకరణ ఆధారంగా లబ్ధిదారుల పేర్ల నమోదుకు అనుమతించారు. ఇప్పటికే 100శాతం ఆధార్ సీడింగ్ పూర్తిచేయగా.. ఆధార్, ఆదాయపన్ను శాఖ, ఆర్థిక మంత్రిత్వశాఖల వద్ద ఉన్న సమాచారంతో అనర్హులను ఏరివేసే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఐటి చెల్లింపుదారులు, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, చట్టబద్ధ పదవుల్లో ఉన్నవారు దీనికింద లబ్ధిపొందితే వారి నుంచి రికవరీ చేయాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం సూచించింది. ఇదిలా ఉంటే, ఈ పథకం ద్వారా లబ్ధిపొందే రైతుల కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, పిఎంకిసాన్ ఆన్‌లైన్ పోర్టల్‌లో స్వయంగా రిజిస్టర్ చేసుకోవచ్చని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి చౌహాన్ వెల్లడించారు.

## ఆన్‌లైన్ అడ్వర్టయిజ్‌మెంట్లపై డిజిటల్ పన్ను రద్దు

### ఆర్థిక బిల్లు–2025కు లోక్‌సభ ఆమోదం

### 35 ప్రభుత్వ సవరణలకు ఒకే

### రాజ్యసభ ఆమోదమే తరువాయి





**న్యూఢిల్లీ :** ఆర్థిక బిల్లు – 2025ను లోక్‌సభ మంగళవారం నాడు ఆమోదించింది. ఆన్‌లైన్ అడ్వర్టయిజ్‌మెంట్‌లపై 6 శాతం డిజిటల్ పన్నును రద్దు చేయడం సహా, ప్రభుత్వం ప్రతిపాదించిన 35 సవరణలు కూడా ఆమోదం పొందాయి. ఆర్థిక బిల్లు – 2025 ఆమోదం పూర్తవడం ద్వారా లోక్‌సభ తన వైపు నుంచి బడ్జెట్‌కు సంబంధించిన ఆమోద ప్రక్రియను పూర్తి చేసినట్లయింది. ఇక రాజ్యసభ ఈ బిల్లును పరిశీలించాల్సి ఉంది. రాజ్యసభ ఆమోదం తెలిపిన తరువాత 2025–26 బడ్జెట్ ప్రక్రియ పూర్తవుతుంది. గతం కంటే 7.4 శాతం అదనంగా సుమారు రూ.50.65 లక్షల కోట్ల వ్యయంతో కేంద్ర బడ్జెట్ రూపొందించారు. ఇందులో మూలధన వ్యయం రూ.11.22 లక్షల కోట్లు, ప్రభావ వంతమైన మూల ధన వ్యయం రూ.15.48 లక్షల కోట్లుగా ప్రతిపాదించారు. సుమారు రూ.42.70 లక్షల కోట్ల స్థూల పన్ను రాబడి వసూలును , రూ.14.01 లక్షల కోట్ల స్థూల రుణాలను బడ్జెట్‌లో ప్రతిపాదించారు. కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలకు రూ.5.41 లక్షల కోట్లును కేటాయించగా, ఇది 2024–25లో రూ.4.15 లక్షల కోట్లుగా ఉంది. మార్కెట్ రుణాలకు వడ్డీ చెల్లింపులు, ట్రజరీ బిల్లులు, బాహ్య రుణాలు, చిన్న మొత్తాలు, ప్రావిడెంట్ ఫండ్స్,తో పాటు సాయుధ బలగాలకు అధిక అవసరాల ఉండడంతో గతం కంటే వ్యయం అంచనా పెరిగింది. అలాగే ఉద్యోగ కల్పన పథకాలకు కూడా అధిక కేటాయింపుల చేశారు. రాష్ట్ర వాటాల బదలాయింపు, కేంద్ర ప్రయోజిత పథకాలు, గ్రాంట్‌లు, రుణాలు సహా రాష్ట్రాలకు బదిలీ చేసిన అన్ని వనరులు కలుపుకొని ర2025–26లో రూ.25,01,284 కోట్లు. ఇది ప్రస్తుత 2024–25 ఆర్థిక సంవత్సరం కంటే రూ.4,91,668 లక్షల కోట్లు అధికం. వచ్చే ఆర్థిక సంవత్సరం ద్రవ్య లోటు ప్రస్తుతాని కంటే 4.4 శాతం నుంచి 4.8 శాతం అధికంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. కాగా 2025–26 ఆర్థిక సంవత్సరం జిడిపి రూ.356.97 లక్షల కోట్లుగా అంచనా వస్తున్నారు. ఇది ప్రస్తుత 2024–25 ఆర్థిక సంవత్సరంలో సవరించిన రూ.324.11 లక్షల కోట్ల కంటే 10.1 శాతం ఎక్కువ.

### ప్రసాదంపై జీఎస్టీ మినహాయింపు

ఈ సందర్భంగా లోక్‌సభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కొన్ని కీలక ప్రకటనలు చేశారు. ఆలయాలు, ప్రార్థనా మందిరాల్లో విక్రయించే ప్రసాదాలకు ఎలాంటి జీఎస్టీ వర్తించబోదని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ ప్రకటనలపై ఈక్వలైజేషన్ లెవీ లేదా డిజిటల్ పన్ను రద్దు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితు దృష్ట్యా అస్థిర పరిస్థితులను తొలగించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. లోక్‌సభలో ఆర్థిక బిల్లు 2025కి ప్రతిపాదించిన 59 సవరణల్లో ఇది ఉంది. ఏప్రిల్ 2 నుంచి భారత్‌పై ప్రతీకార సుంకాలు విధిస్తామని అమెరికా బెదిరిస్తున్న నేపథ్యంలో గూగుల్, మెటా, ఎక్స్ వంటి సంస్థలకు అనుకూలంగా ఉండేలా ఆన్‌లైన్ ప్రకటనలపై ఈక్వలైజేషన్ లెవీ తొలగించాలనే ప్రతిపాదన తీసుకొచ్చినట్లు నిపుణులు భావిస్తున్నారు. 2016 జూన్ 1 నుంచి ఆన్‌లైన్ ప్రకటన సేవలపై 6 శాతం ఈక్వలైజేషన్ లెవీ విధిస్తున్నారు. ఇప్పుడు ఆ పన్ను రద్దు చేస్తున్నట్లు కేంద్రమంత్రి వెల్లడించారు.

### వాస్తవికంగా పన్ను వసూలు లక్ష్యం

### ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్

ఆర్థిక బిల్లు 2025పై లోక్‌సభలో జరిగిన చర్చకు మంగళవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమాధానమిస్తూ ఈ బిల్లు ఎన్నడూ లేని విధంగా పన్ను ఉపశమనం కలిగిస్తుందని, వ్యక్తిగత ఆదాయ పన్ను వసూలులో 13.14 శాతం పెరుగుతుందనే అంచనా వాస్తవికమైందని, దీనికి బలమైన లెక్కలు మద్దతుగా ఉన్నాయని తెలిపారు.

## 50 ఏళ్ల కిందటే కేరళలో సైన్స్ పాలసీ

### పార్లమెంటులో కేంద్రం భిన్న సమాధానాలు

### దీనిపై రాజ్యసభలో చర్చించాలి

### సిపిఐ సందోశ్ కుమార్



**న్యూఢిల్లీ:** సైన్స్ పాలసీకి సంబంధించి చేసిన ప్రకటనల్లో వ్యత్యాసాలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టతివ్వాలని సిపిఐ ఎంపి పి.సంతోశ్ కుమార్ డిమాండ్ చేశారు. సైన్స్ పాలసీని అమలు చేసిన దేశంలోని మొదటి రాష్ట్రం కేరళ అని వక్కాణించారు. అయితే ఓ సందర్భంగా గుజరాత్ అని, మరోసారి కేరళ అని కేంద్రం చెప్పడాన్ని ఖండించారు. భిన్న ప్రకటనలపై కేంద్రప్రభుత్వ వివరణ కోరారు. పార్లమెంటులో కేంద్రం రెండుసార్లు పొంతన లేని ప్రకటనలు చేసిందని, దీంతో అధికారిక రికార్డుల కచ్చితత్వం ప్రశ్నార్థకమైందని సంతోశ్ కుమార్ అన్నారు. '2022, జులై 21న ప్రశ్న (నం.611)కు ఇచ్చి సమాధానంలో సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ పాలసీని 2018లో ప్రవేశపెట్టిన మొట్టమొదటి రాష్ట్రం గుజరాత్ అని కేంద్రం పేర్కొంది. అయితే 2025, మార్చి 13న ప్రశ్న (నం.1725)కు ఇచ్చిన సమాధానంలో సీపీఐ నాయకుడు, కేరళ నాటి ముఖ్యమంత్రి సి.అచ్చుతామీనన్ నాయకత్వంలో 1974లో సైన్స్ అండ్ టెక్నాలజీ పాలసీని కేరళ తెచ్చిందని తెలిపింది. ఈ రెండు ప్రకటనలు భిన్నంగా ఉండటం... దేశంలో విద్య, పరిశోధన, సాంకేతిక పురోగతికి కీలకమైన సైన్స్ పాలసీకి సంబంధించి పార్లమెంటులో తప్పుడు సమాచారం ఇవ్వడం ఆందోళనకరం' అని సంతోశ్ కుమార్ అన్నారు. '1974లో సైన్స్ అండ్ టెక్నాలజీ పాలసీని తెచ్చి కేరళ ముందుచూపుతో వ్యవహరించింది. మిగతా రాష్ట్రాలకు దిక్సూచిగా నిలిచింది. కేంద్రప్రభుత్వం ఎప్పటికప్పుడు కచ్చితమైన చారిత్రక రికార్డులు అందించలేకపోవడంతో విశ్వసనీయతను కోల్పోతోంది' అని ఎంపీ అన్నారు. స్పష్టతలేని రెండు ప్రకటనలపై కేంద్రం వివరణ ఇవ్వాలని, ఇందు కోసం రాజ్యసభలో అరగంట చర్చకు అనుమతి ఇవ్వాలని సంతోశ్ కుమార్ డిమాండ్ చేశారు. తద్వారా కేరళ నిర్ధిష్ట లక్ష్యాన్ని పెట్టుకొన్న 50 ఏళ్లకు దేశంలో శాస్త్రీయ పరిశోధన, ఆవిష్కరణలు, పాలసీ అమలుపై విస్తృతస్థాయి చర్చకు అవకాశం లభిస్తుందని అన్నారు. సంతోశ్ కుమార్ డిమాండ్‌కు సీపీఐ తరపున మరొక ఎంపీ పీపీ సునీశ్, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ జావేద్ అలీ ఖాన్ మద్దతిచ్చారు. ప్రభుత్వ ప్రకటనల్లో పారదర్శకత, జవాబుదారీతనం, కచ్చితత్వం ఉండాలన్నారు. భవిష్యత్‌లో తప్పుడు సమాచారం వ్యాప్తిని అరికట్టేందుకు ఈ ప్రకటనను సరిదిద్దుకొని, కచ్చితత్వంలో ప్రకటనలు చేయాలని కేంద్రానికి సంతోశ్ కుమార్ సూచించారు. ఇది తేలికగా తీసుకునే అంశం కాదని చెప్పారు. రాష్ట్రస్థాయిలో సైన్స్ అండ్ టెక్నాలజీ పాలసీని తీసుకొచ్చి ఆదర్శకంగా నిలిచిన కేరళ పాత్రను గుర్తించాలని కూడా ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శాస్త్రీయపరమైన పురోగతికి సీపీఐ ఎల్లప్పుడు కట్టుబడి ఉంటుందని సంతోశ్ కుమార్ స్పష్టంచేశారు.

## జస్టిస్ వర్మ ఉదంతం న్యాయవ్యవస్థకే కళంకం

### జ్యుడీషియరీపై పెరిగిన కేంద్రం పెత్తనం

### డిలిమిటేషన్ సమాఖ్య స్ఫూర్తికి విఘాతం

### పాన్‌పరాగ్, గుట్కాలకు సినీ దిగ్గజాల ప్రచారమా?

### ఢిల్లీలో మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ



**న్యూఢిల్లీ:** ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వర్మ అవినీతి ఉదంతం భారతదేశ న్యాయవ్యవస్థకే కళంకంగా మారిందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ పేర్కొన్నారు. ఆయన ఇంట్లో వంద కోట్ల కరెన్సీ బయటపడడంతో ప్రపంచం నివ్వెర పోయిందని అన్నారు. న్యూఢిల్లీలోని ఏపీ భవన్ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో డాక్టర్ నారాయణ మాట్లాడుతూ...జస్టిస్ వర్మ చేస్తున్నది వ్యాపారం కాకపోయినా వందల కోట్ల రూపాయలు ఇంట్లో ఉందంటే అదంతా అవినీతి సొమ్మేనని అర్థమవుతోందన్నారు. వ్యవహారం బయటకు పొక్కిన నాలుగు రోజుల అనంతరం ఢిల్లీ ఫైర్ డిపార్టుమెంటు అధికారులను మేనేజ్ చేసి అక్కడ కాలిన నోట్లు ఏమీ దొరకలేదని చెప్పిస్తున్నారని తెలిపారు. కాలిన నోట్ల కట్టలు బయట పడినా తప్పుడు రిపోర్టులు ఇచ్చిన ఫైర్ డిపార్టు మెంటు అధికారులనే ఫైర్ చేయాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు. నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిననాటి నుంచి న్యాయ వ్యవస్థ స్వతంత్రను కోల్పోతున్నదని నారాయణ పేర్కొన్నారు. మోదీ పడగ నీడన న్యాయవ్యవస్థ ఉందని ఆరోపించారు. ప్రస్తుతం అవినీతి సొమ్ముతో అడ్డంగా దొరికిన వర్మను అలహాబాదు హైకోర్టు కూడా తమకు వద్దు అంటోందని, ఈ నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టు ప్రధాన ద్వారం ముందు పెద్ద కుర్చీ వేసి పని ఇవ్వకుండానే ఖాళీగా కూర్చోబెట్టాలని, ఇదే సరైన శిక్ష అంటూ చురకలంటించారు. న్యాయవ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన తరుణం ఆసన్నమైందని స్పష్టం చేశారు. ఇక మోదీ ప్రభుత్వం రాజ్యాంగం అందించిన ఫెడరల్ ( సమాఖ్య ) స్ఫూర్తిని తీవ్రంగా దెబ్బ కొడుతోందని నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగానే డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన)ను ముందుకు తెచ్చిందని మండిపడ్డారు. ఇది దేశాన్ని దక్షిణాది, ఉత్తరాది అని రెండుగా విభజిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది దురదష్టకరం అన్నారు. ఇది దక్షిణాదికి సంబంధించిన సమస్య కాకూడదని పేర్కొన్నారు. గతంలో ఇందిరా గాంధీ ఫెడరల్ స్ఫూర్తికి భిన్నంగా పాలన సాగిస్తుంటే ఎన్‌టీఆర్ దాన్ని అడ్డుకోవడం కోసం ఉద్యమించారని, దానికి వామపక్షాలు సహా ఇతర శక్తులు మద్దతుగా నిలిచాయని పేర్కొన్నారు.

తాజాగా మోదీ పాలనలో ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలుగుతోందని దుయ్యబట్టారు. డబ్బుల కోసం సమాజానికి హాని చేసే గుట్కా, పాన్ పరాక్ తదితర ప్రకటనల్లో నటిస్తున్న సినిమా హీరోల తీరు దారుణమని నారాయణ పేర్కొన్నారు. హిందీ నటులు అమితాబ్, షారూఖ్ మొదలు తెలుగు నటులు కూడా అనేక మంది ఆ ఆ తరహా ప్రకటనల్లో నటించడాన్ని ఆక్షేపించారు. మంచి సంపాదన ఉన్నా డబ్బుల కోసం ఇటువంటి చౌక బారు ప్రకటనలు ఇవ్వడం మంచిది కాదన్నారు.

## షిండేకు క్షమాపణ చెప్పను

### మంచం కింద దాక్కోను

### స్టాండప్ కమెడియన్ కునాల్ కామ్రా

### శివసైనికుల విధ్వంసాన్ని సమర్థింబోను : షిండే





**ముంబాయి/న్యూఢిల్లీ :** మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేను ఉద్దేశించి తన షోలో చేసిన వ్యాఖ్యల విషయంలో క్షమాపణ చెప్పబోనని లేదా వివాదం సద్దుమణిగే దాకా మంచం కింద దాక్కోబోనని స్టాండప్ కమెడియన్ కునాల్ కామ్రా స్పష్టం చేశారు. షోలో తనపై చేసిన వ్యాఖ్యలపై అంతకుముందు షిండే స్పందిస్తూ తనను లక్ష్యంగా చేసుకొని పేరడీలో చేసిన వ్యాఖ్యలు తనకు వ్యతిరేకంగా కొంతమంది వద్ద సుపారీ తీసుకొని మాట్లాడినట్లుగా ఉందని అన్నారు. భావ ప్రకటనా స్వేచ్ఛ ఉంటుందని, వ్యంగ్యానిన తాము అర్థం చేసుకుంటామని, కానీ, భావ ప్రకటన స్వేచ్ఛకు కూడా పరిమితులు ఉంటాయని చెప్పారు. అయితే, షో జరిగిన వేదికను శివసైనిక్‌లు విధ్వంసం చేయడం పై వ్యాఖ్యానిస్తూ చర్యకు ప్రతి చర్య ఉంటుందని, దానిపై తాను ఎక్కువ మాట్లాడబోనని, విధ్వంసాన్ని తాను వెనుకేసుకురానని షిండే చెప్పారు. మంగళవారం నాడు ఖార్ పోలీస్ స్టేషన్ కు రావాల్సిందిగా ముంబాయి పోలీసులు కునాల్ కామ్రాకు నోటీసులు ఇచ్చారు. ప్రభుత్వ వ్యతిరేక వ్యాఖ్యలతో 36 సంవత్సరాల కామ్రా నిత్యం వర్తల్లో నిలుస్తుంటారు. ఇదిలా ఉండగా తన వైఖరిపై కునాల్ కామ్రా మరింత దృఢంగా నిలిచారు. తాను స్టాండప్ కామెటీ చేసిన వేదికను శివసైనిక్‌లు కూల్చి వేసిన వీడియాఓలను, తన ఫోటోలు, దిష్టి బొమ్మలను తగులపెడుతున్న వీడియోలకు ''హమ్ హోంగే కంగాల్, హమ్ హోంగే కంగాల్ ఏక్ దిన్.. మన్ మే హై అంధ్ విశ్వాస్, దేశ్ కా సత్యనాశ్ (మేము నాశనమైపోతాము , ఒక రోజు మేము నాశనమై పోతాము, మనసులో అంధ విశ్వాసం. దేశం సర్వనాశనం చేస్తాం..) ' అంటూ పేరడీ పాటను నేపథ్యగానంగా జత చేశారు. ప్రస్తుతం పాండిచ్చేరిలో ఉన్న ఆయన తన ఫోటోను అప్‌డేట్ చేసి 'నా షోలో పరుష భాష, దూకుడు కంటెంట్ ఉంటుందని, రెచ్చిపోయే వారు లేదా మనోభావా నొచ్చుకునే వారు తన షోలు చూడాల్సిన అవసరం లేదు' అని కామెంట్ రాసారు. షిండే గుండా కామ్రా చేసింది సరైందనే నిరూపించారని శివసేన (యుబిటి) నేత ప్రియాంక చతుర్వేది అన్నారు. కునాల్ ఎవరి పేరు తీసుకోలేదని, గువహాతికి వెళ్ళిన గడ్డం ఉన్న వ్యక్తి ఫడ్నవీస్ చేతిలో తోలు బొమ్మ అని మాత్రమే అన్నారని, షిండే గుండాలే ఆ వ్యాఖ్యలు తమ అధినాయకుడిని ఉద్దేశించినవని భావించి విధ్వంసానికి పాల్పడ్డారని ఆమె తన ఎక్స్ ఖాతాలో రాశారు. యూ ట్యూబర్ ధృశ్ రాఠీ తన ఎక్స్ ఖాతాలో ' అసలైన 56 ఇంచుల ధైర్యం' అని కామ్రాను ఉద్దేశించి ప్రశంసించారు.

## ఎంపిల కన్నా ఎమ్మెల్యేల జీతాలే ఎక్కువ

**న్యూఢిల్లీ:** ఎంపిల జీతాలను కేంద్ర ప్రభుత్వం తాజాగా 24 శాతం మేర పెంచింది. దీంతో ప్రతి నెలా ఒక్కో ఎంపి రూ.1.24 లక్షలు జీతం తీసుకుంటారు. ఇది 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని కేంద్రం స్పష్టం చేసింది. ఈ బకాయిలను త్వరలో విడుదల చేస్తామని ప్రకటించింది. ఇప్పటి వరకు ఒక్కో ఎంపీకి రూ.లక్ష మాత్రమే వేతనంగా ఉండేది. ఎంపీలకు జీతంతో పాటు ఇతర అలవెన్సులు ఉంటాయి. రోజువారీ భత్యం రూ.2 వేల నుంచి రూ.2,500కు పెంచారు. మాజీ ఎంపీలకు ప్రతి నెలా రూ.31 వేలు పెన్షన్ లభిస్తుంది. లోక్‌సభ లేదా రాజ్యసభ ఎంపీగా మరోమారు పదవీ కాలం ఐదు సంవత్సరాలు పూర్తి చేస్తే... వారి పెన్షన్ మొత్తానికి అదనంగా మరో రూ.2,500 ఇస్తారు. అయితే ఇప్పటి వరకు ఈ మొత్తం రూ.2 వేలుగా ఉన్నది.

ప్రతి ఎంపీకి రూ.87 వేలు నియోజకవర్గ భత్యంతోపాటు రూ.75 వేలు కార్యాలయ ఖర్చుల కోసం మంజూరు చేస్తారు. కార్యాలయంలో ఫర్నీచర్ కొనుగోలు కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తారు. వీటితోపాటు ఉచిత విమాన, రైలు ప్రయాణ సౌకర్యాలు కల్పిస్తారు. ఇదిలా ఉంటే దేశంలో ఎమ్మెల్యేలు అత్యధిక జీతం అందుకుంటున్న రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. తెలంగాణ ఎమ్మెల్యేల జీతం నెలకు రూ.20 వేలు. వీటితో అలవెన్సులు కలిపి నెలకు రూ.2.50 లక్షలు పొందుతారు. ఎమ్మెల్యేల జీతాల విషయంలో మధ్యప్రదేశ్ రెండోస్థానంలో నిలిచింది. అక్కడి ఎమ్మెల్యేలు జీతభత్యాలు కలిపి నెలకు రూ.2.10 లక్షలుగా ఉన్నాయి. ఎమ్మెల్యేలకు జీతభత్యాలే కాకుండా రాష్ట్ర రాజధానిలో వసతి, ప్రయాణభత్యం, రోజు వారీ భత్యంతో పాటు ప్రయాణ సౌకర్యాలు కల్పిస్తారు. ఉత్తరప్రదేశ్‌లో ఎమ్మెల్యేలు ప్రతి నెలా రూ.1.87 లక్షల జీతం అందుకుంటున్నారు.ఈశాన్య రాష్ట్రమైన త్రిపురలో ఎమ్మెల్యేలు ప్రతి నెలా రూ.34 వేలు జీతంగా తీసుకొంటున్నారు. దేశంలో అత్యల్ప జీతం తీసుకుంటున్న ఎమ్మెల్యేలుగా త్రిపుర రాష్ట్రం చిట్టచివరి స్థానంలో నిలిచింది. ఒక్క లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో దాదాపు ఏడు అసెంబ్లీ స్థానాలుంటాయి. అంటే ఏడుగురు ఎమ్మెల్యేలకు ఒక్క ఎంపీ ఉంటారు. అయినా ఎంపీల కంటే ఎమ్మెల్యేల జీతమే అధికంగా ఉంది. అదీకాక.. ఎన్నికల వేళ ఎంపీ స్థానాని కంటే ఎమ్మెల్యే పదవికి పోటీ పడే వారి సంఖ్యే అధికంగా ఉంటుంది.

## 7.81లక్షలకు పైగా సిమ్‌కార్డుల బ్లాక్

**న్యూఢిల్లీ :** ఈ ఏడాది ఫిబ్రవరి 28 వరకు డిజిటల్ మోసాలకు సంబంధించిన 7.81 లక్షలకు పైగా సిమ్ కార్డులను దర్యాప్తు సంస్థలు బ్లాక్ చేశాయని మంగళవారం లోక్‌సభకు ప్రభుత్వం సమాచారం అందిం ది. కేంద్రహోం వ్యవహారాల సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఒక లిఖితపూర్వక ప్రశ్నకు సమాధానమిస్తూ, పోలీసు అధికారులు నివేదించిన మొత్తం 2,08, 469 ఐఎంఇఐలను భారత ప్రభుత్వం బ్లాక్ చేసిందని చెప్పారు. అంతర్జాతీయ మొబైల్ పరికరాల గుర్తింపు (ఐఎంఇఐ) అనేది ప్రతి ఫోన్‌కు కేటాయించబడిన ప్రత్యేక సంఖ్య. కాగా, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ కింద పనిచేసే ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సి), డిజిటల్ అరెస్టు కోసం ఉపయోగించే 3,962 కంటే ఎక్కువ స్కైప్ ఐడిలు, 83,668 వాట్సాప్ ఖాతాలను ముందుగానే గుర్తించి బ్లాక్ చేసిందని మంత్రి తెలిపారు. ఆర్థిక మోసాలను వెంటనే నివేదించడానికి, మోసగాళ్ళు నిధులను స్వాహా చేయడాన్ని ఆపడానికి ఐ4సి కింద సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ 2021లో ప్రారంభించబడింది. ఇప్పటివరకు, 13.36 లక్షలకు పైగా ఫిర్యాదులలో దాదాపు రూ. 4,386 కోట్లు ఆదా అయ్యాయి అని బండి సమాధానమిచ్చారు. ఐ4సిలో భాగంగా, మహిళలు, పిల్లల నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి, అన్ని రకాల డిజిటల్ నేరాలకు సంబంధించిన ఘటనలను ప్రజలు నివేదించడానికి వీలుగా జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (https:// cybercrime.gov.in) ప్రారంభించబడిందని మంత్రి చెప్పారు. ఈ పోర్టల్‌లో నివేదించబడిన నేరాలు, వాటిని ఎఫ్ఐఆర్‌లుగా మార్చడం, తదుపరి చర్యలను సంబంధిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోని చట్ట అమలు సంస్థలు నిర్వహిస్తాయని ఆయన అన్నారు. ఫిర్యాదులను నమోదు చేయడంలో సహాయపడటానికి టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1930 అమలులోకి వచ్చిందని మంత్రి చెప్పారు.

## కేరళ ప్రాదేశిక జలాల్లో అక్రమ చేపల వేటను అడ్డుకోవాలి

### కాంగ్రెస్ ఎంపి శశి థరూర్



**న్యూఢిల్లీ :** కేరళ ప్రాదేశిక జలాల్లో అక్రమ చేపల వేట పద్ధతుల అంశాన్ని కాంగ్రెస్ ఎంపి శశి థరూర్ మంగళవారం లోక్‌సభలో ప్రస్తావించారు. కోస్ట్ గార్డ్, భారత నావికాదళాన్ని కలుపుకుని బుల్ ట్రాలింగ్, కృత్రిమ లైట్లు లేదా ఎల్ఇడి లైట్ల వాడకాన్ని నిషేధించాలని ప్రభుత్వాన్ని కోరారు. లోక్‌సభలో జీరో అవర్ సందర్భంగా ఈ అంశాన్ని లేవనెత్తిన థరూర్ భారత ప్రభుత్వం బుల్ లేదా పెయిర్ ట్రాలింగ్ వంటి హానికరమైన ఫిషింగ్ పద్ధతులను, మన ప్రత్యేక ఆర్థిక జోన్‌లలో భారతీయ జలాల్లో చేపలు పట్టడానికి కృత్రిమ లైట్లు లేదా ఎల్ఇడి లైట్ల వాడకాన్ని నిషేధించిందని అన్నారు. కానీ ఈ పద్ధతులు కేరళ జలాల్లో కొనసాగుతున్నాయి. బయటి వ్యక్తులు పెద్ద ఎత్తున చేపలు పడుతూ దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. ఇది చివరికి చేపల వనరుల వేగవంతమైన క్షీణత ద్వారా సముద్ర వనరులను ప్రమాదంలో పడేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న, సాంప్రదాయ మత్స్యకారుల జీవనోపాధికి ముప్పు కలిగిస్తుందని తిరువనంతపురం కాంగ్రెస్ ఎంపి అన్నారు. సాంప్రదాయ మత్స్యకారులపై బుల్ ట్రాలర్లు, ఎల్ఇడి లైట్లను ఉపయోగించే మత్స్యకారుల దాడులకు పాల్పడ్డారని, వారి జీవనోపాధిని కాపాడుకోవాల్సిన తక్షణ అవసరాన్ని ఎత్తిచూపుతుందన్నారు. ఈ పద్ధతులు భారతదేశ బ్లూ ఎకానమీ పాలసీ ఫ్రేమ్‌వర్క్, మారిటైమ్ ఇండియా విజన్ 2030, ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు కూడా విరుద్ధంగా ఉన్నాయని థరూరల్ పేర్కొన్నారు.

## ఒకే దేశం–ఒకే ఎన్నిక.. జెపిసి గడువు పొడిగింపు

**న్యూఢిల్లీ :** ఒకే దేశం–కే ఎన్నిక కోసం ఏర్పాటు చేసిన పార్లమెంటరీ కమిటీ పదవీకాలాన్ని పొడిగించేందుకు లోక్‌సభ మంగళవారం ఆమోదం తెలిపింది. కమిటీ పదవీకాలం పార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరి వారం తొలి రోజు వరకు ఉండనున్నది. ఉమ్మడి పార్లమెంటరీ కమిటీ చైర్మన్ పిపి చౌదరి లోక్‌సభలో కమిటీ పదవీకాలాన్ని పొడిగించే తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టగా.. వాయిస్ ఓటు ద్వారా ఆమోదించారు. రాజ్యసభ నుంచి కొత్త సభ్యుడికి కూడా పార్లమెంటరీ కమిటీలో స్థానం కల్పించినట్లు లోక్‌సభ సెక్రటరీ జనరల్ సభకు తెలిపారు. వైఎస్సార్‌సిపికి చెందిన రాజ్యసభ సభ్యుడు విజయ సాయిరెడ్డి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దాంతో 39 మంది సభ్యుల కమిటీలో ఓ పోస్టు ఖాళీ కావడంతో కొత్తగా సభ్యుడికి చోటు కల్పించారు. దేశవ్యాప్తంగా ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించేందుకు తీసుకువచ్చిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టిన విషయం విధితమే. ఈ బిల్లు భారత రాజ్యాంగ మూల స్వరూపానికి భంగం కలిగించేలా ఉందని.. జెపిసికి బిల్లును పంపాల్సిందేనని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. దీంతో 39 మంది ఎంపిలతో జెపిసి కమిటీ ఈ బిల్లును అధ్యయనం చేసేందుకు ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో లోక్‌సభ 27 మంది, రాజ్యసభ నుంచి 12మంది ఎంపీలు సభ్యులుగా ఉన్నారు. కమిటీకి బిజెపి ఎంపి పిపి చౌదరి నేతృత్వం వహిస్తున్నారు. మాజీ కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్, పురుషోత్తం రూపాలా, మనీశ్ తివారీ, ప్రియాంక గాంధీ, బన్సూరి స్వరాజ్, సంబిత్ పాత్రాతో పాటు పలువురు కమిటీలో సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ కాల పరిమితి ఏప్రిల్4తో ముగియనున్నది. బిల్లుపై ఇంకా చర్చించాల్సిన అవసరం ఉందని సంబంధిత అధికార వర్గాలు తెలిపాయి. ఈ విషయంలో ఇప్పటికే న్యాయనిపుణులతో కమిటీ చర్చలు జరిపింది. సుప్రీంకోర్టు మాజీ సిజెఐలు జస్టిస్ లలిత్, జస్టిస్ రంజన్ గొగోయ్, ప్రముఖ న్యాయవాది హరీశ్ సాల్వే, ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏపీషా కమిటీ ఎదుట హాజరై అభిప్రాయాలను తెలిపారు.



# జనరల్

STATE NEWS REGIONAL NEWS

## ఎల్‌బి స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం ఇఫ్తార్ విందు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రంజాన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చింది. ఎల్‌బి స్టేడియంలో మంగళవారం సాయంత్రం ఇచ్చిన విందులో ముస్లిం మత పెద్దలు, వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నేతలు పాల్గొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు ఈ ఇఫ్తార్ విందులో పాల్గొనలేదు.

## దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు

అసెంబ్లీ పద్దు మంత్రి కొండాసురేఖ సమాధానం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ తెలిపారు. సామాన్య భక్తులను దృష్టిలో పెట్టుకుని దేవాలయాల్లో కనీస సౌకర్యాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యతనివ్వడంతో పాటు, గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన అభివృద్ధి పనులను పుర్తి చేసేందుకు కట్టుదిట్టమైన ప్రణాళికలను అమలు చేస్తున్నామని చెప్పారు. ఆక్రమణకు గురైన దేవాదాయ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటున్నామని తెలిపారు. శాసనసభలో మంగళవారం దేవాదాయ, అటవీ శాఖ పద్దులపై జరిగిన చర్చలో పలువురు సభ్యులు ప్రస్తావించిన వివిధ అంశాలకు మంత్రి కొండ సురేఖ సమాధానం ఇచ్చారు. ప్రజల నమ్మకాలు, విశ్వాసాలకు ఎంతో ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రంలో ప్రధాన పండుగలైన సమ్మక్క, సారాలమ్మ జాతర, బోనాల జాతరను ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించిందన్నారు. దేవాదాయ శాఖ కార్తీక మాసంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరివేసేలా 'సామూహిక కార్తీకమాస దీపోత్సవ వేడుకలు' వైభవోపేతంగా పూర్తి చేశామని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైనటువంటి బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయం ఆధ్వర్యంలో నదీ హారతి కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. జాతర నేపథ్యంలో దేవాలయాల నిర్వహణ, భక్తులకు సౌకర్యాల నిమిత్తం దేవాలయాల్లో 126 ఉత్సవ కమిటీలను ఏర్పాటుతో చేయడంతో పాటు 408 దేవాలయాలకు ట్రస్ట్ బోర్డులను ఏర్పాటు చేసేందుకు నోటిఫికేషన్ జారీ చే శామని వివరించారు. భద్రాచలం దేవస్థానంలో భక్తులకు మరిన్ని సౌకర్యాలను కల్పించేందుకు దేవాదాయ శాఖ పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి కొండాసురేఖ తెలిపారు.

## ఎర్రచందనం ఎగుమతులకు అనుమతులు తేవాలి : పైడి రాకేష్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎర్రచందనం ఎగుమతులకు అనుమతులు తేవాలని బిజెపి ఎంఎల్‌ఎ పైడి రాకేశ్ రెడ్డి అన్నారు. తాను కూడా ఎర్రచందనం వ్యాపారినని ఎర్రచందనం రైతుల ఇబ్బందులు తెలుసునని చెప్పారు. సూర్యపేట, కోదండ ప్రాంతాలలో రైతులు 30 నుంచి 40 ఏళ్లపాటు ఎర్రచందనం చెట్లు సాగు చేస్తున్నారని, వారు ఇప్పుడు వాటిని విక్రయించుకోలేని స్థితిలో ఉన్నారని శాసనసభ దృష్టికి తీసుకొచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో 250 టన్నుల కోట ఉండేదని, రాష్ట్రం వీడిపోయినప్పుడు ఈ విషయం తాను చెప్పానని, కానీ పట్టించుకోలేదన్నారు. పాఠశాలలకు ఖర్చు చేసిన వ్యయాన్ని 119 నియోజకవర్గాల వారిగా వచ్చే బడ్జెట్‌లో బుక్‌లేట్ విడుదల చేయాలని కోరారు. బిఆర్‌ఎస్, కాంగ్రెస్ హయంలో 36 వేలమండి టీచర్లను నియామకం జరిపామని చెప్పుతున్నారని, 6 లక్షల మంది పిల్లలు ఎందుకు పాఠశాలలు వదిలేశారో చెప్పాలన్నారు. పాఠశాలలు, హస్టళ్లలో బాత్‌రూమ్‌లు, కనీస మౌళిక సౌకర్యాలు కల్పించాలని రాకేశ్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

**ఓలంపిక్స్ నిర్వహించేలా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలి : రాజ్ ఠాకూర్**

ఓలంపిక్స్ నిర్వహించేలా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలని కాంగ్రెస్ సభ్యులు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రభుత్వాన్ని కోరారు. ఓలంపిక్స్ నిర్వహిస్తే కేంద్ర ప్రభుత్వం కూడా నిధులు విడుదల చేస్తుందన్నారు. పదేళ్ల బిఆర్‌ఎస్ హయంలో నిర్లక్ష్యానికి గురైన క్రిడారంగం సిఎం రేవంత్ రెడ్డి హయంలో ఆధారణకు నోచుకుందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్దతో నిధులు కేటాయిస్తున్నారని అన్నారు. ఎంఎల్‌ఎలకు హెల్త్ క్లబ్ ఏర్పాటు చేయాలన్నారు. నాలుగు లేన్‌లుగా ఉన్న రాజీవ్ రహదారిపై ప్రతిరోజు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ఈ రహదారిని ఆరులేన్‌లుగా విస్తరించాలని ప్రభుత్వాన్ని రాజ్ ఠాకూర్ కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని కాంగ్రెస్ సభ్యులు గండ్ర సత్యనారాయణ సూచించారు. విశ్వవిద్యాలయాల విద్యార్థులు తెలంగాణ ఉద్యమంలో వీరోచితంగా పోరాడితే, తెలంగాణ వచ్చాక బిఆర్‌ఎస్ నేతలకు చేరో యూనివర్సిటీలు వచ్చాయని కాంగ్రెస్ సభ్యులు మందుల సామెల్ అన్నారు. సామెల్ వ్యాఖ్యాలను బిఆర్‌ఎస్ సభ్యుడు కౌశిక్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరువురి మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. స్పీకర్ జోక్యం చేసుకోవడంతో గొడవ సద్దుమణిగింది. పాఠశాలలో టీచర్లకు బయోమెట్రిక్ హాజరు విధానం ఏర్పాటు చేయాలని సామెల్ సూచించారు. టీచర్లు ఉన్నా, పాఠశాలలకు గైర్హాజర్ అవుతున్నారని, ఈ విషయాన్ని తాను స్వయంగా పరిశీలించి, సూర్యపేట కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో గైర్హాజరైన టీచర్లకు మెమోలు ఇచ్చారని సామెల్ తెలిపారు.

## చట్టపరమైన ప్రక్రియకు రాజకీయ పార్టీలు సహకరించాలి

ప్రధాన ఎన్నికల అధికారి



**ప్రజాపక్షం / హైదరాబాద్:** ఓటరు నమోదు, చేర్పులు, తొలగింపులను నియంత్రించే చట్టపరమైన ప్రక్రియకు రాజకీయ పార్టీలు సహకరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఈఓ) సి.సుదర్శన్ రెడ్డి కోరారు. రానున్న ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితాలను సవరించడానికి జరుగుతున్న ప్రయత్నాలను చర్చించడానికి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఈఓ) సి.సుదర్శన్ రెడ్డి మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సిఈఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇ.టి.నరసింహ (సిపిఐ), మర్రి శశిధర్‌రెడ్డి (బిజెపి), డాక్టర్ వినయ్ (బిఆర్‌ఎస్), ముస్తాక్ (ఎఐఎంఐఎం), హుస్సేన్ (ఆప్), డి.జి.నరసింహారావు (సిపిఐ(ఎం) హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఈఓ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 1718 సంవత్సరాల వయస్సు గల మొదటిసారి ఓటర్లను నమోదు చేయడం ప్రాముఖ్యతను గుర్తించాలని ఆయన సూచించారు. ఓటరు జాబితాలలో మరింత స్పష్టతను తీసుకువచ్చేందుకు, వ్యత్యాసాలను పరిష్కరించడానికి, బలమైన ఎన్నికల ప్రక్రియను నిర్ధారించడానికి చర్యలు తీసుకోవడం వంటి చొరవలను సిఈఓ వివరించారు. గేటెడ్ కమ్యూనిటీలలో పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయడం, ఓటరు ఐడిలతో ఆధార్‌ను లింక్ చేయడం, మరణించిన ఓటర్లను జాబితాల నుండి తొలగించడం వంటి సూచనలను ఆయన హాజరైన రాజకీయ పార్టీ నుంచి తీసుకున్నారు. కాగా జిహెచ్‌ఎంసి పరిధిలో ఇతర రాష్ట్రాలు, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వివిధ కారణాలతో వలస వచ్చిన దాదాపు 20 మంది ఉన్నారని, వారికి రెండు చోట్ల ఓటు హక్కు ఉండే అవకాశాలు ఉన్నాయని సిపిఐ ప్రతినిధి ఇ.టి.నరసింహ సిఈఓ దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో జిహెచ్‌ఎంసి పరిధిలోని ఓటర్లకు తప్పకుండా ఏదో ఒక గుర్తింపు కార్డు నిర్ధారించాలన్నారు. ఓటర్ లిస్టుతో ఆధార్ కార్డు అనుసంధానాన్ని సుప్రీంకోర్టు తిరస్కరించిందని, అయితే ఆధార్ కార్డు అనుసంధానాన్ని బలవంతంగా కాకుండా ఆప్షనల్‌గా చేస్తూ బూత్ లెవల్ ఆఫీసర్ల (బిఎల్‌ఓ) కు సర్క్యులర్ జారీ చేయాలని ఆయన సూచించారు.

# విద్య, వైద్యరంగానికి అధిక ప్రాధాన్యం

రాజకీయ విమర్శలు కాకుండా సూచనలు, సలహాలను స్వీకరిస్తాము

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర రాజనరసింహ







**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మనిషి సమగ్ర అభివృద్ధికి విద్యే నాంది అని, ఈ కారణంగానే కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్యరంగాలకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని, ఇందుకోసం రాజకీయ విమర్శలు కాకుండా సూచనలు, సలహాలను స్వీకరిస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర రాజనరసింహ అన్నారు. శాసన సభలో మంగళవారం పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్య, సాంకేతిక విద్య శాఖల పద్దులపై జరిగిన చర్చకు, పలువురు సభ్యులు లేవనెత్తిన వివిధ అంశాలకు మంత్రి దామోదర రాజనరసింహ సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాఠశాల విద్యకు సంబంధించి 100 శాతం ఎన్‌రోల్‌మెంట్‌తో పాటు, నాణ్యమైన విద్యా ప్రమాణాలు ఉండాలని, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఎందుకంటే 2014 నాటికి తెలంగాణలో ప్రభుత్వం 28405 పాఠశాలల్లో 27 లక్షల మంది విద్యార్థులు ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 19 లక్షలకు తగ్గిపోయిందన్నారు. ఈ పదేళ్లలో సుమారు 8 లక్షల మంది విద్యార్థుల సంఖ్య తగ్గడం ప్రమాదకరమన్నారు. అదే రెసిడెన్షిల్ పాఠశాలలకు సంబంధించి 1.75లక్షలు ఉండగా, ఆ సంఖ్య 4.76 లక్షలకు పెరిగిందని చెప్పారు. 5వేల పాఠశాలలు మూత పడ్డాయనే వ్యాఖ్యలు సత్య దూరమని, జిరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్న 1913 పాఠశాల్లో ప్రాథమిక పాఠశాల 1830, మాధ్యమిక 49, ఉన్నత పాఠశాలు 33 పాఠశాలు ఈ ఏడాది 79 పాఠశాల్లో విద్యార్థులు చేరడంతో పనిచేస్తున్నాయన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించి 125690 శాంక్షన్ పోస్టులు ఉండగా,1,09163 మంది పనిచేస్తున్నారని, 11,062 డిఎస్‌సి ప్రకటించామని చెప్పారు. రెసిడెన్షియల్ స్కూల్‌స 1023 ఉండగా, అందులో 662 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయన్నారు. దీంతో 2 లక్షల మంది విద్యార్థులు చాలీచాలని వసతులతో విద్యను కొనసాగిస్తున్నారన్నారు. కొత్త స్కూల్ ప్రారంభించడం తప్పు కాదని, కాని అది పేద విద్యార్థులకు శాపంగా మారకూడదన్నారు. తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత మన అమ్మ ఆదర్శ పాఠశాల కింద స్వయం సహాయక బృందాలకు అప్పగించి రూ.706 కోట్లను కేటాయించామని, 600 భవిత సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఒక్కొక్క స్కూల్‌కు రూ.200కోట్లతో 50 పాఠశాలలను రూ. 11600 కోట్లతో ఏర్పాటు చేయనున్నామన్నారు. విద్యా కమిషన్ ఏర్పాటు చేసి విద్యా ప్రమాణాల పెంపునకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఇంటర్ విద్యకు సంబంధించి 431 జూనియర్ కళాశాలల్లో 1.63 లక్షల మంది విద్యార్థులు 8 కొత్త కాలేజీలను ఏర్పాటు చేశామన్నారు. టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందిని భర్తీ చేశామని, కొత్త పాఠశాలలు ఏర్పాటు చేయడం కాదని, వాటిని సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా నిధులను కేటాయిస్తున్నామన్నారు. ఉన్నత విద్య అభున్నతికి ప్రభుత్వం అనేక చర్యలను చేపట్టిందన్నారు. కోఠి మహిళా విశ్వవిద్యాలయానికి తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు చాకలి ఐలమ్మ పేరును, తెలుగు విశ్వవిద్యాలయానికి తెలంగాణ సాహిత్య వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి పేర్లు పెట్టుకున్నామన్నారు. అన్ని విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లను నియమించామని చెప్పారు. యుజిసి కి సంబంధించి వైస్ ఛాన్సలర్ల నియమకం గవర్నర్లకు అప్పగించడాన్ని ప్రభుత్వం వ్యతిరేకిస్తూ కేంద్రానికి తమ నిరసనను వ్యక్తం చేశామన్నారు. సందర్భంగా సిపిఐ శాసనసభా పక్షం నాయకులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కొంతమంది ఇంటర్ విద్యార్థులు చదువు ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నారని, కళాశాలల్లో బోధిస్తున్న విద్యా విధానం శాస్త్రీయమైనదా, కాదా ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు. దీనిపై విచారణ కమిటీ ఏర్పాటు చేసి అధ్యయనం చేయాలని విజ్ఞప్తి చేశారు. మార్కులకు సంబంధించి కుంభకోణాలు చోటుచేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోందని, ఇది నిజమేనా అని ప్రశ్నించారు. ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలలను సమర్థవంతంగా నిర్వహించేలా సలహాలు ఇవ్వాలని విద్యా కమిషన్ కోరాలని చెపాలన్నారు. ఇందుకు మంత్రి దామోదర రాజనరసింహ మాట్లాడుతూ కమిషన్ ముఖ్య ఉద్దేశం విద్యా విధానాన్ని ఎప్పటికిప్పుడు పరిశీలిస్తూ సలహాలు సూచనలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశామని వివరించారు.

అంతకుముందు జరిగిన చర్చలో కాంగ్రెస్ సభ్యులు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యా రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని, ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కూడ కల్పించలేకపోయిందని విమర్శించారు. ఇంజనీరింగ్ విద్యకు సంబంధించి రాష్ట్రంలో 1.40 లక్షల సీట్లు ఉంటే ఇందులో 1.20 లక్షలు కేవలం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఉన్న కళాశాలలో ఉండడం దారుణమన్నారు. కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం ద్వారా మానవ వనరులను ధ్వంసం చేసిందని విమర్శించారు. బాల నైపుణ్యం వికాసం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఐఎం శాసనసభాపక్ష నాయకులు అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ మద్యనిషేధం, ఆబ్కారీశాఖ పేరును కేవలం ఆబ్కారీ శాఖగా మార్చితే సరిపోతుందని చమత్కరించారు. రాష్ట్రంలో మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని, ఇంకా మద్యనిషేధం అనే పదాన్ని కొనసాగించడం అర్థంలేదని పేర్కొన్నారు.

బిఆర్‌ఎస్ సభ్యులు పి.సబితా ఇంద్రా రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని 257 గ్రామ పంచాయతీల్లో పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం, రాగి జావను కొనసాగించాలని కోరారు. 'మన ఊరు మన బడి 'పథకాన్ని కొనసాగించాలని ఆమె సూచించారు. అన్ని చర్యలు తీసుకుంటున్నప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో 3,60,000 విద్యార్థులు ఎందుకు డ్రాప్ అవుట్ అయ్యారని ఆమె ప్రశ్నించారు. ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నప్పుడు, డ్రాప్ అవుట్ సంఖ్య లేకుండా చూడాలని సబితా ఇంద్రారెడ్డి ప్రభుత్వానికి సూచించారు.

పదవ తరగతిలో గ్రేడింగ్ విధానాన్ని తొలగిస్తున్నారన్నారు. కొడంగల్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే అల్పాహారం ఇస్తున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం ఇవ్వాలన్నారు. బాసర ట్రిపుల్ ఐటిలో గ్రేడింగ్ విధానంతోనే ప్రవేశాలు చేస్తున్నారని, కస్తూర్బా పాఠశాలలను డిగ్రీ వరకు అప్‌గ్రేడ్ చేయాలని, 17 మోడల్ పాఠశాలల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఆమె కోరారు.

## 7.7 శాతం పెరిగిన వాణిజ్య ఆదాయం

గత ప్రభుత్వం టూరిజంను నిర్లక్ష్యం చేసింది

అసెంబ్లీ పద్దులపై చర్చలో మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం చేపట్టిన వివిధ చర్యలతో ప్రస్తుత ఏడాది వాణిజ్య పన్నుల ఆదాయం 7.7 శాతానికి పెరిగిందని ఆబ్కారి,పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. రాష్ట్ర ఆదాయంలో పది శాతం, అంతకంటే ఎక్కువగా పర్యాటక రంగం నుంచే వచ్చేలా చూస్తున్నామన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో పర్యాటక రంగాన్ని నిర్లక్ష్యం చేసిందని, పర్యాటక పాలిసీని కూడా తీసుకురాలేదని ఆరోపించారు. ''వాణిజ్య పన్నులు, ఆబ్కారి, పర్యాటక, కళలు, సాంస్కృతిక శాఖలకు సంబంధించిన పద్దులపైన'' శాసనసభలో మంగళవారం జరిగిన చర్చలో పలువురు సభ్యులు ప్రస్తావించిన అంశాలకు మంత్రి జూపల్లి సమాదానమిస్తూ 202324 ఆర్థిక సంవత్సరంలో గత ప్రభుత్వ హయాంలో 0.1 శాతం మాత్రమే ఆదాయం నమోదైందన్నారు. బ్యాంకు రుణాల ద్వారా వివిధ నగరాలలో ఉన్న 'హరిత హోటల్స్' ప్రమాణాలు పెంచడంతో పాటు కొత్త హోటల్స్ నిర్మించేందుకు ప్రతిపాదనలను రూపొందిస్తు న్నామని, తద్వారా ఆదాయంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని వివరించారు. రానున్న ఐదేళ్లలో పర్యాటక రంగంలో రూ.15వేల కోట్ల పెట్టుబడుల ఆకర్షించాలని, మూడు లక్షల మందికి అదనపు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించడంలో దేశంలో తొలి ఐదు స్థానాల్లో తెలంగాణను నిలపడింద న్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ ప్రదేశాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో స్పెషల్ టూరిజం ఏరియాస్ ను(ఎస్‌టిఎ) 27 సెక్టార్లుగా గుర్తించామని వివరించారు. తమ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలను పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయాలని పలువురు ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, ప్రజాప్రతినిధుల నుంచి వస్తున్న అభ్యర్థనలను కూడా తప్పకుండా పరిగణనలోకి తీసుకుని, అందుకు అనుగుణంగా పనులు చేపడతామని మంత్రి జూపల్లి తెలిపారు. బోటింగ్, హరిత హోటల్స్, వాటర్ స్పోర్ట్స్, రోప్ వే, వెల్‌నెస్ సెంటర్లు, ఎకో టూరిజం, థీమ్ పార్క్‌ను, సస్పెన్షన్ బ్రిడ్జి, గ్లోగార్డెన్స్, మ్యూజికల్ ఫౌంటెంట్స్, త్రిడి ప్రొజెక్షన్ మ్యాపింగ్, సౌండ్ అండ్ లైట్ షో తదితర వాటి అనుమతుల మంజూరుకు నిమిత్తం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని మంత్రి జూపల్లి వివరించారు. ప్రస్తుతం టూరిజం ఆధ్వర్యంలో మొత్తం 43 హోటల్స్, 32 రెస్టారెంట్లు (వే సైడ్ ఎమినిటీస్) ఉన్నాయని, ఇందులో 23 హోటల్స్, ఒక రెస్టారెంట్‌ను టూరిజం కార్పొరేషన్ నిర్వహిస్తుండగా,16 హోటల్స్, 17 రెస్టారెంట్లు ప్రైవేట్ భాగస్వామ్యంలో నిర్వహిస్తున్నామని వివరించారు. నాలుగు హోటల్స్, 14 రెస్టారెంట్లను ప్రైవేట్ భాగస్వామ్యంలో నిర్వహించేందుకు ఎవ్వరూ ముందుకు రావడం లేదని, వీటి నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ పథకం ద్వారా నల్లమల్ల టూరిజం సర్క్యూట్ అభివృద్ధికి రూ.68 కోట్లు, రామప్ప టూరిజం సర్క్యూట్ అభివృద్ధి నిమిత్తం రూ.73 కోట్లు ,ఛాలెంజ్ బేస్డ్ డెస్టినేషన్ డెవలప్‌మెంట్ స్కీమ్ ద్వారా బుద్ధవనం డిజిటల్ ఎక్స్‌పిరియన్స్ సెంటర్‌కు రూ.25 కోట్లు, నిజాం సాగర్‌లో ఎకో టూరిజం అభివృద్ధికి రూ.10 కోట్లు, బల్కంపేట దేవాలయం అభివృద్ధి నిమిత్తం రూ. 4.20 కోట్లు,స్వదేశీ దర్శనం పథకం కింద భువనగిరి కోట అభివృద్ధికి రూ.56 కోట్లు,అనంతగిరి ఎకో టూరిజం అభివృద్ధికి రూ.38 కోట్లు కేటాయించామని వివరించారు. మూసీ నది పరివాహక ప్రాంతాల ప్రజల మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే లక్ష్యంగా మూసీ పునరుజ్జీవనం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. లండన్ ఐ తరహాలో జాయింట్ అబ్సర్వేషన్ వీల్ ఏర్పాటు అంశంపైన ఆలోచిస్తున్నామన్నారు. ఫ్యూచర్ సిటీలో గోల్ఫ్ కోర్స్, జాతీయ, అంతర్జాతీయ సమావేశాల నిర్వహణకు 20 వేల మంది సామర్థ్యంతో ముంబయిలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్ తరహాలో ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నామని మంత్రి జూపల్లి తెలిపారు.

**అంబేడ్కర్‌పైన నిజంగానే పేమ ఉంటే.. పూలదండ ఎందుకు వేయలేదు..?**

బిఆర్‌ఎస్‌కు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పైన నిజంనే ప్రేమ ఉంటే అంబేడ్కర్ విగ్రహానికి పూలదండ ఎందుకు వేయలేదని మంత్రి జూపల్లి కృష్ణారావు నిలదీశారు.అంబేడ్కర్ విగ్రహాని ఏర్పాటు చేసేందుకు పదేళ్ల సమయం పడుతుందా? అని ప్రశ్నించారు. హరిత హోటల్స్ ఎంతో కాలంగా పడావుపడి ఉన్నప్పటికీ గత ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు.

**పదేళ్లలో అనేక అభివృద్ధి పనులు చేపట్టాం: కెటిఆర్**

అంతకుముందు పద్దులపై జరిగిన చర్చలో పాల్గొన్న బిఆర్‌ఎస్ సభ్యులు కె.టి.రామారావు మాట్లాడుతూ అణచివేయబడిన సంస్కృతి , భాష, వ్యసకు బిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాణంపోసిందన్నారు. పదేళ్ల కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, మోజంజాహి మార్కెట్‌ను అభివృద్ధి చేశామన్నారు.



## ఏప్రిల్‌లో సిఎం రేవంత్‌రెడ్డి జపాన్ పర్యటన

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఏప్రిల్ నెలలో వారం రోజుల పాటు సిఎం జపాన్‌లో పర్యటించనున్నారు. ఈ మేరకు అధికారులు సిఎం పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ కూడా ఖరారు చేశారని సమాచారం. సిఎం తన పర్యటనలో భాగంగా ఒసాకాలో జరగనున్న ఇండస్ట్రియల్ ఎక్స్‌పోలో పాల్గొననున్నారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులపై వివిధ కంపెనీలకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్తలతో సిఎం రేవంత్‌రెడ్డి చర్చించనున్నారు. ఈ జపాన్ పర్యటనకు సిఎంతో పాటు రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఇతర అధికారులు వెళ్లనున్నారు.

## సిపిఐ ఎమ్మెల్యే కూనంనేనికి ధన్యావాదాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థలో ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్ట్ ఉద్యోగం కింద పనిచేస్తున్న కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని అసెంబ్లీలో సిపిఐ ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు ప్రస్తావించడంపై తెలంగాణ టూరిజం అభివృద్ధి కార్పొరేషన్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎప్లాయీస్ యూనియన్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం చాలా సంతోషంగా ఉందన్నారు.

## టెంపుల్ సిటీగా భద్రాద్రి రామాలయం

- భూసేకరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- మంత్రి తుమ్మల ప్రత్యేక చొరవతో రూ.34 కోట్లు విడుదల
- సిఎం రేవంత్‌రెడ్డికి తుమ్మల కృతజ్ఞతలు



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్

రాముడు నడయాడిన, దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి రామాలయానికి నూతన శోభ సంతరించుకోనుంది. శ్రీరామ నవమి సీతారామ కళ్యాణ నేపథ్యంలో మంత్రి తుమ్మ ల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో కాంగ్రెస్ ప్రభుత్వం కీలక ని ర్ణయం తీసుకుంది. భద్రాద్రి రా మాలయాన్ని అభివృద్ధి చేసి టెంపు ల్ సిటీగా మార్చేందుకు పూనుకుంది. అభివృద్ధికి ఆటంకంగా ఉన్న భూ సేకరణకు ప్రభు త్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. భద్రాద్రి ఆలయ అభివృద్ధికి సంబంధించి భూ సేకరణ సమస్యను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. యుద్ధ ప్రాతిపదికన భూ సేకరణ జరిపేలా చర్యలు చేపట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశానుసారం భూసేకరణకు సంబంధించి రూ. 34 కోట్లను విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. దీనితో శ్రీరామ నవమికి దక్షిణ అయోధ్య టెంపుల్ సిటీకి అడుగులు పడనున్నాయి. ఇటీవల ఆలయ ఈవో, పండితులు ముఖ్యమంత్రిని కలిసి భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి కళ్యాణ వేడుకలకు ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గతంలో భద్రాద్రి ఆలయ అభివృద్ధికి రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను ముఖ్యమంత్రికి వివరించారు. అభివృద్ధి పనులకు భూ సేకరణ అడ్డంకిగా మారిందని మంత్రి తుమ్మల సిఎంకు వివరించారు. భూసేకరణ పనులు పూర్తి చేస్తే భద్రాచల ఆలయ అభివృద్ధికి ఎలాంటి ఆటంకం ఉండదని టెంపుల్ సిటీగా భక్తులతో మరింత శోభిల్లుతుందని మంత్రి తుమ్మల తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భూసేకరణకు కావాల్సిన నిధులను విడుదల చేశారు. అడిగిందే తడవుగా నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయం నూతన శోభను సంతరించుకోనుంది. ఆగమ పండితులు రూపొందించిన నమూనాలు, సూచనల ప్రకారం అభివృద్ధి పనులు ప్రారంభించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. భూసేకరణ పనులను శరవేగంగా పూర్తి చేయాలని సూచించారు. యుద్ధ ప్రాతిపదికన షాపులు, ఇండ్లు, షిఫ్టింగ్ చేయాలన్నారు. శ్రీరామ నవమి వేడుకల అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా భద్రాద్రి ఆలయ పునః నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. భద్రాద్రి ఆలయాన్ని టెంపుల్ సిటీగా మార్చాలన్న రాష్ట్ర ప్రజల కల సాకారం కానుంది.

## దమ్మాయిగూడ తైబజార్‌ను రూ.31 లక్షకు దక్కించుకున్న మంగళపురి కిరణ్



**ప్రజాపక్షం/దమ్మాయిగూడః** దమ్మాయిగూడ మున్సిపాలిటీ పురపాలక సంఘం కార్యాలయంలో 202526 సంవత్సరంకు గాను తైబజార్ వేలం పాట కమిషనర్ నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ వేలం పాటలో మంగలపురి కిరణ్,పి బస్వారెడ్డి,ఎన్ కృష్ణారావులు పాల్గొన్నారు.ప్రభుత్వం వారి పాట 30 లక్షల 25 వేల రూపాయలు ఉండగా మంగళపురి కిరణ్ 31 లక్షల ఆరు వేల రూపాయలు వేలం పాట పాడి దక్కించుకున్నారు.ఎన్ కృష్ణారావు 31 లక్షల 5 వేలు పాట పాడి ద్వితీయ స్థానంలో ఉన్నారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ వెంకటేశం,కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందు ఏర్పాటు



**ప్రజాపక్షం/దోమః** పరిగి నియోజకవర్గంలోని ఐనాపూర్ గ్రామంలో సమాజ సేవకుడు భాస్కర్ గౌడ్ ముస్లిం సోదరులకు మంగళవారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని ఇఫ్తార్ విందులో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు సర్దార్, జహంగీర్, ఖదీర్, రహీం సలీం, గ్రామస్తులు ఆశన్నగౌడ్, నల్లసాయిలు రవికుమార్ గౌడ్, బుసని కృష్ణయ్య, నల్ల నర్సింలు రాములు, శేషముల, వెంకటయ్య, రఘు, అంజిలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో నాలుగు జైళ్లకు సరుకుల సరఫరాకు టెండర్లు

**ప్రజాపక్షం/చర్లపల్లిః** హైదరాబాద్ మహ నగరంలో గల నాలుగు జైళ్లైనా చర్లపల్లి, హైదరాబాద్ కేంద్ర కారాగారాలు, చర్లపల్లి వ్యవసాయ క్షేత్రం, హైదరాబాద్ ప్రత్యేక మహిళ కేంద్ర కారాగారాలకు 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను 1వ తేదీ ఏప్రిల్ 25 నుండి 31వ తేదీ మార్చి వరకు ఆహర వస్తువులు, ఇతర వస్తువులు, ఫ్యాక్టరీ సెక్షన్ కొరకు కావలసిన ముడి సరుకుల సరఫరా చేయుటకు ఏప్రిల్ 3వ తేదీన టెండర్లు జరుగుచున్నవి. టెండర్‌కు సంబంధించిన ఫారంలు మార్చి 25వ తేదీ మంగళవారం నుండి ఏప్రిల్ 2వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుండి 5 గంటల వరకు అన్ని పని దినములలో చర్లపల్లి కేంద్ర కారాగారం నందు విక్రయించబడుతుందని పర్యవేక్షణాధికారి జి.రాంచందం తెలిపారు ఇతర వివరాలకు 9494632101, 9494632113, 9490549502, 9000990589, 9866922657 నంబర్లను సంప్రదించాలని సూచించారు.



## దేశ చరిత్రలో నిలిచిపోయే పథకాలు కాంగ్రెస్‌తోనే సాధ్యం ః బండి జగనాథం

**ప్రజాపక్షం/శామీర్‌పేట ః** దేశ చరిత్రలో స్థిరంగా నిలిచిపోయే పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలుపరుస్తుందని ఏ రాజకీయ పార్టీ తీసుకుని నిర్ణయాలు కాంగ్రెస్ ప్రభుత్వం సాధ్యపరుస్తుందని మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, కాంగ్రెస్ శామీర్‌పేట వర్కింగ్ ప్రెసిడెంట్ బండి జగన్నాధం అన్నారు. మంగళవారం మూడుచింతలపల్లి మండల కేంద్రంలో మేడ్చల్ జిల్లాలో మిగిలిన గ్రామపంచాయతీలను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేస్తు ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించడంతో సిఎం రేవంత్ రెడ్డికి బండి జగన్నాధం ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. అనంతరం బాణసంచా కాలుస్తు స్వీట్లు పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టిందన్నారు. అలాగే ఎస్‌సిలకు వర్గీకరణకు బిల్లును అమలుపరిచిందని, ప్రభుత్వం కొత్తగా అలియాబాద్, మూడుచింతలపల్లి, ఎల్లంపేటలను మున్సిపాలిటీలుగా ప్రకటించిందన్నారు. టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి, డిసిసి అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.



## ప్రతి ఎకరాకు సాగునీరందిస్తాం

### మాజీ వైస్ ఎంపిపి మంద శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట ః** రైతులను రాజు చేయడమే లక్ష్యంగా సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని రైతులు సాగు చేస్తున్న ప్రతి ఎకరాకు నీరందిస్తామని మేడ్చల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహయాదవ్, మాజీ వైస్ ఎంపిపి మంద శ్రీనివాస్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం మూడుచింతలపల్లి మండలం నారాయణపూర్‌లో కొండపోచమ్మ కాలువ నుంచి పంటలకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడుచింతలపల్లి మండలంలో పంటలకు నీరందక ఎండిపోతున్నాయని టిపిసిసి ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లగా కొండపోచమ్మ డ్యామ్ అధికారులతో మాట్లాడి నీటి విడుదలకు సహకరించారని అన్నారు. వెంటనే స్పందించి నీటి విడుదలకు కృషిచేసిన టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ బండి జగన్నాధం, మాజి సర్పంచ్ దోసకాయల వెంకటేష్, పట్టా బాల్ నర్సింహా, బుద్ది సత్తయ్య, నాయకులు బస్వారెడ్డి, దామోదర్‌రెడ్డి, బుద్ది అంజనేయులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై మహిళా సంఘాలకు శిక్షణ

**ప్రజాపక్షం/కోట్‌పల్లి ః** నేటి సమాజంలో సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణ తదితర అంశాల పై మహిళా సంఘాలు అవగాహన కలిగి ఉండాలని ఐకెపి ఏపిఎం శివయ్య అన్నారు. మంగళవారం బుగ్గాపూర్ రైతు వేదికలో మహిళా సంఘాలకు పలు అంశాలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి స్థానిక ఎస్సై గఫార్ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఐకేపీ ఏపిఎం శివయ్య మాట్లాడుతూ... మారుతున్న కాలానునుణంగా జరుగుతున్న మోసాలు, మానవ అక్రమ వ్యాపారం, రవాణ, సైబర్ క్రైమ్, సైబర్ నేరా లు, లైంగిక వ్యాపారం పట్ల మహిళా సంఘాలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతా ల్లోని ప్రజలకు సైబర్ నేరగాళ్లు తాము బ్యాంకు నుండి కాల్ చేస్తున్నా ము ఓటిపి చెప్పండీ అని మాట్లాడి మీ ఖాతాలను ఖాళీ చేసే అంశాలను తరుచుగా చూస్తున్నామని, ఒటిపిల కోసం ఏ బ్యాంకు నుండి కాల్ చేయరని, ఎవరైనా ఫోన్ చేసినా ఒటిపిలను చెప్పవద్దని అన్నారు. ఇలాంటి అంశాలపై గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మీపై ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిసిలు, విఒఎలు, మహిళా సంఘాల లీడర్లు, తదితరులు ఉన్నారు.

## తండ్రి గొంతు పిసికి చంపిన తనయుడు



**ప్రజాపక్షం/చర్లపల్లిః** తండ్రిని కొడుకు గొంతు పిసికి చంపిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సిఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సాయి నగర్ కాలనీకి చెందిన పాత్లవత్ జగదీష్(24) తన తండ్రి అయిన పాత్లవత్ శంకర్(54)ను సోమవారం అర్ధరాత్రి కుటుంబ కలహాల కారణంగా గొంతు పిసికి చంపాడని డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించగా అక్కడికి పోలీసులు, క్లూస్ టీమ్ చేరుకుని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి ఇంటి యజమాని అంజిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ తెలిపారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు యువకుడి బలి



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** ఓ ప్రయివేట్ గోదాంలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న యువకుడు ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడి డబ్బులు పోగొట్టుకోవటంతో చివరికి ప్రాణాలు పోగొట్టుకొన్న ఉదంతమిది. మేడ్చల్ పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నా యి. అనకాపల్లికి చెందిన రమణ, కనకమ్మ దంపతులు జీవనోపాధి నిమిత్తం నగరానికి వచ్చి మేడ్చల్ మండలం గుండ్ల పోచంపల్లి గ్రామంలో నివాసం ఉంటున్నారు. కుమార్తె వివాహం జరుగ గా దేవరయంజాల్ పరిధిలోని ఓ ప్రయివేట్ గోదాంలో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్న కుమారుడు సోమేష్ వారితో కల్సి ఉంటున్నాడు. గత కొద్దికాలంగా ఆన్‌లైన్ మ్యాచింగ్‌లకు అలవాటు పడి అప్పులు పాలవటంతో బెట్టింగ్ వద్దంటూ తల్లిదండ్రులు మందలించారు. అయినప్పటికి సోమేష్ గత సోమవారం జరిగిన ఐపిఎల్ మ్యాచ్‌లో మరోసారి డబ్బులు పోగొట్టుకొన్నాడు. బెట్టింగ్‌లో పోగొట్టుకొన్న డబ్బులు తను పనిచేస్తున్న గోదాంకు సంబంధించిన డబ్బులు అవటంతో భయాందోళనలకు గురై మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



## రైతుమహాసభకు సిపిఐ నాయకులు

**ప్రజాపక్షం/శామీర్‌పేట ః** నిజామాబాద్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మహాసభలకు శామీర్‌పేట మండలం నుంచి సిపిఐ జిల్లా నాయకులు మంగళవారం పెద్ద ఎత్తున తరలివెళ్లారు. సిపిఐ జిల్లా కార్యదర్శి డిజి సాయిలుగౌడ్, జిల్లా రైతు సంఘం నాయకులు నిమ్మల నర్సింహా, డిజి నరేంద్రప్రసాద్, తదితరులు తరలివెళ్లారు.

## బస్తీ దవాఖానల వైద్య సేవలపై విస్తృత ప్రచారం

### కలెక్టర్ గౌతం



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** పల్లె దవఖానాలు, బస్తీ దవఖానాల్లో అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు అధిక సంఖ్యలో వినియోగించుకొనే విధంగా సమీప ప్రాంతాల్లో విస్తృత ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ గౌతం వైద్యారోగ్యశాఖాధికారిని ఆదేశించారు.

మంగళవారం నాడు డిఎంహెచ్ఒ డా.ఉమా గౌరి, కూకట్‌పల్లి తహసీల్దార్ స్వామిలతో కల్సి కూకట్‌పల్లిలోని బాలాజినగర్ బస్తీ దవఖానా, హౌజింగ్ బోర్డు 4వ ఫేజ్‌లోని పల్లె దవఖానాలను ఆయన తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆయన పల్లెదవఖానాలో మందుల కు సంబంధించిన రికార్డులు సక్రమంగా లేవని కలెక్టర్ అసహనం వ్యక్తం చేసారు. ప్రతి రోజు ఎంతమంది రోగులు వస్తున్నారు, ఏ మేరకు వైద్య సేవలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారన్న విషయాలతో సహా రికార్డులను పరిశీలించారు. ప్రసవాలు, వ్యాక్సినేషన్, ఇమ్యూనైజేషన్‌లను పరి శీలించారు. టెలి మెడిసిన్ అందిస్తున్నారా లేదా అని కంప్యూటర్లలో ఆయన పరిశీలించారు. ప్రతి రోజు తనకు వైద్య సేవలకు సంబంధించి నివేదికలను విధిగా పంపాలని ఆదేశించారు.



## డబుల్ బెడ్‌రూమ్‌లలో నీటి వసతికి ఎంపి హామీ

**ప్రజాపక్షం/దుండిగల్ ః** దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని గండిమైసమ్మ కాలనీలోని డబుల్ బెడ్‌రూమ్‌లకు తాగునీటి వసతి తీవ్రంగా ఉందని మల్కాజ్‌గిరి ఎంపి ఈటెల రాజేందర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఎంపి నిధులతో పంపుసెట్లతో కూడిన మూడు బోరు బావులను వేయిస్తామని ఎంపి ఈటల రాజేందర్ హామీ ఇవ్వడంతో గండిమైసమ్మ డబుల్‌బెడ్‌రూమ్ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఎంపి చొరవతో కలెక్టర్ అనుమతులు ఇవ్వడంతో ఆనందంగా ఉందని దుండిగల్ మున్సిపల్ బిజెపి అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి అన్నారు. మున్సిపల్‌లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకరావాలని ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరనాయక్‌ను కలిసి తమ సమస్యలు విన్నవించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు గణేష్, నాగమణి, మధు, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను కార్యకర్తలందరూ ఇంటింటికి వెళ్లి విస్తృత ప్రచారం చేయాలని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఈస్ట్ ఆనంద్‌బాగ్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, సీనియర్ నేత లక్ష్మి కాంతరెడ్డిలు పిలుపిచ్చారు. మంగళవారం 139 డివిజన్ కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి సర్వసభ్య సమావేశం ఆనంద్‌బాగ్ పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సవరించిన నూతన ఓటర్ జాబితా ప్రకారం బూతు వారిగా ఓటర్లను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు వెంకటేష్ యాదవ్, బికె శ్రీనివాస్, ఉమేష్‌సింగ్, అశోక్‌రెడ్డి, యాదగిరి,తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ద్వారా భద్రాద్రి తలంబ్రాలు



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** ఆర్టీసీ ద్వారా శ్రీ రామనవమి సందర్భంగా భద్రాద్రి సీతారామ చంద్రస్వామి కళ్యాణ తలంబ్రాలు భక్తులు ఇంటికి నేరుగా చేరవేసే ఏర్పాట్లు చేసామని సికింద్రాబాద్ ఆర్టీసీ డిప్యూటి రీజనల్ మేనేజర్ పవిత్ర తెలిపారు. భద్రాద్రికి వెళ్లలేని భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కుషాయిగూడ డిపోలో మంగళవారం దీనికి సంబంధించిన పోస్టర్లను డిపో మేనేజర్ మహేష్‌కుమార్, అసిస్టెంట్ మేనేజర్ ఆనందరావు, అసిస్టెంట్ మెకానికల్ మేనేజర్ వ్యాస్, సెక్యూరిటి విభాగ అధికారి కెవిస్ రెడ్డి, కంట్రోలర్‌లతో కలిసి ఆవిష్కరించారు. బుకింగ్‌లకోసం మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రమేష్‌ను 9154298833, 9848852211 ద్వారా సంప్రదించవచ్చన్నారు.

## అవాస్తవాలు చెబితే సహించేది లేదు

### నిషిజ ఎస్టేట్స్ యాజమాన్యం



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ః**నిషిజ ఎస్టేట్స్‌పై తప్పుడు ఆరోపణలు అవస్తవాలను చేస్తే సహించేది లేదని నిషిజ ఎస్టేట్స్ యాజమాన్యం, మున్సిపాలిటీ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 543/3 నుండి 543/9 వరకు దాదాపు 123 ఎకరాలలో వెంచర్ అభివృద్ధి చేస్తున్నామని ఇందుకు హెచ్ఎండిఏ అనుమతులతో పాటు మైనింగ్ బ్లాస్టింగ్ అనుమతులు సైతం కలిగి ఉన్నాయని నిషిజ యజమాన్యం తెలిపారు. మేము ఎలాంటి ప్రభుత్వ భూమిని కానీ గట్టు మైసమ్మ దేవాలయనికి సంబందించిన భూమిని కానీ ఆక్రమించుకోలేదని స్పష్టం చేశారు. మాపైన ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై న్యాయస్థానం ద్వారా పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు.



## భూములు ఇచ్చే రైతులకు నష్టపరిహారం

### జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** పారిశ్రామిక పార్కుకు భూములు ఇచ్చేందుకు సమ్మతి తెలిపిన రైతులకు నష్ట పరిహారం ఇవ్వడం జరుగుతుందని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు.

మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్థాయి సంప్రదింపుల కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలం హకీంపేట్ కు చెందిన 114 మంది రైతులతో సంప్రదింపులు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హకీంపేట్ గ్రామంలో మొత్తం పట్టా భూమి 145. 34 గుంటల భూమి ఉందని స్వచ్ఛందగా ముందుకు వచ్చిన రైతులతో అగ్రిమెంటు తీసుకొని వెళతామన్నారు. జిల్లా స్థాయి సంప్రదింపుల కమిటీ నిర్ణయం ప్రకారం చెక్ పంపిణీ ఉంటుందని తెలిపారు. ఎకరానికి 20లక్షలు, 150 గజాల ఇంటి స్థలంలో ఇందిరమ్మ ఇల్లు, అర్హత మేరకు ఇంటికి ఒక ఉద్యోగం కల్పించనున్నట్లు కలెక్టర్ అన్నారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తాండూర్ సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, ఆర్అండ్‌బిఇఇ శ్రీధర్ రెడ్డి, శారద, అజీమ జుల్తానా, కిషన్ రైతులు తదితరులు పాల్గొన్నారు.



## కొడంగల్ బార్ అసోసియేషన్ కమిటి ఏకగ్రీవ ఎన్నిక

**ప్రజాపక్షం / కొడంగల్ ః** కొడంగల్ అడ్వకేట్ బార్ అసోసియోషన్ కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ఆ కమిటి సభ్యులు తెలిపారు. మంగళవారం కొడంగల్ మున్సిఫ్ కోర్డు బార్ అసోసియోషన్ ఎలక్షన్ ఆఫీసర్ పి.మధుసూదన్‌రెడ్డి నేతృత్వంలో కమిటి అధ్యక్షుడుగా వెంకట్ రెడ్డి న్యాయవాది, ఉపాధ్యక్షుడిగా బస్వరాజ్, జనరల్ సెక్రటరిగా బి.వెంకటయ్య, జాయింట్ సెక్రటరీగా కె.రమేష్, కోశాధికారిగా ఆనంద్, శ్రీనివాస్, లైబ్రెరియన్‌గా బి.కృష్ణయ్య, కల్చరర్ సెక్రటరీగా కె.రాములు, స్పోర్ట్స్ సెక్రటరీగా ఎస్‌డి మొహీద్, మహిళ రిప్రజెంటేషన్‌గా బాగ్యలతలతో పాటు మిగత బార్ అసోసియోషన్ న్యాయవాదులను కమిటి సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతు స్థానిక ఎంఎల్ఏ అయినటువంటి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొడంగల్ న్యాయస్థానంపై దృష్టి సారించి అభివృద్దికి కృషి చేయాలని కోరారు. అదేవిధంగా న్యాయవాదులపై తరచుగా జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు.

## చిలకవాగు ప్రక్షాళనకు సహకరించండి

### ఎంఎల్ఏ బిఎంఆర్

**ప్రజాపక్షం/తాండూరుః** తాండూరును పట్టి పీడిస్తున్న చిలుక వాగు ప్రక్షాళనకు ప్రభుత్వం సహకరించాలని తాండూరు ఎంఎల్ఏ బుయ్యని మనోహర్ రెడ్డి అసెంబ్లి సమావేశంలో ప్రస్తావించారు. మంగళవారం సాగిన బడ్జెట్ సమావేశంలో తాండూరు ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి తాండూరు మున్సిపల్ సమస్యలపై రెండవసారి గళమెత్తారు. చిన్నపాటి వర్షాలు పడిన తాండూరు పట్టణంలో రోడ్లు జలమాయంగా మారి రాక పోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ముఖ్యంగా తాండూరు పట్టణంలో ప్రవహించే చిలక వాగు పక్షాళన చేసెందుకు నిధులు కెటాయించాలని కోరారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగానే అభివృద్దికి నోచుకోలేదని, సమస్యలు తలేత్తున్నాయని ప్రస్తావించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే 1953లో తాండూరు మున్సిపల్ ఏర్పాటు అయిందని, 70వేల జనాభా కల్గిన తాండూరు మున్సిపల్‌లో తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, మిషన్ భగీరత ఉన్న నీటి సమస్య తీరడం లేదని,1965లో కాగ్నా నది నుండి తాండూరు పట్టణానికి తాగునీటి అందించెందుకు పైప్‌లైన్‌లు వేశారని, పైప్‌లైన్‌లు, మోటర్‌లు స్థితిలావస్థలో ఉన్నాయని, తాండూరు పట్టణ ప్రజలకు తాగునీటిని సరఫరా చేసెందుకు కొత్త పైప్‌లైన్ ఏర్పాటుకు ప్రభుత్వం నుండి నిధులు అందించాలని, కాగ్నా పైప్‌లైన్‌ను పునరుద్దరణ చేసి తాండూరుకు మంచినీటిని తాపాలని కోరారు. సంబంధింత మున్సిపల్ శాఖ మంత్రి దీనిపై దృష్టి సారించాలని ఎంఎల్ఏ మనోహర్‌రెడ్డి ప్రభుత్వం దృష్టి తీసుకవచ్చారు. ఇందుకు స్పందించిన మంత్రి కొండ సురేఖ ఎంఎల్ఏ నోహర్‌రెడ్డి ప్రస్తావించిన ప్రతి సమస్యను నోట్ చేసుకోవడం జరిగిందని తప్పకుండా పరిష్కరిస్తామని మంత్రి చెప్పారు.

## పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాపక్షం/మోమిన్‌పేట్:**వికారాబాద్ నియోజకవర్గంలోని మోమిన్‌పేట్ మండల పరిధిలోని అమ్రాది కలాన్ గ్రామనికి చెందిన ఈర్లపల్లి కుమార్ (42) కుటుంబం అవసరాలకోసం, కుమారుడు యాక్సిడెంట్లో గాయపడినందున కుమారుని చికిత్సకై అప్పులు చేశాడు. ఆ అప్పులు తీర్చలేక తన్ను తాను బాధపడుతు జీవితంపై విరక్తి చెంది 23న గడ్డికి కొట్టె పురుగుల మందు త్రాగినందున కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రిలో చూయిం చి డాక్టర్ సలహ మేరకు హైదరాబాద్ లోని ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడని మృతుని యొక్క భార్య ఆర్లపల్లి యాదమ్మ ఫిర్యాదు మేరకు మోమిన్‌పేట్ ఎస్ఐ అరవింద్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నాట్లు తెలిపారు. ప్రజలు ఎవరైనా కూడా ఆత్మహత్యలు చేసుకోవద్దని ఎసై విజ్ఞప్తి చేసినారు.



## కోర్టు విధుల బహిష్కరణ

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :**హైదరాబాద్‌లో రెండు రోజుల క్రితం ఓ న్యాయవాదిని అతి దారుణంగా హత్య చేసిన ఘటనను నిరసిస్తూ వికారాబాద్ జిల్లా కోర్టు న్యాయవాద సంఘం అధ్యక్షులు అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో విధులను బహిష్కరించి పెద్ద ఎత్తున నిరసనలు చేశారు.

న్యాయవాదుల దాడులను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల పరిరక్షణకు పట్టిష్టమైన చర్యలు తీసుకోవాలని అందులో భాగంగా న్యాయవాదులకు రక్షణ కల్పించేలా ప్రత్యేక చట్టాలు తేవాలని డిమాండ్ చేశారు

ఈ కార్యక్రమంలో బార్ అసోసియోషన్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## వశిష్ట కుటుంబానికి రవిశంకర్ ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/తాండూరుః**అరుదైన కాలేయ వ్యాధితో బాదపడుతునన చిన్నారి వశిష్ట వైద్యానికి తాండూరు జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రవిశంకర్ చేయుతను ఇచ్చారు. తనవంతుగా డాక్టర్ రవిశంకర్ వశిష్ట కుటుంబ సభ్యులకు రూ.25 వేల నగదును అందజేశారు. చిన్నారి వశీష్ట అరుదైన కాలేయ వ్యాధితో బాధపడుతున్న విషయం తెలిసిందే. కాలేయ మార్పిడి చికిత్సకోసం డబ్బులు లేకపోవడంతో కాంగ్రెస్ నాయకులు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఆయన ఆధ్వర్యాన తాండూరు జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రవిశంకర్ వశిష్ట కుటుంబ సభ్యులకు రూ.25వేల నగదును అందజేశారు. చిన్నారి వశిష్ట కుటుంబానికి తాండూరు స్టోర్ మర్చెంట్ అసోసియేషన్ సభ్యులు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి, పట్లోళ నర్సిములు తదితరులు ఉన్నారు.

## సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర చిరస్మరణీయం

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలమైందని, వారి సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ గ్రామంలోని పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న భీశ్వ క్రిష్టయ్య పదవీ విరణ పొందిన నేపథ్యంలో వారి దంపతులను పూల మాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు బావి భారత పౌరులుగా తీర్చిదిద్దే సత్తా కేవలం ఉపాధ్యాయులకు మాత్రమే ఉంటుందని అన్నారు. చిన్నతనం నుండే అనేక విషయాలపై అవగాహన కల్పించడంతో పాటు ప్రయోజకులుగా తీర్చిదిద్దే సత్తా ఉపాధ్యాయులకు ఉంటుందని వివరించారు. ఉపాధ్యాయులు నేర్పించే పాఠ్యంశాలను శ్రద్ధగా నేర్చుకొని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను చేరుకునేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భీశ్వ కిష్టయ్య, ప్రధానోపాధ్యాయురాలు జయమ్మ, సభాధ్యక్షురాలు శారద, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వెంకటప్ప, సింగిల్ విండో చైర్మెన్ బక్కన్న యాదవ్, మాజీ ఎంపిటిసిలు భీశ్వ రామకృష్ణ, అరుణ వెంకట్‌రెడ్డి, విష్ణు గౌడ్, వెంకటేష్, శ్రీను పాల్గొన్నారు.

## ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బస్సులో మంటలు

### విద్యార్థులు లేకపోవడం తప్పిన ప్రమాదం



**ప్రజాపక్షం/ఎల్బీ నగర్ :** స్కూల్ బస్సులో మంటలు చెలరేగిన ఘటన మంగళవారం నాగార్జునసాగర్ రోడ్డులో గుర్రంగూడ వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాదర్‌గూల్‌లో ఉన్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఒంటిపూట స్కూల్ పూర్తి అయింది. విద్యార్థులను వారి ఇండ్లకు చేరవేసి తిరుగు ప్రయాణమైన బస్సులో పెద్దెత్తున మంటలు వ్యాపించి దట్టమైన పొగలు రావడంతో చుట్టపక్కల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. దీంతో స్థానికులు వనస్థలిపురం పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి వనస్థలిపురం పోలీసులు చేరుకుని ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. బస్సులో మంటలను ఫైర్ ఇంజన్లతో అదుపులోకి తీసుకొచ్చారు.

## మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

### ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి



**ప్రజాపక్షం/సరూర్‌నగర్:** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. ఆర్‌కెపురం డివిజన్‌లోని వాసవీ ఆధ్యాత్మిక కేంద్రంలో వాసవీ మహిళా మండలి రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్త, ఆర్యవైశ్య కార్పోరేషన్ చైర్మన్ కల్వ సుజాత తో కలిసి ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా మహిళా మండలిని నడిపించడం గొప్ప విషయమన్నారు. దాదాపు 300 సభ్యత్వం గల ఈ మహిళా మండలి ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తున్నారని అభినందించారు. కార్యక్రమంలో కార్పోరేటర్‌లు రాధధీరజ్‌రెడ్డి, రంగా నర్సింహాగుప్త, వాసవికాలనీ అధ్యక్షులు గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, మురుకుంట్ల అరవింద్‌శర్మ, కాలనీ ప్రతినిధి చిలుక మధురా ఉపేందర్‌రెడ్డి, మహిళా మండలి అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, అరుణ, మేఘమాల తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుతంగా పర్వదిన వేడుకలు

### షాద్‌నగర్ ఏసిపి రంగస్వామి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఉగాది, రంజాన్ పర్వదిన వేడుకలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని షాద్ నగర్ ఏసిపి రంగస్వామి కోరారు. మంగళవారం పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్‌లో పట్టణ సిఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శాంతి కమిటి సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఏసిపి రంగస్వామి, మున్సిపల్ కమీషనర్ సునీత, మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి అందె బాబయ్యలతోపాటు వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసిపి రంగస్వామి మాట్లాడుతూ ఈ ఎడాది ఉగాది,రంజాన్ పర్వదిన వేడుకలు ఒకేసారి వస్తున్న నేపథ్యంలో హిందూ, ముస్లీంలు సోదరభావంతో పండుగలను నిర్వహించుకునేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాది చెంది మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మైనార్టీ నేత జమ్రుద్‌ఖాన్, అష్రఫ్, పసుపుల ప్రశాంత్, అసద్ ముక్తార్ అలీ, ముబీన్ గోరీలతోపాటు వివిధ రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

## మత్తుకు దూరంగా ఉంచండి

### రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయవాది శశిధర్‌రెడ్డి




**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** మత్తు పదార్థాలకు దూరంగా ఉంచాలని రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా న్యాయ సేవా సంస్థ, లయన్స్ ఇంటర్‌నేషనల్ వారి ఆధ్వర్యంలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో మాదక ద్రవ్యాల వీద ప్రైవేట్ స్కూల్ విద్యార్థులతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వయస్సులోని పిల్లలు మంచి కన్నా చెడు విషయాలే ఎక్కువ నేర్చుకునే అవకాశం ఉంది. కాబట్టి మంచి చెడులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఇంటర్‌నేషనల్ డైరెక్టర్ బాబురావు, లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గంప నాగేశ్వర్‌రావు, మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ రాజిరెడ్డి, లియో కో ఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి, పాణనీయ విద్యాసంస్థల డైరెక్టర్ వసుధ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి సక్కుబాయి మృతి

### భర్త పరిస్థితి విషమం..ఆసుపత్రికి తరలింపు



**ప్రజాపక్షం/కొత్తూరు:** రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి సక్కుబాయి మృతి చెందారు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం తిమ్మాపూర్ సమీపంలో జాతీయ రహదారి 44పై మంగళవారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కొందుర్గు మండల కేంద్రానికి చెందిన సక్కుబాయి ఉద్యోగ రీత్యా మహేశ్వరం మండలం జిడి తండాలో పంచాయతీ కార్యదర్శిగా సక్కుబాయి (37) విధులు నిర్వహిస్తుంది. పనుల నిమిత్తం ఆమె తన తల్లిగారి ఇంటికి అయిన కొందుర్గుకు వచ్చి తిరిగి హైదారాబాద్‌కు వెళ్తున్న నేపథ్యంలో తిమ్మాపూర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే సక్కుబాయి మృతి చెందగా భర్త పాండు తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. కొత్తూరు నుండి హైదారాబాద్‌కు స్కూటిపై వెళ్తుండగా వెనుక నుండి లారీ, ట్రాక్టర్ వచ్చి ఢీకొనడంతో పంచాయతీ కార్యదర్శి సక్కుబాయి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న పాండు తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు పోలీసులు వివరించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## అర్చక సమాజం అధ్యక్షుడిగా అమర్‌నాథ్

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** షాద్‌నగర్ అర్చక సమాజం అధ్యక్షుడిగా మూలమఠం అమర్‌నాథ్‌ను ఎన్నుకున్నారు. మంగళవారం పట్టణంలోని బంగారు మైసమ్మ దేవాలయంలో వీర మహేశ్వర అర్చక సమాజం ఎన్నికలను నిర్వహించారు. అధ్యక్షుడిగా మూలమట్టం అమర్‌నాథ్ ఎన్నికైయ్యారు. ప్రధాన కార్యదర్శిగా తరణి మఠం కళ్యాణ్‌స్వామి, కోశాధికారిగా మఠం అనంద్‌కుమార్, ఉపాధ్యక్షులుగా మణి ప్రశాంత్ శాస్త్రీ, మదుపతి శివానంద్‌స్వామి, ప్రచార కార్యదర్శిగా సంగయ్యస్వామి, సహాయ కార్యదర్శిగా జంగం సంగమేశ్వర స్వామి, సలహాదారులుగా మటన్ సంతోష్ శాస్త్రీలను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గం మాట్లాడుతూ నమ్మకాన్ని వమ్ము చేయకుండా శక్తి వంచన లేకుండా పని చేయనున్నట్లు వివరించారు.

# అగ్నిప్రమాదాలు, వరద నివారణకు రెండు కమిటీలు

### జిహెచ్‌ఎంసి, హైడ్రా కమిషనర్ల కీలక నిర్ణయం

### ట్రాఫిక్ సమస్యలపై సంయుక్త చర్యలు





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో వరుసగా జరుగుతున్న అగ్నిప్రమాదాలు, వర్షాకాలంలో ఎదురయ్యే వరద ముంపు నివారణకు పరిష్కారించేందుకు జిహెచ్ ఎంసి, హైడ్రా నగరంలో రెండు కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించాయి. వరద ముంపుతో పాటు అగ్ని ప్రమాదాలకు ఆస్కారం లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై కలిసి పనిచేయనున్నాయి. ఈ మేరకు జిహెచ్ ఎంసి ప్రధాన కార్యాలయంలో మంగళవారం అధికారులు, సిబ్బందితో జిహెచ్‌ఎంసి కమిషనర్ డాక్టర్ ఇలంబర్తి, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన చర్యలు, అగ్ని ప్రమాదాల నివారణపై సమీక్షించారు. అగ్ని ప్రమాదాల నివారణకు అగ్నిమాపక శాఖతో పాటు జిహెచ్‌ఎంసి, హైడ్రా విభాగాలతో కలిసి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వర్షాకాలంలో వరద ముంపు నివారణతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూసేందుకు జిహెచ్‌ఎంసి, హైడ్రా, ట్రాఫిక్ అధికారులతో మరో కమిటీని ఏర్పాటు చేయనున్నారు. నగరంలో ఇప్పటికే గుర్తించిన 141 నీటి నిల్వ ప్రాంతాల వద్ద ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఇలంబర్తి సూచించారు. భవిష్యత్తులో నీటి నిల్వ ప్రాంతాలు లేకుండా శాశ్వత పరిష్కారం చేయాలన్నారు. నాలాల్లో పూడికతీత లోతట్టు ప్రాంతాల్లో సమస్యలకు ఆస్కారం లేకుండా పూడికతీత పనులు వర్షాకాలంలోపు పూర్తి చేయాలని సూచించారు.

### వచ్చే వర్షాకాలానికి పటిష్టమైన కార్యాచరణ

రానున్న వర్షాకాలంలో నగరంలో ప్రజల కష్టాలను తొలగించే విధంగా వర్షాకాల కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఇలంబర్తి, సంబంధిత అధికారులకు సూచించారు. వర్షాకాలంలో నగరంలో ఎదురయ్యే పలు సమస్యలపై ఇరువురు చర్చించారు. నగరంలోని చెరువుల సంరక్షణ, పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వర్షాల సందర్భంగా చెరువుల ద్వారా ఓవర్ ఫ్లో కాకుండా ముందస్తు నీటి యజమాన్య పద్ధతులు పాటించాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంత ప్రజలను వర్షాల నేపథ్యంలో ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని, వర్షాకాలంలో నాలాలో ప్రమాదాలు సంభవించకుండా నాలా ఆడిట్ చర్యలు తీసుకోవాలని, అందుకోసం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసేందుకు సర్కిల్‌కు ఒక ప్రత్యేక అధికారిని బాధ్యులను చేయాలని కమిషనర్ సూచించారు.

### అగ్నిప్రమాదాలు నివారించాలి

నగరంలో ఉన్న వాణిజ్య, నివాస భవనాల్లో అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించిన సురక్షిత ప్రమాణాలను కఠినంగా అమలు చేయాలని ఇలంబర్తి అన్నారు. అందులో భాగంగా భవన యజమానులు, నిర్వాహకులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎక్కువగా మంటలు వేగంగా వ్యాపించే వస్తువుల స్టోరేజ్ గోడౌన్ లలో, పురాతన భవనాలలో ప్రమాదాలు సంభవిస్తున్నాయని, అగ్ని ప్రమాదాల నివారణ నిర్వహణ సజావుగా ఉండేలా చర్యలు తీసుకునేలా సంబంధిత యజమానులకు ముందస్తుగా అవగాహన కల్పించాలన్నారు. జిహెచ్‌ఎంసి అధికారులు, హైడ్రా అధికారులు, ఫైర్ సేఫ్టీ అధికారులు సంయుక్తంగా క్షేత్ర స్థాయిలో అవసరమైన నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. నివాసిత అపార్ట్‌మెంట్‌లు, వాణిజ్య భవనాలలో భవన లేఔట్ ప్లాన్, ఫైర్ సేఫ్టీ ప్లాన్, ఫైర్ ఎన్.ఓ.సి తదితర అంశాలను విస్తృత స్థాయిలో తనిఖీ చేసి, ప్రమాదాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో గత రెండేళ్లలో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయన్న అంశాలను పరిశీలించి, ఆ ప్రాంతాల్లో తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ శివకుమార్‌నాయుడు, జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, అపూర్వ్ చౌహాన్, హేమంత్ కేశవ్ పాటిల్, ఎన్.రవికిరణ్, వెంకన్న, చీఫ్ సిటీప్లానర్ కె.శ్రీనివాస్, చీఫ్ ఇంజనీర్లు భాస్కర్‌రెడ్డి, రత్నాకర్, కోటేశ్వర రావు, విజిలెన్స్ అదనపు ఎస్‌పి శ్రీనివాస్, హైడ్రా, అగ్ని ప్రమాద నివారణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## 'జాజుల' జోలికొస్తే ఊరుకోం

### బిసి విద్యార్థి, యువజన సంఘాల నేతల హెచ్చరిక

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** బిసి సమాజాన్ని తాకట్టు పెట్టడం, రాజకీయ పార్టీలలో పదవులు పొందడం ఆర్.కృష్ణయ్యకే చెల్లిందని బిసి విద్యార్థి, యువజన సంఘాల నేతలు విమర్శించారు. మంగళవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బిసి యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యామ్ కుర్మ, విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్, జాజుల లింగంగౌడ్, రావుల కోల్ నరేష్ ప్రజాపతి, బిసి జన సైన్యం రాష్ట్ర అధ్యక్షులు సింగం నగేష్ మీడియాతో వారు మాట్లాడారు.మూడు దశాబ్దాలుగా బిసి వాదంతోటే నిఖార్సిగా పోరాడుతున్న బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌పై ఆర్.కృష్ణయ్య తన అనుచరులను ఉసిగొల్పి అసభ్యపదజాలంతో, వ్యక్తిగతంగా బెదిరింపులకు దిగడాన్ని తీవ్రంగా ఖండించారు. బిసిలకు అధికారమే లక్ష్యంగా పోరాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్ జోలికి ఎవరొచ్చినా బిసి సమాజం తగిన బుద్ధి చెప్తుందని హెచ్చరించారు. సమావేశంలో డాక్టర్ నరసింహ నాయక్, ఈడిగ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.



# మెరుగ్గా స్ట్రీట్ లైటింగ్ నిర్వహణ



జిహెచ్‌ఎంసి కమిషనర్ ఇలంబర్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలోని అన్ని స్ట్రీట్ లైట్ల నిర్వహణను సమర్థవంతంగా చేసేందుకు స్ట్రీట్ లైట్ నిర్వహణ యాప్ కీలకమైనదని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఇలంబర్తి అన్నారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో మంగళవారం జిహెచ్‌ఎంసి పరిధిలోని అన్ని డివిజన్‌ల విద్యుత్ ఇంజనీర్లు, డివిజన్ ఎలక్ట్రీషియన్లు, టి.జి. ఆన్‌లైన్ ఏజెన్సీ ద్వారా స్ట్రీట్ లైటింగ్ నిర్వహణ వ్యవస్థపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిహెచ్‌ఎంసి కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ స్ట్రీట్ లైట్ నిర్వహణ సిస్టమ్ యాప్ ద్వారా విద్యుత్ మీటర్లు, సెంట్రలైజ్డ్ కంట్రోల్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ ప్యానల్స్, లైట్లు, పోల్స్ అన్ని ఆస్తుల వివరాలను నమోదు చేసి, వాటి పనితీరును ట్రాక్ చేయడం జరుగుతుందన్నారు. ఎక్కడైనా వీధి దీపాలు పని చేయకపోతే, సమస్యను తక్షణమే గుర్తించి, వెంటనే పరిష్కరించాలన్నారు. లైట్‌ల మరమ్మతులను వేగంగా చేయడం ద్వారా నగర వాసులకు మెరుగైన సేవలు అందించవచ్చున్నారు. టి.జి ఆన్ లైన్ ఏజెన్సీ ప్రతినిధులు యాప్ వాడకం విధానాన్ని ప్రాక్టికల్ డెమో ద్వారా వివరించారు. స్ట్రీట్ లైట్‌ల ఆడిట్, డేటా ఎంట్రీ, మరమ్మతుల నిర్వహణ అంశాలపై విపులంగా శిక్షణ అందించారు. సమావేశంలో అదనపు కమిషనర్ శివకుమార్ నాయుడు, జిహెచ్‌ఎంసి విద్యుత్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లు, డిప్యూటీ ఇంజనీర్‌లు, అసిస్టెంట్ ఇంజనీర్‌లు, ఎలక్ట్రీషియన్లు పాల్గొన్నారు.

# ఉద్దేశపూర్వకంగానే సమావేశాలకు గైర్హాజర్

### యాజమాన్యంపై టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి నేతల ఆరోపణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సమ్మె నోటీసు ఇచ్చిన నేపథ్యంలో కార్మిక శాఖ ఏర్పాటు చేస్తున్న సమావేశాలకు యాజమాన్యం ఉద్దేశపూర్వకంగా హాజరు కావడం లేదని, వెంటనే సమావేశానికి హాజరై దీర్ఘకాలికంగా కార్మికులు ఎదుర్కుంటున్న సమస్యలు పరిష్కరించాలని టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి డిమాండ్ చేసింది. హైదరాబాద్ అజామాబాద్ పారిశ్రామికవాడలోని టిజిఎస్‌ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో మంగళవారం జెఎసి సమావేశం జరిగింది. సమావేశానికి టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్‌చైర్మన్ ఎం.థామస్‌రెడ్డి, కోకన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక శాఖ కమిషనర్ రెండుసార్లు యజమాన్యం, కార్మిక సంఘాలతో సమావేశం ఏర్పాటు చేశారని, అన్ని కార్మిక సంఘాలు సకాలంలో సమావేశానికి వచ్చినా, యజమాన్యం ఉద్దేశపూర్వంగా హాజరుకాలేదన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలనే ధ్యాస యాజమాన్యానికి లేదని విమర్శించారు. ఈనెల 21వ తేదీన మరోసారి సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపిన కార్మిక శాఖ కమిషనర్ సమావేశాన్ని వాయిదా వేశారన్నారు. గతంలో ఎన్నికల కోడ్ సాకుతో కాలయాపన చేశారని, ప్రస్తుతం శాసనసభ సమావేశాల సాకుతో కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించకుండా దాటవేస్తోందని మండిపడ్డారు. ఈ విధానం సరైనది కాదని, ప్రభుత్వ, యజమాన్య ఒత్తిళ్ళకు తలొగ్గి కార్మిక శాఖ కమిషనర్ వ్యవహరిస్తున్నట్లుందని ఆరోపించారు. సమావేశంలో కార్మిక శాఖ కమిషనర్‌కు డెడ్‌లైన్‌తో కూడిన లేఖను అందచేశారు. అందులో ఏప్రిల్ 1వ తేదీలోపు కన్సిలేషన్ సమావేశం పూర్తి చేయాలని, లేనిపక్షంలో తమ తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పామన్నారు. ఈ కార్యాచరణపై జెఎసి సమావేశంలో 'ఛలో లేబర్ కమిషనర్ ఆఫీస్' పేరిట కార్యక్రమం చేపట్టి, సమ్మె తేదీని ప్రకటించాలని నిర్ణయించినట్లు జెఎసి నాయకులు వెల్లడించారు. ఈ సమావేశంలో జెఎసి కోశాధికారి బి.యాదయ్య, వి.బాబు, కె.ఎస్.పాల్, బి.వెంకటయ్య, ఎం.ఎ.మాజీద్, జి.రాములు, బి.శ్రీనివాస్, డి.రాంచందర్ పాల్గొన్నారు.

## రేషన్‌కార్డులు ఇవ్వకుండా 'యువ వికాసం' ఎలా సాధ్యం ?

### సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రేషన్ కార్డు లేకుండా రాజీవ్ యువవికాసం పథకం ఎలా సాధ్యమవుతుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ ప్రశ్నించారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో మంగవారం జరిగిన పార్టీ సమావేశంలో కాంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సబ్సిడి పథకాలకు రేషన్ కార్డు తప్పనిసరి చేయడం అన్యాయమన్నారు. రేషన్ కార్డు లేకుండా రాజీవ్ యువ వికాసం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ఈ పథకానికి రేషన్ కార్డు నిబంధనను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డులు త్వరితగతిన మంజూరు చేసి, అర్హులైన యువతకు రాజీవ్ యువ వికాసం ద్వారా స్వయం ఉపాధి కల్పించాలని కాంపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.



## ఎంఎంటిఎస్ రైళ్లలో ఆర్‌పిఎఫ్-జిఆర్‌పి పోలీసుల గస్తీ

### దక్షణ మధ్య రైల్వే జిఎం అరుణ్‌కుమార్ జైన్ ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ నగరం, సబర్బన్ రైళ్లలో ప్రయాణించే ప్రయాణికులకు భద్రతను పెంచే దిశగా దక్షణ మధ్య రైల్వే చర్యలు చేపట్టింది. ఎంఎంటిఎస్ రైలులో యువతిపై జరిగిన అత్యాచార యత్నం ఘటన నేపథ్యంలో ప్రయాణికుల భద్రతా చర్యలపై అధికారులు దృష్టి సారించారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ మంగళవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రయాణీకులకు భద్రతను పెంచడంపై ఆయన పలు సూచనలు జారీ చేశారు. రైళ్లలో ముఖ్యంగా మహిళల కంపార్ట్మెంట్లు, ఎమ్ఎమ్‌టిఎస్ రైళ్లలో ఎక్కువ మంది మహిళా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పిఎఫ్), ప్రభుత్వ రైల్వే పోలీస్ (జిఆర్‌పి) సిబ్బందిని మోహరించాలని, ఎమ్ఎమ్‌టిఎస్ రైళ్లలో ముఖ్యంగా అర్ధరాత్రి, తెల్లవారుజామున క్రమం తప్పకుండా గస్తీ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రైల్వే స్టేషన్లలో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ప్రకటనల ద్వారా క్రమం తప్పకుండా అవగాహన ప్రచారాలను చేపట్టడం, రైల్వే ప్రాంగణంలో పోస్టర్లను ప్రదర్శించడం, భద్రతా చర్యలు, హెల్ప్‌లైన్ నంబర్లు, అనుమానాస్పద ప్రవర్తనను గమనించినప్పుడు ఎలా తెలియజేయాలో ప్రయాణీకులకు అవగాహన కల్పించడానికి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో సంబంధిత సమాచారాన్ని పంచుకోవడంపై సూచనలు ఇచ్చారు. మహిళలపై జరిగే నేరాలపై తక్షణ స్పందన, దర్యాప్తు కోసం ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి సిబ్బంది మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయాలన్నారు. సమస్యాత్మక మార్గాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మేరీ సహేలి బృందాలకు ఆదేశాలు జారీ చేశారు.

# గుదిబండగా 'రాజీవ్ యువ వికాసం' నిబంధనలు

### ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షు,కార్యదర్శులు వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర విమర్శ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ యువ వికాస పథకం పేరుతో నిరుద్యోగ యువకులను దగా చేస్తుందని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షు,కార్యదర్శులు వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర విమర్శించారు.హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్ లో జరిగిన సమావేశంలో వారు ప్రభుత్వ తీరును ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాజీవ్ యువ వికాసం పథకంలో రేషన్‌కార్డు నిబంధనను తొలగించాలని వారు రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేసింది. రాజీవ్ యువ వికాస పథకంకు దరఖాస్తు చేసుకోవాలి అంటే రేషన్ కార్డు తప్పనిసరి అని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కానీ ప్రభుత్వం ఏర్పడి నేటి వరకు రేషన్ కార్డులు జారీ చేయలేదని ఆరోపించారు. గత 11 సంవత్సరాలుగా యువకులకు రేషన్ కార్డులో పేరు కూడా లేదని, ఇలాంటి తరుణంలో యువత ఎలా దరఖాస్తులు చేసుకుంటారని వారు ప్రశ్నించారు. ఇప్పుడు దరఖాస్తు చేసుకుంటే చాలా తక్కువ మందికి దరఖాస్తు చేసుకునే అర్హత ఉంటుందని తెలిపారు. రేషన్ కార్డు లేని నిరుద్యోగ యువకుల గురించి ప్రభుత్వం స్పష్టంగా వైఖరి కనబర్చాలన్నారు. రాజీవ్ యువ వికాస పథకం దరఖాస్తులు రేషన్ కార్డులు లేని వారు కూడా దరఖాస్తు చేసుకునేలా ప్రభుత్వం పునరాలోచన చేయాలని వారు డిమాండ్ చేశారు. అదే విధంగా గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో వివిధ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధి దారులు, రాజీవ్ యువ వికాస పథకంకు దరఖాస్తు చేసుకోవడానికి మీ సేవ కేంద్రాలకు వెళ్తే,ఆన్లైన్ దరఖాస్తు ప్రక్రియలో గత ప్రభుత్వంలో దరఖాస్తు మూలంగా రిజెక్ట్ అవుతున్నాయన్నారు.వాస్తవానికి గత ప్రభుత్వం లో సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారికి నేటికీ ఎటువంటి పథకం ద్వారా లబ్ధి చేకూరలేదని వారు అన్నారు. కేవలం పాలకులు మాటల గారడీతో కాలయాపన చేస్తూ నిరుద్యోగులను మోసం చేస్తున్నారన్నారు. కేటాయింపులు వేరు... నిధుల మంజూరు వేరు అనేలా వ్యవహరించిన పాలకుల తీరు సిగ్గు చేటు అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో మన యువత పాత్ర, త్యాగాలు మరువలేనివని, తెలంగాణ సాధించుకున్న తరువాత వారి పట్ల గత ప్రభుత్వం నది దాటే వరకు ఓడ మల్లయ్య, దాటిన తర్వాత బోడ మల్లయ్య అనే విధంగా ప్రవర్తించిందని ఇటీవల బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారని, మరి గత ప్రభుత్వంలా యువతను మోసం చేస్తే కాంగ్రెస్ కు అదే పరిస్థితి వస్తుందని వారు హెచ్చరించారు. కాబట్టి ఇప్పటికైనా రేషన్ కార్డు లేకున్నా రాజీవ్ యువ వికాస్ పథక దరఖాస్తుకు అనుమతించాలని వారు డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమాన్, రాష్ట్ర సమితి సభ్యులు మాజీద్ అలీ ఖాన్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫోకస్

# మహిళ

## చేదు నిజాలు..

- ప్రపంచ వ్యాప్తంగా పురుషులకు అందుబాటులో ఉన్న చట్టపపరమైన హక్కుల్లో మహిళలకు మూడింట రెండు వంతుల కంటే తక్కువగా ఉన్నాయి.
- అత్యధిక దేశాల్లో, పురుషులతో పోలిస్తే మహిళల వేతనం కనీసం 20 శాతం తక్కువ.
- ప్రపంచవ్యాప్తంగా ప్రతి ముగ్గురిలో ఒకరు శారీరక హింస లేదా లైంగిక దాడికి గురవుతున్నారు. ఈ సమస్య వారి కుటుంబ సభ్యులు, సన్నిహిత భాగస్వామి నుంచే ఎక్కువ. భాగస్వామికాని వారు కూడా హింసకు పాల్పడుతున్న ఘటనలు పెరుగుతున్నాయి.
- ఐక్యరాజ్య సమితి నివేదికను అనుసరించి ప్రతి 11 నిమిషాలకు, ఒక మహిళ లేదా బాలిక తన సొంత కుటుంబ సభ్యుల చేతిలోనే ప్రాణాలు కోల్పోతున్నది.



- గర్భం, ప్రసవానికి సంబంధించిన సమస్యలతో ప్రపంచవ్యాప్తంగా ప్రతిరోజూ 800 మంది మహిళలు మరణిస్తున్నారు.
- ప్రపంచవ్యాప్తంగా 40 శాతం మంది మహిళలు గర్భస్రావం చట్టాలపై నిర్బంధం లేదా నిషేధం విధించిన దేశాల్లో నివసిస్తున్నారు.
- ప్రపంచవ్యాప్తంగా 270 మిలియన్ల మంది మహిళలకు ఆధునిక గర్భనిరోధకం అందుబాటులో లేదు.
- గత ఏడాది ప్రతిరోజూ 12,000 కంటే ఎక్కువ మంది బాలికలు స్త్రీ జననేంద్రియ వికృతీకరణకు గురయ్యే ప్రమాదాన్ని ఎదుర్కొన్నారు.
- మహిళలకు ఉద్దేశించిన ప్రణాళికలు, ఆర్థిక సాయాల్లో కేవ లం నాలుగు శాతం మాత్రమే హర్హులకు అందుతున్నాయి.
- లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్యం... హక్కులు (ఎస్‌ఆర్‌హెచ్‌ఆర్) స్త్రీ విముక్తికి, స్థిరమైన అభివృద్ధికి కీలకమైన స్తంభాలు. కానీ, మహిళలకు వారి సొంత శరీరాలపైనే హక్కు లేకపోవడం, లైంగిక దాడులకు గురికావడం, బలవంతంగా పునరుత్పత్తికి సంబంధించిన నిర్ణయాలను అమలు చేయడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. హక్కులు ఎండమావులవుతున్నాయి.
- గత రెండు దశాబ్దాలుగా సాధించిన పురోగతి ఉన్నప్పటికీ, అనేక దేశాలలో ఇప్పటికీ చట్టవిరుద్ధమైన లేదా పరిమితం చేయబడిన గర్భస్రావం హక్కు లేదు. చాలా దేశాల్లో అబార్షన్ అనేది అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నది.
- ప్రపంచంలోని 77 దేశాల్లో అబార్షన్ చట్టబద్ధమైనప్పటికీ, 112 దేశాలలో ఇది చట్టవిరుద్ధం లేదా నిర్బంధ నిబంధనలకు లోబడి ఉంది. పునరుత్పత్తి వయస్సు గల 753 మిలియన్ల మంది మహిళలు నిర్బంధ గర్భస్రావం చట్టం ఉన్న దేశాల్లో నివసిస్తున్నారు.
- అబార్షన్ యాక్సెస్ చుట్టూ ఉన్న పరిమితులు మహిళల జీవితాలకు అపాయం కలిగిస్తాయి. వారి మరణానికి కూడా దారితీయవచ్చు. అసురక్షిత అబార్షన్ల ఫలితంగా ప్రతి సంవత్సరం 39,000 మంది మహిళలు మరణిస్తున్నారు.
- లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్య సేవలకు మహిళలు, బాలికలను నిరోధించడం అనే దుస్థితి అబార్షన్ హక్కు చట్టబద్ధం చేసిన దేశాల్లోనూ కొనసాగడం దురదృష్టకరం.
- ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీలలో 8 శాతం మంది మాత్రమే గర్భస్రావం హక్కును రాజ్యాంగబద్ధం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నారు. 67 శాతం మంది అనుకూలంగా స్పందిస్తున్నారు.
- ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) ప్రకారం, తక్కువ, మధ్యఆదాయ దేశాలలో నివసిస్తున్న 74 మిలియన్ల మంది మహిళలు గర్భంపై ఎలాంటి అవగాహన లేకుండానే తల్లులవుతున్నారు. 25 మిలియన్ల మంది అబార్షన్లు అసురక్షిత పరిస్థితులలో జరుగుతున్నాయి. ఇవి కనీసం 39,000 మరణాలకు కారణమవుతున్నాయి.

# పుట్టబోయే బిడ్డనూ హత్య చేస్తున్నాం!

పుట్టిన బిడ్డతో పోల్చితే తల్లి గర్భంలో పురుడు పోసుకున్న బిడ్డకు సమాన హక్కులు ఉండవు. తల్లితండ్రుల ఇష్టాయిష్టాలు బట్టి గర్భంలో దాగిన శిశువు జీవితం ఆధారపడి వుంటుంది. మూడు, నాలుగు నెలల గర్భవతి పలు కారణాలతో అబార్షన్ చేయించుకోవడం చూస్తున్నాం. తల్లి గర్భంలో మొలిచిన 3 లేదా 4 మాసాల చిరు ప్రాణం అమ్మాయిని తెలిసి తల్లితండ్రులు బలవంతంగా అబార్షన్ చేయించుకోవడం అనే అమానవీయ సంఘటనలను మనం నిత్యం చూస్తున్నాం. పోప్ జాన్ పాల్2 ఆలోచనల పర్యవసానంగా 1999 నుంచి ప్రతి ఏట 25 మార్చి రోజున అంతర్జాతీయ పుట్టబోయే బిడ్డ దినం లేదా ఇంటర్నేషనల్ అన్‌బార్న్ చైల్డ్ పాటించుట ఆనవాయితీగా మారింది. తల్లి గర్భంలో కోటి ఆశలతో జన్మించనున్న బిడ్డను తొలి మొగ్గ దశలోనే శిశువును బలవంతంగా అబార్షన్ పేరుతో చంపి వేయడం అమానుషం, ఘోర పాపం. క్రీస్తు జన్మించిన 25 డిసెంబర్ కన్న 9 నెలల ముందు 25 మార్చిన ఈ వేడుకలను నిర్వహించడం సముచితంగా ఉన్నది. తల్లి గర్భంలో ఉన్న 34 మాసాల పసి గుడ్డును పలు కారణాలతో ఆదిలోనే అబార్షన్ రూపంలో తుంచి వేయడం అనే దుర్మార్గ ఆచారం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడానికి 25 మార్చిన ఈ వేదిక ఉపయోగపడుతున్నది. పిల్లలు ఇప్పుడే వద్దని, ఆర్థిక ఇబ్బందులు వస్తాయని, తల్లి ఆరోగ్యం బాగాలేదని, పలు లోపాలున్న శిశువు జన్మించవచ్చని, ఆడ బిడ్డ అని తెలుసుకొని, సామాజిక ఆర్థిక సమస్యలు, మహిళలపై గృహ హింసలు, ఆడవారికి స్వేచ్ఛ లేకపోవడం, మగ పిల్లాడిపై ప్రేమ, కుటుంబ నియంత్రణతో చిన్న కుటుంబాల భావనలు పెరగడం లాంటి పలు కారణాలతో తల్లులు అబార్షన్ చేయించుకోవడం చూస్తున్నాం. వీటిలో ఆడ బిడ్డ గర్భంలో ఉందని తెలిసి, అమ్మాయి రేపటి బరువు అని తలచి, వరకట్నం ఇవ్వవలసి ఉంటుందని తెలిసి తల్లిదండ్రులు అబార్షన్ వరకు వెళ్లడం సోచనీయం. భారత్‌లో ఏటా దాదాపు 15.6 మిలియన్ల అబార్షన్లు జరుగుతున్నాయని, ప్రతి వెయ్యి మంది తల్లుల్లో 48 మంది అబార్షన్ చేయించుకుంటున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. వీటిలో దాదాపు 75 శాతం ఆడ శిశువు అని తెలిసి జరుగుతున్నట్లు అర్థం అవుతున్నది. 20002019 మధ్య కాలంలో భారత్‌లో కనీసం 9 మిలియన్ల ఆడ శిశువు అబార్షన్లు జరిగినట్లు తెలుస్తున్నది. సాధారణంగా సహజ ప్రకృతి నియమాల ప్రకారం ప్రతి 100 మంది ఆడ శిశువులకు 103107 వరకు మగ శిశువులు జన్మించడం గమనించారు. భారత్‌లో లైంగిక నిష్పత్తి మహారాష్ట్రలో 100 మంది ఆడ శిశువులకు 118 మగ శిశువులు, హర్యానాలో 120, జె అండ్ కెలో 116 మంది మగ శిశువులు జన్మించడం జరిగింది. ఆడ శిశువును గర్భంలోనే చంపేస్తున్నారని తెలుసుకున్న భారత ప్రభుత్వం ఆసుపత్రుల్లో లింగ నిర్ధారణ పరీక్షలను నిషేధించినప్పటికీ వైద్యుల నీచ బుద్ధులు, తల్లితండ్రుల అనాలోచిత నిర్ణయాలతో ఆడ బిడ్డలు పుట్టక ముందే తల్లి గర్భంలో చనిపోవడం బాధాకరం. అలాంటి అమానవీయ ఆలోచనలకు స్వస్తి పలికి ఆడ బిడ్డని శిశువుతో సమానంగా కనడం, పెంచడం చేసిన యెడల లిమగ సమానత్వం సాధించడం సులభం అవుతుంది. అలాంటి లింగ ఆధారిత అబార్షన్ వ్యవస్థలను అదుపు చేసి ఇద్దరూ సమానమే అనబడే దివ్య భావనలకు పట్టం కడదాం, అష్టలక్ష్ముల దీవెనలతో ఆడ బిడ్డలను అపురూపంగా చూసుకుందాం, భ్రూణ హత్యలను నివారిద్దాం.



# మహిళా సాధికారతకు సవాళ్లు ఎన్నో



ఎన్ని అంతర్జాతీయ సమావేశాలు, సదస్సులు జరిగినా... ఎన్ని తీర్మానాలు ఆమోదించినా... ఎన్ని నిర్ణయాలు తీసుకున్నా.. మహిళా సాధికారత అందని ద్రాక్షగానే మారింది. ఎన్నో అడ్డంకులు... మరెన్నో సవాళ్ల ఎదుర్కొంటున్నది. సాధికారతకు ప్రధాన రూపంగా రాజకీయ ప్రాధాన్యతను చెప్పుకోవాలి. కానీ, పార్లమెంటరీ సీట్లలో 27 శాతం, స్థానిక ప్రభుత్వ పదవులలో 36 శాతం, నిర్వహణ వ్యవస్థలో 28 శాతం మాత్రమే మహిళలు ఉన్నారు. ఈ తక్కువ ప్రాతినిధ్యం వల్ల సమ్మిళిత విధాన రూపకల్పనకు ఆటంకం కలుగుతుంది. ప్రపంచంలో 88 శాతం దేశాలు మహిళలపై హింసను నిరోధించే చట్టాలను అమలు చేస్తున్నాయి. కానీ, మహిళలపై అత్యాచారాలు ఆగడం లేదు. హింసకు తెరపడడం లేదు. 2022 నుంచి లైంగిక హింసకు సంబంధించిన సంఘర్షణ కేసులు 50 శాతం పెరిగాయి. బాధితుల్లో 95 శాతం మహిళలు, బాలికలే కావడం ఆందోళనకరం. పని ప్రదేశాల్లోనూ వివక్ష కొనసాగుతున్నది. ప్రధాన శ్రామిక వయస్సును పరిగణలోకి తీసుకుంటే, 91 శాతం మంది పురుషులతో పోలిస్తే, 61 శాతం మంది మహిళలు మాత్రమే పనిచేస్తున్నారు. పురుషులు పొందుతున్న ఆదాయంతో పోలిస్తే, మహిళలకు దక్కుతున్న ఆదాయం కేవలం 51 శాతం మాత్రమే. చేసే పని దాదాపు ఒకటే అయినప్పటికీ, స్త్రీపురుషుల మధ్య జీతభత్యాలు, చెల్లింపుల విషయంలోనే తీవ్ర అసమానతలు కొనసాగుతున్నాయని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. వేతనం లేని పనులను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించుకోవాలి. ఇలాంటి పనుల్లో పురుషుల కంటే మహిళలు రోజుకు 2.3 రెట్లు ఎక్కువ సమయం పని చేస్తున్నారు. ఈ పనులకుగాను వీరికి వేతనం ఏమీ లభించదు. 2050 నాటికి, వారు వెచ్చించే సమయం 9.5 శాతం ఎక్కువగా ఉంటుందని అంతర్జాతీయ నివేదికలు హెచ్చరిస్తున్నాయి. దీనివల్ల మహిళల విద్య, ఉద్యోగ అవకాశాలు పరిమితమవుతాయి. 2030 నాటికి 110 మిలియన్ల మంది బాలికలు లేదా యువతులు పాఠశాలకు దూరంగా ఉండవచ్చని అంచనా. అదే విధంగా, అప్పటికి 24 శాతం మంది మహిళలు లేదా బాలికలు ఆహార అభద్రతను ఎదుర్కొంటారు. 44 శాతం దేశాలు మాత్రమే విద్య, శిక్షణను మెరుగుపరుచుకుంటున్నాయి. మహిళల సాధికారతకు సవాళ్లు విసురుతున్న మరో అంశం చట్టపరమైన అంశాలు. ప్రపంచ వ్యాప్తంగా 28 దేశాలలో, వివాహం, విడాకుల విషయంలో మహిళలకు సమాన హక్కులు లేవు. 67 దేశాలకు లింగ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా చట్టపరమైన రక్షణలు కూడా లేవని ఐక్యరాజ్య సమితి మహిళా నివేదిక పేర్కొంటున్నది. మహిళల సాధికారత పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే, వారి విద్య, ఆరోగ్యం, ఆర్థిక, సామాజిక భద్రతకు నిధులను పెంచాలి. జవాబుదారీతనం , ప్రభావాన్ని నిర్ధారించడానికి పర్యవేక్షణను బలోపేతం చేయాలి. చట్టపరమైన రక్షణను పటిష్టంగా అమలు చేయాలి. వివాహం, విడాకులు, ఆస్తి, శ్రమపై వివక్షతో కూడిన చట్టాలను తొలగించి, లింగ హింస చట్టాలు అమలు చేయాలి. బాధితులకు మద్దతునిచ్చేందుకు వన్ స్టాప్ సెంటర్లను సమర్థంగా నిర్వహించాలి. ఆహార భద్రత కోసం మహిళా రైతులకు భూమి, రుణాలు, వనరులపై సమాన హక్కు లేదా వాటా ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఆర్థిక అక్షరాస్యత, రుణాలు, మార్కెటింగ్ అవకాశాలు కల్పించి, స్వయం సహాయక సంఘాలు, మహిళా వ్యవస్థాపకులకు మద్దతు ఇవ్వాలి. పని ప్రదేశాల్లో అసమానతలను తగ్గించాలి. మహిళా శ్రమశక్తి భాగస్వామ్యాన్ని పెంచడానికి సౌకర్యవంతమైన పని ఏర్పా ట్లు, తల్లిదండ్రుల సెలవులు, పనిప్రదేశ పిల్లల సంరక్షణను ప్రోత్సహించాలి. క్రియాశీలకమైన కార్యాచణను పక్కకుపెట్టి, కేవలం కాగితాలకే పరిమితమయ్యే తీర్మానాలు ఎన్ని చేసినా ఏం ప్రయోజనం? వాటి వల్ల ఎవరికి ఉపయోగం?

---

## బోయిని కుటుంబానికి సిపిఐ నేత చాడ పరామర్శ



**ప్రజాపక్షం/చిగురుమామిడి :** సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యవర్గ సభ్యుడు బోయిని అశోక్ మాతృమూర్తి బోయిని చిలకమ్మ ఇటీవల మృతిచెందింది. మంగళవారం సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్‌లు, అశోక్‌తో కలిసి చిగురుమామిడి మండలం రేకొండ గ్రామంలో అశోక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిలకమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సందర్బంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ చిలుకమ్మ కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలుగా పార్టీ కోసం పనిచేసిందన్నారు. గ్రామంలో ఏ ఎన్నికలు జరిగినా కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసేదని, తాను మొదటిసారిగా సర్పంచ్‌గా ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు చిలుకమ్మతో పాటు ఆమె భర్త వీరయ్య తనకు అండదండగా నిలిచాడని గుర్తు చేశారు. చిలకమ్మ కుమారులైన అశోక్, పటేల్ ఇద్దరూ సిపిఐలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారన్నారు. చిలకమ్మ ఆమె అనారోగ్యంతో మృతి చెందడం అత్యంత బాధాకరమని, పార్టీ వారి కుటుంబానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల కార్యదర్శులు తాండ్ర సదానందం, రామడుగు లక్ష్మ ణ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మేకల దాసు, గడిపె మల్లేష్, కసిరెడ్డి మణికంఠ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, జాగీరు సత్యనారాయణ, గూడెం లక్ష్మి , మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు ముద్రకోల రాజయ్య, బూడిద సదాశివ, నాయకులు తేరాల సత్యనారాయణ తదితరులున్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య వినతి



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో జిల్లా డిప్యూటీ లేబర్ కమీషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతి పత్రం శ్రావణ్‌కు అందజేసి ధర్నానుద్దేశించి ఓమయ్య మాట్లాడారు. కార్మిక శాఖలో నెలల తరబడి పేరుకుపోయిన డెలివరీ, మ్యారేజీ డెత్‌లకు సంబంధించి క్రైమ్‌ల సమస్యలను పరిష్కరించి భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. సహజ మరణం ప్రమాదవశాత్తు మరణాలకు సంబంధించి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లను ఆయా మండలా తహసీల్దార్లు మీ సేవలో ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్లు ఇవ్వటం లేదని మ్యాన్యువల్‌గా పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. డెలివరీ మ్యారేజ్ డెత్‌లకు సంబంధించిన వారికి లేబర్ కార్డు రిజిస్ట్రేషన్ రసీదు, రెన్యువల్ రసీదులు తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో విఠల్‌గౌడ్, గంగాధర్, వీరేశం, హన్మాండ్లు, నారాయణ, నగేష్, శ్రీనివాస్, గంగాధర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## ఆరునెలల పెండింగ్ వేతనాల కోసం
# ఆస్పత్రి కార్మికుల మెరుపుసమ్మె

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి సురేష్ డిమాండ్





**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ ప్రతినిధి :** మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) ఆధ్వర్యంలో జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ సూపర్వైజర్ కార్మికులు ఐదు నెలల పెండింగ్ వేతన బకాయిలు చెల్లింపుల్లో ఏజెన్సీ, వైద్య అధికారుల అలసత్వ కాలయాపన తీరును నిరసిస్తూ సోమవారం మెరుపు సమ్మెకు దిగి ఆసుపత్రి ఎదుట బైఠాయించారు. ఈసందర్భంగా మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలల వేతన బకాయిలను విడుదల చేసి 45రోజులు గడుస్తున్నా జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, సూపర్వైజర్ కార్మికులకు వేతనాలు అందలేదన్నారు. సంబంధిత ఏజెన్సీ కాంట్రాక్టర్, ఆసుపత్రి సూపరిండెంట్ నిర్లక్ష్యం, అలసత్వంతో కార్మికులకు పెండింగ్ జీతాలు అంద డం లేదని సురేష్ ఆరోపించారు. ఆసుపత్రి ఆర్ఎంఒ డాక్టర్.హరినాథ్ కార్మికులతో యూనియన్ నాయకులతో మాట్లాడుతూ ఆస్పత్రి సూపరిండెంట్ సమక్షంలో ఏజెన్సీ కార్మికులతో చర్చలు జరిపి కార్మికులకు వేతనాలు అందే విధంగా కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ తెలంగాణ వైద్య విధన పరిషత్ పరిధిలోని జిల్లా ఏరియా సామాజిక ఆరోగ్య కేంద్రాలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, సూపర్వైజర్ కార్మికులకు గత సంవత్సరం జూలై నుండి జనవరి వరకు వేతన బడ్జెట్ లేకపోతే కార్మికులు దశలవారీగా వివిధ రూపాలలో విజ్ఞాపన పత్రాలు, దశలవారీగా వివిధ రూపాలలో ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం జులై నుండి డిసెంబర్ వరకు దాదాపు 6 నెలల పెండింగ్ వేతనాల బడ్జెట్‌ను ఫిబ్రవరి 18 న విడుదల చేసి తక్షణమే కార్మికులకు అందించాలని ఆదేశాలు ఇచ్చిన జడ్చర్ల ఏరియా ఆసుపత్రి కార్మికులకు మాత్రం నేటికీ ఒక్క పైసా కూడా జీతం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ కాంట్రాక్టర్‌ను వేతనాలు చెల్లించమని అడుగుతే బిల్లులు చెయ్యలేదని సమాధానాలు చెబుతున్నారని. ఆసుపత్రి సూపరిండెంట్ డిసిహెచ్ఎస్‌ని అనేక పర్యాయాలు వేతనాలు చెల్లించమని విజ్ఞప్తులు చేసిన కారణా లు చెబుతున్నారన్నారు. దీనిపై ఉన్నతాధికాలు జోక్యం చేసుకొని ఏజెనీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఆయ డిమాండ్ చేశారు. కార్మికులను జీతాలు చెల్లించకుండా వేధింపులకు గురి చేయడం తగదన్నారు. తక్షణమే ఐదు నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కార్మికులు నరసింహ, నాగరాజ్, నవీన్, రాజేష్, పేర్మల, రామకృష్ణ, విజయలక్ష్మి, మన్నెమ్మ, అలివేల, సుక్కమ్మ, భార్గవి, అంజమ్మ, నీరజ, లక్ష్మి నరసమ్మ, మంగ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద మహిళలకు
# డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు

మహిళా సమాఖ్య రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అరుణ, ఫైమిద డిమాండ్

**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** అర్హులైన నిరుపేదలకు డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లను వెంటనే కేటాయించి ఇవ్వాలని భారత జాతీయ మహిళా సమాఖ్య రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు అరుణ, కార్యధర్శులు ఫైమిద అన్నారు. మంగళవారం సరూర్‌నగర్ మండల పరిధిలో ఉన్న నిరుపేదలకు డబుల్ బెడ్ ఇండ్లను తక్షణమే ఇవ్వాలని మండల మహిళా సమాఖ్య కమల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అరుణతో కలిసి ఫైమిద ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా మండల కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ రాంబాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫైమీద మాట్లాడుతూ ఇండ్లులేని వాళ్ళు గతంలో డబుల్‌బెడ్ ఇండ్లు కావాలని ధరఖాస్తులు పెట్టుకున్నారన్నారు. ఇంటింటికి సర్వే పేరుతో వెళ్ళి ఇళ్లు వస్తుందని ఎంతో మందికి ఆశ పెట్టడంతో ఎదరుచూస్తున్నారన్నారు. మళ్లీ అధికారులు ఎప్పుడు వస్తారు ఎలా తెలుస్తుందని ప్రజలు అయోమయంలో ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు ఆశచూపకుండా తక్షణమే కేటాయించి అన్నారు. లేనిఎడల పెద్ద ఎత్తున్న ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల నాయకులు బి.విజయ, షమీం, దేవి, సుమలత తదితరులు పాల్గొన్నారు.



## భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు

ఎఐటియుసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్ రెడ్డి డిమాండ్



**ప్రజాపక్షం/భువనగిరి :** భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పరిరక్షణ కోసం ఈ నెల 28వ తేదీన ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (ఎఐటియుసి అనుబంధం) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం భువనగిరిలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం దాసరి లక్ష్మ య్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి దేవేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డు ఈరోజు సమస్యల నిలయముగా మారిందని ఆరోపించారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఏఐటియుసి నిరంతరం అండగా నిలిచి పోరాడుతుందని అన్నారు. గత కొన్ని నెలలుగా కార్మికులకు డబ్బులు ఇవ్వడం లేదని ఆన్లైన్లో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పరిష్కరించడంలో లేబర్ డిపార్ట్మెంట్ వైఫల్యం చెందిందని ఆరోపించారు. కార్మిక శాఖలో నెలల తరబడి పేరుకుపోయిన డెలివరీ, మ్యారేజీ డెత్‌లకు సంబంధించి క్రైమ్‌ల సమస్యలను పరిష్కరించి భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షుడు బోలగాని సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్, సహాయ కార్యదర్శి బీరకాయల మల్లేష్, కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, నాయకులు చేరాల లింగయ్య, కొల్లూరి మల్లేష్, దుబ్బాక సంజీవ, జహంగీర్, బాలరాజు, సందయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతీ జర్నలిస్టుకు ఇంటి స్థలం

సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

**ప్రజాపక్షం/భద్రాచలం :** అర్హులైన ప్రతీ జర్నలిస్టుకు ఇళ్ల స్థలాల మంజూరుకు ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు కృషి చేస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా అన్నారు. ఇండ్ల స్థాలాలను మంజూరు చేయాలని కోరుతూ పాత కలెక్టరేట్ కార్యాయం సమీపంలో జర్నలిస్టులు చేపట్టిన వంటా వార్పు నిరసన శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ జర్నలిస్టుగా పనిచేసిన కూనంనేనికి జర్నలిస్టుల ఇబ్బందులు ఏంటో తెలుసని, గతంలో ఎంఎల్ఏగా ఉన్నప్పుడు కూడా ఇండ్ల స్థలాలు కేటాయించారని చెప్పారు. ఇప్పటికే స్థలాన్ని గుర్తించడం జరిగిందన్నారు. స్థలాల కేటాయింపులో సాంకేతిక సమస్య ఉంటే ప్రతినిధి బృందంగా ఎమ్మెల్యే కూనంనేని నేతృత్వంలో రాష్ట్ర పెద్దలను కలిసి పరిష్కరించుకుందామన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు దుర్గరాశి వెంకటేశ్వర్లు, వాసిరెడ్డి మురళీ, కంచర్ల జమలయ్య, గెద్దాడి నగేష్, మునిగడప వెంకటేశ్వర్లు, భూక్యా శ్రీనివాస్, పట్టణ నాయకులు మాచర్ల శ్రీనివాస్, కె ధర్మరాజు, యూసఫ్, నేరెళ్ల శ్రీనివాస్, బోయిన విజయ్, పి సత్యనారాయణ, దుర్గ, సియాద్రి నాగేశ్వరరావు, అజీజ్‌తో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.






# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## ఏప్రిల్‌లో ఎస్ఎ-2 పరీక్షలు ప్రారంభం



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి:** నాగర్‌కర్నూల్ జిల్లాలో 1వ తరగతి నుండి 9వతరగతుల విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్2 పరీక్షలు ఏప్రిల్ 9నుండి 17వరకు నిర్వహించబడుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రమేష్‌కుమార్ మంగళవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం ఒకటినుంచి తొమ్మిది తరగతి విద్యార్థులకు సమ్మేటివ్ 2పరీక్షలు నిర్వహించేలా రాష్ట్ర విద్యాశాఖ సంచాలకుల ఉత్వర్వులప్రకారం ఈనెల 26నుండి మండలాల మండల వనరుల కేంద్రాల్లో ఆయా మండలాల్లోని అన్ని యాజమాన్య పాఠశాలలు ఎస్ఎ2 ప్రశ్న పత్రాలను తీసుకోవాలని సూచించారు. పరీక్షల అనంతరం జవాబు పత్రాలను కూడా వెంటనే మూల్యాంకనం చేసి, ఏప్రిల్ 23న ఫలితాలు వెల్లడించాలని, అనంతరం తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటుచేసి, ప్రొగ్రెస్‌కార్డులు అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## విద్యుత్ కోతలతో ఆగ్రహించిన అన్నదాతలు

**ప్రజాపక్షం/పెబ్బేరు:** పెబ్బేరు మండల పరిధిలోని గుమ్మడం గ్రామంలో ఉన్న 33/11 కెవి సబ్ స్టేషన్ లో ఉన్న పవర్ ట్రాన్స్ఫర్మర్ మరమ్మతులకు గురి కావడంతో మూడు రోజుల నుండి వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేయడంలో అంతరాయం కలిగింది. దీంతో తమ పంటలు ఎండిపోతున్నాయని గుమ్మడం తిప్పాయిపల్లి గ్రామానికి చెందిన రైతులు గుమ్మడం సబ్ స్టేషన్ దగ్గర ధర్నా నిర్వహించారు. యుద్ధ ప్రాతిపదికన ట్రాన్స్ఫార్మర్ మరమ్మత చేసి నిరంతర విద్యుత్ సరఫరా ఇవ్వాలని, ఇప్పటికే తమ పంటలు ఎండిపోయాయని వారు నినాదాలతో ధర్నా నిర్వహించారు. విద్యుత్ సరఫరా విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే మెగారెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లగా మెగారెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లగా విద్యుత్ ఉన్నతాధికారులతో మాట్లాడి రెండు రోజులలో సమస్యలను పరిష్కరిస్తామని రైతులకు హామీనిచ్చారు. దీంతో రైతుల ధర్నా విరమించి వ్యవసాయానికి సరఫరా ఇవ్వాలని ఎండిపోయిన వరి కర్రలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొండారెడ్డి, తొండ బలరాముడు, జగదీశ్వర్ రెడ్డి, ఎల్. రవికుమార్ రెడ్డి, నేతుల రాజు, దామోదర్ రెడ్డి, ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వాయర్ నిర్వాసితులకు అన్ని రకాల సౌకర్యాల కల్పన

ఆర్&ఆర్ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధి:** ఉదండపూర్ రిజర్వాయర్ నిర్వాసిత కుటుంబాలకు కేటాయించిన ఆర్&ఆర్ కాలనీలలో అన్ని రకాల మౌలిక సౌకర్యాలు వేగవంతం చేయాలని ఆర్&ఆర్ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో ఆర్&ఆర్ కమిషనర్ టి.వినయ్ కృష్ణా రెడ్డి , జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తో కలిసి రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆర్&ఆర్ పనులు సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉదండపూర్ రిజర్వాయర్ కింద వల్లూరు, ఉదండపూర్, తుమ్మల కుంట తండా, రేగడి పట్టి తండా, చిన్నగుట్ట తండా, శామ గడ్డ తండా, ఒకటి గుడిసె తండా, పోలేపల్లి వ్యవసాయ క్షేత్రంలో ఇండ్లు, కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు అవార్డు అందుకున్న వారందరికీ పునరావాసం కింద మూడు వందల గజాల స్థలం, వారి అవసరాలకు ప్రైమరీ హెల్త్ సెంటర్, పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు, వెటర్నరీ హాస్పిటర్, కమ్యూటికీ హాల్స్, పార్కులను ఏర్పాటు పనులు నిర్దేశించిన సమయం లోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ వాటర్ పైపులైన్లు ఇచ్చిన గడువులోగా త్వరితరగతిన పూర్తి అయ్యేలా చూడాలని అన్నారు. ఇంజినీరింగ్ అధికారులు పనుల నిర్వహణలో అలసత్వం వహించ రాదని అన్నారు. జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆర్&ఆర్ కింద తీసుకున్న చర్యలు వివరించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, స్పెషల్ కలెక్టర్ (ఎల్.ఎ) మధుసూదన్ నాయక్, ఆర్డీవో నవీన్, ఇరిగేషన్, మిషన్ భగీరథ, సర్వే లాండ్ రికార్డు, పంచాయతీరాజ్ అధికారులు, అధికారులు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత



**ప్రజాపక్షం/వెల్దండ:** మండలపరిధిలోని వివిధ గ్రామాలకుచెందిన మహిళా లబ్దిదారులకు రాష్ట్రప్రభుత్వం అందజేస్తున్న కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ చెక్కులను కల్వకుర్తి ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి చేతులమీదుగా 62మంది లబ్దిదారులకు చెక్కులను అందజేయనున్నట్లు తహసీల్దార్ కార్తీక్‌కుమార్ మంగళవారం పేర్కొన్నారు. ఈకార్యక్రమానికి అన్నిగ్రామాల ప్రజాప్రతినిధులు, సంబంధిత లబ్దిదారులు విధిగా హాజరుకావాలని కోరారు.

## ఆంజనేయస్వామి మాల మహాపడి పూజ కార్యక్రమం



**ప్రజాపక్షం/ఊర్కొండ:** నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ఊర్కొండపేటలో శ్రీఆంజనేయస్వామి దేవాలయం మాలాధారణ భక్తుల మహాపడి పూజ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి పెద్దూరి రామాంజనేయులుగౌడ్ స్వగృహంలో నిర్వహించిన మహాపడిపూజ మహోత్సవం గురుస్వామి దేవాలయ అర్చకులు దత్తాత్రేయశర్మ ఆధ్వర్యంలోఅంగరంగవైభవంగా నిర్వహించారు. స్వామియేశరణం ఆంజనేయశరణం ఆంజనేయస్వామి శరణం అంటూ స్వామి నామస్మరణతో మార్మోగింది. ఈమహాపడిపూజ మహోత్సవానికి పెద్ద ఎత్తున ఆంజనేయస్వాములు, భక్తులు పాల్గొని ఆంజనేయనామస్మరణ భజనపాటలు, భక్తిగీతాలను ఆలపించారు. కార్యక్రమంలో జిల్లానాయకులు లక్ష్మారెడ్డి, బిజెపినాయకులు శ్రీను, అంజిరెడ్డి, బాలస్వామి,ఆంజనేయస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

## జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/ బిజినేపలి:** 25 నాగర్ కర్నూలు జిల్లా లోని బిజినేపల్లి మండలం లో గల శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాలెం లో ఈ నెల 27 వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు ఒక ప్రముఖ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతులకు జాబ్ మేళా నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ॥ పి. రాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాను జిల్లాలోని 33 సంవత్సరాల లోపు వయస్సు కలగి ఉండి పదవ తరగతి, ఇంటర్,డిగ్రీ, డిప్లోమా లేదా ఐటిఐ విద్యార్హతల గల నిరుద్యోగ యువతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎంపికైన వారందరికీ 26 రోజులు పాటు హైదరాబాద్ లో ఐఫోన్ పరికరాల తయారీ పై ట్రేయినింగ్ ఇస్తూ 15 వేలు జీతంతో పాటు ఉచిత రవాణా భోజనం సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేలలో అధిక సంఖ్యలో నిరుద్యోగ యువతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించారా?

మహమ్మదాబాద్ మండలంలో మధ్యాహ్న భోజనం పరిశీలన
మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి ఆగ్రహం





**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం కూరగాయలు, భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. మంగళవారం మహ్మదాబాద్ మండలంలో కలెక్టర్ పర్యటించారు. మండలంలో నంచర్లలో ప్రభుత్వ జడ్పి ఉన్నత పాఠశాల తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు వండిన మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించకపోవడంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు, ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం ఆకుకూరలు, కాయగూరలు, గుడ్డు అందించాలని ఆదేశించారు. పాఠశాలలో ఎఫ్ఎల్ ఎన్ఏఐ ఆధారిత కంప్యూటర్ సిస్టం, ల్యాబ్ పరిశీలించారు. ఎఫ్ఎల్ఎన్ఏఐ ఆధారిత కంప్యూటర్ సిస్టం ద్వారా మహమ్మదాబాద్ మండలంలో నంచర్ల, గాధిర్యాల లోని పాఠశాలల్లో రెండు చోట్ల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వెనుకబడిన విద్యార్థులకు ఎఫ్ఎల్ఎన్ఏఐ ఆధారిత కంప్యూటర్ సిస్టం ద్వారా బోధన చేసి వారి ప్రగతి పరిశీలించాలని అన్నారు. 9వ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలల్లో బోధన, సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తమ లక్ష్యం మేరకు చదివి మంచి ఫలితాలు సాధించాలని అన్నారు.

**త్రాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి**

మహమ్మదాబాద్ తాహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, మిషన్ భగీరథ, ఇరిగేషన్ , వ్యవసాయ శాఖ అధికారులతో త్రాగునీరు సరఫరా, సాగునీరు, పంటల సాగు పై సమీక్షించారు. సంగాయ పల్లి, ధర్మాపూర్ గ్రామాల్లో త్రాగునీరు సరిపడా సరఫరాలో సమస్య ఉన్నట్లు తెలిపారు. త్రాగునీటి సమస్యను పరిష్కరించేందుకు వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని ఆమె ఆదేశించారు. మండలంలో పంటల సాగు, వరి పంటపై సమీక్షించారు. బోరు బావుల నీటి సాగుతో వేసిన వరి పంట భూ గర్భజలాలు ఇంకి సుమారు 140 ఎకరాల్లో ఎండినట్లు అధికారులు తెలిపారు. వ్యవసాయ అధికారులు రైతులకు సరైన సలహాలు అందించి అవగాహన కలిగించాలని అన్నారు. అక్కడే పక్కనే ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి కావచ్చి రెండవ తరగతికి కావాల్సిన వసతి గురించి కలెక్టర్‌కు వివరించారు. రెండవ సంవత్సరం తరగతుల నిర్వహణ తాహసీల్దార్ కార్యాలయంలో తాత్కాలికంగా నిర్వహించి తాహసీల్దార్ కార్యాలయంను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు తరలించేందుకు అధికారులతో చర్చించారు. పాఠశాలకు తరలించి తాహసీల్దార్ కార్యాలయంను ఒక ప్రాథమిక పాఠశాలకు షిఫ్ట్ చేసేందుకు అవకాశాలు పరిశీలించి ప్రతిపాదనలు పంపాలని అన్నారు. కలెక్టర్ వెంట తిరుపతయ్య, ఎండిపిఓ నరేందర్ రెడ్డి, మాస్టర్ సురేందర్ రెడ్డి ఉన్నారు.

## మొరం టిప్పర్ పట్టివేత




**ప్రజాపక్షం/మాగనూర్:** పర్మిషన్ లేకుండా మొరం తరలిస్తున్న టిప్పర్ ను కృష్ణ ఎమ్మార్వో వెంకటేష్ మంగళవారం పట్టుకున్నారు. కృష్ణ మండలం నల్లగట్టు సమీపంలో మొరం క్వారీలను పరిశీలించారు. పర్మిషన్ లేకుండా అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్ ను పట్టుకుని కృష్ణ పోలీస్ స్టేషన్ కు తరలించనట్లు తెలిపారు. అక్రమ తవ్వకాలు జరిపిన హిటాచిను మాత్రం మొదటిసారి కావడంతో వదిలేశామన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ కొన్ని నెలలుగా పర్మిషన్ లేకుండా క్వారీలు పెట్టి, రాత్రింబవళ్లు తేడా లేకుండా అక్రమ మొరం దందా కొనసాగుతున్న కృష్ణ మండలంలో పట్టించుకున్న అధికారులే లేరని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి అక్రమార్కులను కట్టడి చేసి, ప్రభుత్వానికి ఆదాయం వచ్చేటట్టు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనే ధ్యేయం





**ప్రజాపక్షం/కల్వకుర్తి:** కల్వకుర్తి నియోజకవర్గ నిరుద్యోగ యువతకు ఉద్యోగాలకల్పనే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్కసిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని సికేఆర్ ఫంక్షన్‌హాలులో ఐక్యత ఫౌండేషన్, టాస్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగాజాబ్ మేళాకు దాదాపు 2500 మందికి పైగా నిరుద్యోగ యువత హాజరయ్యారు. అందులో 230 మంది యువతకు తక్షణమే ఉద్యోగ నియామక పత్రం అందజేశారు. మహిళలు, యువత ఆధ్వర్యంలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్కసిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం కేక్ కట్‌చేసి ఆయనకు తినిపించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యతఫౌండేషన్, టాస్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో వివిధ రంగాలకు చెందిన 68 రకాల కంపెనీలు పాల్గొనడం జరిగిందని, జాబ్‌మేళాకి 2500 మందికిపైగా నిరుద్యోగ యువత హాజరవ్వడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాల కల్పనే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామన్నారు. నియోజకవర్గంలో దాదాపు 10వేల మందికి పైగా యువతకు ఉద్యోగ అవకాశాలు అందించేందుకు నిరంతరంగా పనిచేస్తున్నామన్నారు. మన కల్వకుర్తి ప్రాంత యువతకోసమై ప్రతి సంవత్సరం కూడా సుంకిరెడ్డి మెగాజాబ్ మేళా కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు కృష్ణారెడ్డి సుభాషిణి, ఐక్యతఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## గంజాయి,కల్తీ కల్లు నిర్మూలన పోస్టర్ విడుదల



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా గంజాయి , కల్తీ కల్లు నిర్మూలనకు సంబంధించి అవగాహన కల్పించేందుకు తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో తరపున ప్రచార కార్యక్రమాని వేగవంతం చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ జానకి, ఐపీఎస్ ప్రత్యేకంగా తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో వారు రూపొందించిన గంజాయి కల్తీకల్లు నిర్మూలన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యువత ప్రజలు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి. గంజాయి, కల్తీకల్లు వంటి నిషేధిత పదార్థాల వినియోగం వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా, సమాజపరంగా తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ఎవరైనా గంజాయి విక్రయం లేదా కల్తీ కల్లు తయారీ, సరఫరా వినియోగానికి పాల్పడినట్లు సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడును. మత్తు మందుల వ్యసనాన్ని నిర్మూలించేందుకు అందరూ కలిసి పనిచేయాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నార్కోటిక్ బ్యూరో డిఎస్పీ బుచ్చయ్య, డిసిఆర్‌బి డిఎస్పి రమణారెడ్డి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాలో ఈ ప్రచారాన్ని మరింత బలపరచడానికి రద్దీ ప్రదేశాలలో, స్కూల్, కాలేజీల స్థాయిలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ ఇతర పోలీసు అధికారులకు తెలిపారు.

## వరిని పరిశీలించిన శాస్త్రవేత్తలు



**ప్రజాపక్షం/బిజినేపల్లి:** మంగళవారం నాడు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, తిమ్మాజిపేట మండలంలోని అప్పాజీపల్లి గ్రామంలోని వరి పొలాలను పరిశీలించారు. కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ పాలెం డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, వరి పొలాలలో ప్రస్తుతం ఆశిస్తున్న కాండం తొలిచే పురుగు నివారణకు సలహాలు సూచనలు చేశారు. ఈ చిరు పొట్ట దశలో ఉన్న వరి పంటను కాండం తొలిచి పురుగు అడిగించినట్లయితే మొవ్వు చనిపోయి తెల్ల కంకులుగా ఏర్పడతాయి. చిరు పొట్ట దగ్గర్లో రెక్కల పురుగు ఉధృతి గమనించుకుని నివారణ చర్యలు చేపట్టాలి. ఎకరాకు 400 గ్రా కార్టాఫ్ హైడ్రో క్లోరైడ్ 60 మి.లీ.క్లోరాంట్రానిలి ప్రోల్ 20 లీటర్ల వీటిలో కలిపి పిచికారి చేయాలి. కంకి ఈనిన తర్వాత తెల్ల కంకులు గమనించిన ఆ తర్వాత పిచికారి చేస్తే ఎలాంటి ఉపయోగం ఉండదు. పంట పొట్ట దగ్గర్లో ఉన్నప్పుడే పిచికారి చేసుకోవాలి. ఆకునల్లి కంకినల్లి ఉధృతి నివారణకు స్పైరోమైసిన్ 1 మి.లీ.లీటర్ లేదా మూడు గ్రాముల గంధకం లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. ఉధృతి నివారకు స్పైరోమైనకె 1 మీ.లీ. లేదా గాందీకం 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఈ కార్యక్రమంలో ప్యాక్ట్ కంపెని అధికారి హన్మంతు, వ్యవసాయ విస్తీర్ణాధికారి శివకుమార్ 30 మంది అప్పాజిపల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఆశా కార్యకర్తల అక్రమ అరెస్టులను ఖండించండి



**ప్రజాపక్షం/వీపనగండ:** ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియూ) వీపనగండ్ల మండల కమిటీ ఆధ్వర్యంలో నిన్న హైదరాబాద్‌లో ఆశ వర్కర్ల సమస్యలపై ధర్నా చేస్తున్న సందర్భంగా అక్రమంగా అరెస్టు చేసిన దానికి నిరసనగా వీపనగండ్ల అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆశా వర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు సాయి లీల, సిఐటియూ మండల నాయకులు ఆశన్న, ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు సుజాత మాట్లాడుతూ ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని హైదరాబాద్ లో శాంతియుతంగా ధర్నా చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం పోలీసు బలగాలతో అరెస్టు చేయడం సరైన పద్ధతి కాదని అన్నారు. ఎన్నికల కంటే ముందు ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరిస్తామని, కనీస వేతనాలు ఇస్తామని వాగ్దానం చేయడం జరిగింది. వాగ్దానం చేసిన హామీలను అమలు చేయాలని అడుగుతే పోలీసులు పెట్టి అరెస్టు చేయడం సరైన పద్ధతి కాదని వారే హెచ్చరించారు. వెంటనే ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ. 21,000 ఇవ్వాలని, ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు రాణి, పార్వతమ్మ, సునీత, వెంకటమ్మ , లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు వ్యాపార రంగంలో ముందుకు సాగాలి

కలెక్టర్ సిక్తా పట్నాయక్



**ప్రజాపక్షం/నర్వ :** వ్యాపార రంగంలో మహిళలే వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. నారాయణపేట్ జిల్లా కేంద్రంలో జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రారంభించడం, దేశంలోని మహిళా సమాఖ్య ద్వారా నడిపే పెట్రోల్ బంక్ ఇదే కావడంతో నారాయణపేట్ జిల్లాకు ఎంతో పేరు, ప్రఖ్యాతలు వచ్చాయని, నిజంగా ఇది జిల్లా మహిళలు సాధించిన గొప్ప విజయమని కలెక్టర్ తెలిపారు. నారాయణపేట జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారి వద్ద గల వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రంలో మంగళవారం జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన అంతరాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై జిల్లా మహిళా సమాఖ్య సభ్యులకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ. మహిళలు వ్యాపార రంగంలో రాణిస్తారని, పొదుపు అంటేనే మహిళలు. మహిళలు అంటేనే పొదుపు అనే నానుడి ఉందన్నారు. అయితే మహిళలు వ్యాపార వేత్తలుగా ఎదగడానికి ప్రభుత్వం అని విధాలుగా సహకరిస్తుందని చెప్పారు. ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సులు, రైస్ మిల్లులు, సోలార్ పవర్ ప్లాంట్స్ ఇస్తోందని తెలిపారు. మహిళలు ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. మహిళా సమాఖ్య పెట్రోల్ బంక్ ఏర్పాటుతో నారాయణపేట జిల్లాకు దేశ వ్యాప్తంగా మంచి గుర్తింపు వచ్చిందని, అదే విధంగా ఇంకా ఏదైనా వినూత్నంగా ఆలోచించి వ్యాపార పరంగా జిల్లా మహిళా సమాఖ్య మరో ముందడుగు వేయాలని ఆమె కోరారు. జిల్లా సమాఖ్య సభ్యులు అందరూ చర్చించి ఇంకా వేరే ఏదైనా వ్యాపారం చేఊయాలని అనుకుంటే డిఆర్‌డిఏ కు తెలపాలన్నారు. అలాగే జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షకార్యదర్శులతో పాటు అన్ని మండలాల సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులను జిల్లా కలెక్టర్ జ్ఞాపిక, శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ మొగులప్ప, అడిషనల్ డిఆర్‌డిఓ అంజయ్య, జిల్లా సమాఖ్య కార్యదర్శి, కోశాధికారి, అన్ని మండలాల సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఆశావర్కర్లను అరెస్టు చేయడం దుర్మార్గం

**ప్రజాపక్షం/బిజినేపలి:** ఆశావర్కర్ల కు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గపు పని అని జిల్లా ఆశా వర్కర్ల ప్రధాన కార్యదర్శి చెన్నమ్మ ఆశా వర్కర్లకు ఫిక్స్, వేతనం 18 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండు చేస్తూ సోమవారం చలో హైదరాబాద్ కోటి కమిషనరేట్ కార్యాలయం ముట్టడి ముట్టడించిన ఆశా కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయడంపై పోలీసుల వివిధ స్టేషన్లో అక్రమంగా నిర్బంధించడం బాధాకరమన్నారు. హక్కులు అడిగితే అరెస్టు చేయడం పై పోలీసుల వివిధ స్టేషన్లో అక్రమంగా నిర్బంధించడం బాధాకరమన్నారు. హక్కులు అడిగితే అరెస్టు చేస్తారా అని ప్రభుత్వ అక్రమ అరెస్టులను నిరసిస్తూ తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిక్స్డ జీతం 18000 ఇవ్వాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. గతంలో సర్వే చేసిన పల్స్ పోలియో పెండింగులో ఉన్న డబ్బులను వెంటనే చెల్లించాలని అనే కోరారు. దేశవ్యాప్తంగా 10 లక్షల మంది ఆశా వర్కర్లు పని చేస్తున్న అన్నారు. గత 20 సంవత్సరాల నుండి ఆశాలు ఎన్‌హెచ్‌ఎంస్కీంలో భాగంగా పనిచేస్తామన్నారు. తక్కువ వేతనంతో ఎక్కువ పని చేస్తూ ఉద్యోగ భద్రత లేక చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నామని ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని అడుగుతుంటే ప్రభుత్వం అక్రమ నిర్బంధాలకు పాల్పడుతుందన్నారు. కరోనా వర్కర్లకు గ్లోబల్ హెల్త్ లీడర్స్ అవార్డును అందించిందని ఆమె సందర్భంగా గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆశాలను నేటికి గుర్తించడం లేదంటూ లేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని ఆమె కోరారు. లేనిచో ముందు ముందు రాష్ట్ర ప్రభుత్వం పై పోరాటం నిర్వహిస్తామని అన్నారు. గతంలో సర్వే చేసిన లెప్రసి, పల్స్ పోలియో పెండింగు డబ్బులను వెంటనే చెల్లించాలని ఆమె డిమాండు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశాలతో పనిచేయించుకుని డబ్బులు ఇవ్వకుండా వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సుభాకర్, సిపిఎం మండల కమిటీ సభ్యులు చంద్రశేఖర్, ఆశావర్కర్స్ యూనియజ్ జిల్లా ఉపాధ్యక్షురాలు వసుంధర, కృష్ణవేణి, జయమ్మ, అలివేలు, పార్వతి, విజయశీల, వెంకటమ్మ, వరలక్ష్మి , భాగ్యమ్మ, తిరుపతమ్మ, కృష్ణవేణి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం
REGIONAL NEWS

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## చెర్వుగట్టు హుండీ ఆదాయం రూ. 32 లక్షలు



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి :** మండలంలోని చెర్వుగట్టు శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం యొక్క హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ లెక్కింపు కార్యక్రమం లో ముందుగా గట్టు కింద గల అమ్మ వారి ఆలయ హుండీ ఆదాయం రూ. 4,02,640లు,గట్టు పైన స్వామి వారి ఆలయ హుండీ ఆదాయం రూ.28,26,120 మొత్తం రూ. 32,28,760 అన్నదానంకు రూ.5,730లు వచ్చాయని ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎస్. నవీన్ కుమార్ తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమం లో దేవాదాయ శాఖ పరిశీలకులు పి ఏడుకొండలు, నందిగామ దుర్గ శివ సాయి సేవా సమితి సభ్యులు, హెచ్‌డిఎఫ్‌సి బ్రాంచ్ సిబ్బంది, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.



## భువనగిరిలో కాలుష్యం...

**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:** భువనగిరిలో విపరీతంగా పెరిగిపోతున్న శబ్ద కాలుష్యంను నివారించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్ అన్నారు. నూతనంగా మన జిల్లాకు బదిలీపై వచ్చిన డీసీపీ అక్షాంశ్ యాదవును సిపిఐ ఆధ్వర్యంలో మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. కానీ అవి పనిచేయడం లేదు వెంటనే ఉపయోగంలోకి తీసుకురావాలని కోరారు. భువనగిరి పట్టణమునందు శబ్ద కాలుష్యం విపరీతంగా పెరిగిపోయింది చెప్పారు. మోటార్ వాహనాల కంపెనీలు ఇచ్చిన సైలెన్సర్లు తొలగించి పెద్దగా సౌండ్ వచ్చే వాటిని బిగించి పెద్ద పెద్ద శబ్ద కాలుష్యం సృష్టిస్తూ పెద్ద పెద్ద శబ్దాలు వచ్చేలా చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. కొంతమందికి వినికిడి సమస్యలు ఏర్పడు చున్నవని ఈ సమస్యను నియంత్రించి యువతను క్రమశిక్షణలో ఉండేలా చేసి ప్రజలను కాపాడాలని కోరారు. ఎల్లమ్మ గుడి నుండి వెన్నెల కాలేజీ వరకు బారికేడ్లు ఏర్పాటుచేసి ప్రజలు ప్రమాద బారిన పడకుండా కాపాడాలని విజ్ఞప్తి చేశారు. పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు వస్తువుల అభిలాష్, కార్యవర్గ సభ్యులు దాసరి లక్ష్మయ్య, చింతల పెంటయ్య, బద్దం వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ రవాణా బియ్యం, ఇసుకపై కేసు



**ప్రజాపక్షం/మునగాల:** అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యం వాహనం, రెండు ఇసుక ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు మునగాల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయం మొద్దులచెర్వే స్టేజీ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఒక అశోక్ లీలాండ్ కోదాడ నుండి హైద్రాబాద్ వెళ్తుండగా వాహనంను ఆపి తనిఖీ చేయగా నిండుగా పిడిఎస్ బియ్యం బస్తాలు ఉన్నట్లు గుర్తించారు. వాటిపై డ్రైవర్ ఆకుల మహిపాల్‌ను వివరాలు అడగ్గా ఈ బియ్యం ప్రభుత్వ పంపిణీ బియ్యమని తమ్మరబండపాలెం గ్రామంలో రాయపూడి జానకిరాములు వద్ద 35 క్వింటాళ్ల లోడ్ చేసుకుని సిద్దిపేట టౌన్ సంజయ్ అనే వ్యక్తికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఉండ్రుగొండ పాలేరు వాగు నుండి రేపాల గ్రామానికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న కొండ వీరయ్య, యాజమాని మేకరబోయిన ఉప్పయ్య ట్రాక్టర్ ఎపి24 ఎవి8007 ను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు, కోదాడ మండలం కొత్తగూడెం గ్రామ శివారులోని పాలేరు వాగు నుండి మల్లెల శ్రీను, కత్తి గోపి లు ఇసుక ట్రాక్టర్‌ను మునగాలకు తరలిస్తుండగా పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకవచ్చి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

## నేడు ధర్మభిక్షం 14వ వర్ధంతి జయప్రదం చేయాలి : సిపిఐ




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, బలహీన వర్గాల ఆశాజ్యోతి కామ్రేడ్ ధర్మభిక్షం 14వ వర్ధంతిని సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ ధర్మభిక్షం భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు పర్యాయాలు పార్లమెంట్ సభ్యులుగా, మూడు పర్యాయాలు శాసన సభ్యునిగా ఎన్నికై చట్టసభల్లో పేదల పక్షాన కామ్రేడ్ ధర్మభిక్షం తన గళాన్ని వినిపించారని గుర్తు చేశారు. నిజాం రజాకార్లకు వ్యతిరేకంగా తుపాకి చేతబట్టి అన్యాయనికి, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన ధీరశాలి ఆయన అన్నా రు. నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యే యంగా గీత కార్మికుల హక్కుల సాధన కోసం రాజీలేని పోరాటాలు చేశారని చెప్పారు. సిపిఐ శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు సూర్యాపేట జిల్లాకు కామ్రేడ్ ధర్మభిక్షం పేరు పెట్టాలని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం హర్షణీయమన్నారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు అనంతుల మల్లేశ్వరి, బొమ్మగాని శ్రీనివాస్, నిమ్మల ప్రభాకర్, దేశగాని హేమలత, కామేష్ పాల్గొన్నారు.

## గుండెపోటుతో పంచాయతి కార్యదర్శి మృతి



**ప్రజాపక్షం/మానవపాడు :** జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండల కేంద్రానికి చెందిన వెంకటేష్ పంచాఇతీ కార్యదర్శి గుండెపోటుతో మృతి చెందాడు. జీ.ఓ.317 క్రింద నిజాంబాద్ జిల్లా ఇందులవాయి మండలంలో గన్నారం గ్రామ పంచాయితీకి పంచాయితీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ నిన్న రాత్రి మృతి చెందారు. వెంకటేశ్ పంచాయితీ కార్యదర్శిగా తన సొంత జిల్లా షేక్ పల్లి గ్రామంలో సుధీర్ఘకాలంగా సేవలందించారని తన స్నేహితులు చర్చించుకుంటున్నారు. పంచాయితీ కార్యదర్శి వెంకటేష్ మృతి తో షేక్ పల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. చెప్పుకుంటున్నారు. అతిచిన్న వయస్సులో కార్యదర్శిగా షేక్‌పల్లిలో వెంకటేష్ విధులు నిర్వహించాడు. అవసరాల కోసం తన దగ్గర కొచ్చే నిరుపేద ప్రజల పట్ల దయాగుణంతో సహాయం చేసే వ్యక్తి అంటున్నారు. వెంకటేష్ మరణం బాధాకరమని గ్రామ మాజీ సర్పంచు రవీందర్ రెడ్డి ఉమ్మడి ఇటిక్యాల మండల మాజీ ఎంపిపి స్నేహ శ్రీధర్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. మంచికి మారుపేరుగా నిజాయితీకి నిలువెత్తురూపంగా గ్రామస్తుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న వెంకటేష్ మృతి పట్ల రక్త సంబంధాలు కన్నీరు. పెట్టుకుంటున్నారు. విధి నిర్వహణలో భాగంగా నిజామాబాద్ కి బదిలీ అయిన వెంకటేష్ ఇటీవల గ్రామస్తులతో కలిసి మళ్లీ మన ఊరికే వస్తానని చెప్పాడు, అంతలోనే ఇలా జరిగిందని గ్రామస్తులు గుర్తు చేసుకుంటూ కన్నీటి పర్యంతం అయ్యారు.

# రబీ ధాన్యం కొనుగోలుకు రైస్ మిల్లర్లు సహకరించాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ :** రబీ ధాన్యం కొనుగోలుకు రైస్ మిల్లర్లు సంపూర్ణ సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రబీ ధాన్యం కొనుగోలు పై రైస్ మిల్లర్లు, పౌరసరఫరాలు, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. రైస్ మిల్లర్ల సమస్యను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడు సానుకూలతతో ఉంటుందని, ముఖ్యంగా పెండింగ్ ట్రాన్స్ పోర్ట్ బిల్లుల చెల్లింపు, పాత గన్ని బ్యాగుల సమస్య ,ఎఫ్‌సిఐ 67 ఈల్డింగ్ వంటి సమస్యలన్నిటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఇందులో భాగంగా గడిచిన అక్టోబర్ నుండి ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ ట్రాన్స్ పోర్ట్ బిల్లుల చెల్లింపులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 1400 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. తక్కిన బిల్లులను ప్రభుత్వం దశలవారీగా చెల్లిస్తోందని అప్పటివరకు వేచి ఉండాలని కోరారు. పాత గన్ని బ్యాగులకు సంబంధించిన సమస్యను పరిష్కరిస్తామని, ఇందుకుగాను రైస్ మిల్లుల వారిగా పాతగన్నీ బ్యాగుల సమాచారాన్ని సేకరించాలని ఇన్చార్జి జిల్లా పౌర సరఫరాల అధికారిని ఆదేశించారు. రైస్ మిల్లర్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజిస్టర్ లను సరిగా నిర్వహించాలని ,మిర్యాలగూడ ప్రాంతంలో వెంటనే కొనుగోళ్లు,ఆన్ లోడ్ ప్రారంభించాలని, కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు ధాన్యం వచ్చినప్పుడు టెక్నికల్ పర్సన్ తో పాటు, హమాలీలను సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో మిల్లర్లు ఖరీఫ్ లో లాగే రబీలో సైతం సహకారం అందించాలని, ఏలాంటి ఇబ్బందులకు ఆస్కారం లేకుండా ధాన్యాన్ని దించుకోవాలని, ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ,2022 23 ఆక్షన్ ధాన్యం, ఫిలిప్పీన్స్ కు చెల్లించాల్సిన ధాన్యం డెలివరీ కచ్చితంగా ఇవ్వడం ,ధాన్యం వాహనాలను తక్షణమే అన్ లోడ్ చేసుకుని వెంటనే పంపడం వంటివి చెయ్యాలని అన్నారు. ఈసమావేశంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ ,రసరఫరాల జిల్లా మేనేజర్ , ఇన్చార్జి డిఎస్ఓ హరీష్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, మార్కెటింగ్ శాఖ ఏడి ఛాయాదేవి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి,జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నారాయణ, భద్రాద్రి, మిర్యాలగూడ, చిట్యాల, హాలియా, నల్గొండ, దేవరకొండ, తదితర ప్రాంతాల రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# 31న హుజూర్‌నగర్‌లో సిఎం సభ

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతులు మీదుగా తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన హుజూర్‌నగర్ పట్టణంలో ప్రారంభం కానున్న సన్నబియ్యం పంపిణీ కార్యక్రమానికి ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఫణిగిరిగుట్టకు వెళ్ళే దారిలో జరుగుతున్న ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లను జిల్లా ఎస్పి కె.నరసింహ తో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సభ జరిగే ప్రాంగణం పరిశీలిస్తూ హెలిప్యాడ్ దిగే వద్ద అడ్డంగా ఉన్న విద్యుత్ స్థంబాలు తొలగించి ఆలైన్‌లో ఉన్న విద్యుత్ సరఫరాను వేరే రూట్‌లో సరఫరా చేయాలని, హెలిప్యాడ్ నుండి సభా వేదిక వరకు అప్రోచ్ రోడ్‌ను వేయాలని భారీకేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వి.ఐ.పి,అధికారుల పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. హెలిప్యాడ్‌ను, అప్రోచ్ రోడ్ పనులను 27 సాయంత్రం లోపు పూర్తి చేయాలన్నారు. ప్రజలు ఎక్కువగా వస్తారు కాబట్టి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పలు చోట్ల పార్కింగ్ స్థలాలను పరిశీలన చేశారు. పార్కింగ్ స్థలాలకు వెళ్లే రోడ్లల్లో గుంతలు పూడ్చి,రోలింగ్ ద్వారా చదును చేయాలని దారిపొడవునా ఏమైనా చెట్ల కొమ్మలు అడ్డు వస్తే తొలగించి పార్కింగ్‌లో ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేసి, ప్రతి పార్కింగ్‌లో రెండు దార్లు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమీషనర్‌కు సూచించారు. అనంతరం హుజూర్‌నగర్ ఆర్‌డీఓ కార్యాలయంలో ముఖ్యమంత్రి ఏర్పాట్లపై కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...హెలిప్యాడ్,పార్కింగ్,విఐపిలకు ప్రోటోకాల్,సభావేదిక వద్ద తహశీల్దారులకు ఇంచార్జ్ విధులు కేటాయించామని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వేసవి కాలం దృష్టిలో ఉంచుకుని ప్రజల కోసం చల్లటి త్రాగునీరు,మజ్జిగ,ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతిసెక్టార్‌కు ఎంపిడిఒ,ఎంపిఒ ఇంచార్జ్‌గా ఉంటూ పంచాయతీ సెక్రటరీలను సపోర్టుగా ఉంచుకుంటూ గ్రామపంచాయతీ సిబ్బంది సహాయంతో సభకు వచ్చిన ప్రజలకు త్రాగునీరు,మజ్జిగ అందజేయాలన్నారు. అధికారులు ఐడీ కార్డులు ధరించాలన్నారు. సమాచార శాఖ ద్వారా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులచే ప్రభుత్వ సంక్షేమ,అభివృద్ధి పథకాలపై కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓలు శ్రీనివాసులు,సూర్యనారాయణ,తహశీల్దార్లు ఎమ్.నాగార్జున్ రెడ్డి,కమలాకర్,మంగ,జ్యోతి,కవిత,సైదులు,సురేందర్‌రెడ్డి,మున్సిపల్ కమీషనర్ కె.శ్రీనివాస రెడ్డి, అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## పామాయిల్ సాగుతో రైతులకు లాభం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** భవిష్యత్తులో పామాయిల్ రైతులకు లాభసాటిగా ప్రభుత్వాలు పామాయిల్ తోటల రైతులను ప్రోత్సహిస్తుందని జిల్లా అగ్రికల్చర్ మేనేజర్ అనంత రెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా పామాయిల్ ఫార్మర్స్ సొసైటీ ఆధ్వర్యంలో మండలపరిధిలోని దండంపల్లి గ్రామంలో గాదె శ్రీధర్ రెడ్డి పామాయిల్ తోటల్లో రేగట్టే గురువారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అనంత రెడ్డి మాట్లాడుతూ పామాయిల్ సాగుకు ప్రభుత్వం సంవత్సరానికి ఎకరానికి 4200 సబ్సిడీని ఇస్తుందని , డ్రిప్ సిస్టం కూడా ప్రోత్సహిస్తుందని ఎస్‌సి, ఎస్‌టి,బిసి రైతులకు 90 శాతం సబ్సిడీ ఇస్తుందని తెలిపారు.పామ్ ఆయిల్ సాగు చేసే విధానం, వాతావరణ అనుకూలాలు, ఎకరానికి 57 మొక్కలు నాటే విధానం, బిందు సేద్యం, సహజ ఎరువులు రసాయనాలు పిచ్చి కారి చేసే విధానం తగిన జాగ్రత్తలు రైతులకు ఉండే సందేహాలను నివృతం చేశారు.కార్యక్రమంలో పామ్ ఆయిల్ ఫార్మర్స్ సొసైటీ ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి గురూజీ, గాదె శ్రీధర్ రెడ్డి, పతంజలి నుండి నరేందర్, డ్రిప్ నుండి సుబ్బారావు, వెంకట్ రెడ్డి, రామ్ చందర్ రెడ్డి ప్రభాకర్ పాల్గొన్నారు.

# జోగులాంబ దేవస్థానం అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

అధికారులకు కలెక్టర్ బి.యం సంతోష్ ఆదేశం



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి:** జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించి, కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ మీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానం అలంపూర్ యొక్క ఆధ్యాత్మిక/యాత్రా అవసరాలు, స్థిరమైన పర్యాటకాన్ని దృష్టిలో ఉంచుకొని సమగ్ర పునర్వ్యవస్థీకరణ ప్రధాన ప్రణాళిక పై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జోగులాంబ దేవస్థానం అభివృద్ధికి కొరకు ఏర్పాటైన పర్యవేక్షణ అభివృద్ధి కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అలంపూర్ పునరుద్దరణ ప్రణాళికను ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ మూర్తి ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అలంపూర్ తెలంగాణ లో ఏకైక శక్తిపీఠంగా ఉన్నందున, దీని ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని దేవాలయ అభివృద్ధితో పాటు పర్యాటక అభివృద్ధి, సమగ్ర ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు. ప్రసాద్ పథకం భవనానికి నీటి సరఫర కోసం మున్సిపల్ కమిషనర్ ఇంట్రా ఈ.ఈ పబ్లిక్ హెల్త్, ఇంజనీర్లు నది నుంచి నీటి శుద్ధి విషయం పై ఫీల్డ్ విజిట్ నిర్వహించి 15 రోజుల్లో వ్యయ అంచనాలను సమర్పించాలన్నారు. ప్రసాద్ పథకం భవనాన్ని సమర్పించాలన్నారు. ప్రసాద్ పథకం భవనాన్ని టూరిజం శాఖ అధికారులు వెంటనే దేవదాయ శాఖకు అప్పగించాలని సూచించారు. దేవాలయానికి అనుసంధానించే రహదారుల అభివృద్ధికి గాంధీ జంక్షన్ నుండి ఆలయం వరకు రహదారి వివరాలు సిద్ధం చేయాలని, మురుగునీటి కాలువ వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేయాలని మున్సిపల్ కమిషనర్ కు ఆదేశించారు. దేవాలయ పరిసర ప్రాంతాలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సిస్టం ను, భక్తులకు త్రాగునీటి సదుపాయంతో పాటు క్లాక్ రూమ్ ఏర్పాటు కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. హైదరాబాద్ కర్నూల్ నుండి అలంపూర్ మార్గాల్లో దిశానిర్దేశిక బోర్డులు, నంది శివ చత్రువుల్లో సూచికలు ఏర్పాటు చేయాలని, అలాగే బస్టాప్, ఆటో స్టాండ్ అభివృద్ధి సైన్‌బోర్డులు, గోడల పై పెయింటింగ్ పనులు కోసం ఫీల్డ్ విజిట్ నిర్వహించి 15 రోజుల్లో లైన్ అంచనాలను సమర్పించాలని ఆర్‌అండ్ బి శాఖకు ఆదేశించారు. ప్రస్తుత పార్కింగ్ ప్రాంతంలో మొక్కలు నాటి గ్రీనరీని పెంచాలని, టాయిలెట్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని పర్యాటక శాఖ అధికారులకు ఆదేశించారు. ఆలయ పరిసరాల్లో శుభ్రత, నిర్వహణ, పచ్చదనం పెంపొందించేందుకు వృక్షార్చన, చెట్లను నాటడంచ పర్యావరణ అనుకూల అభివృద్ధి చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఆలయ అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలని అధికారులకు ఆదేశించారు. దేవాలయం వద్ద అభివృద్ధి పనులు చేపట్టేందుకు శాఖల వారీగా వారం రోజుల్లో ప్రతిపాదనలను అందజేయాలన్నారు. ఈ సమావేశంలో అదరపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ, ఆర్డీవో శ్రీనివాసరావు, రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణ రావు, అసిస్టెంట్ స్థాపతి గణేష్, ఆర్కిటెక్ట్ సూర్య నారాయణ మూర్తి, టెంపుల్ డిజైనర్ గోవింద, హరి, ఏడి ఆర్కియాలజీ నాగలక్ష్మి , ఈఓ పురేందర్, డిపిఎ నాగేంద్ర అలంపూర్ తహసీల్దార్ మంజుల, మున్సిపల్ కమిషనర్ చంద్ర శేఖర్ రావు, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్ రావు, ఆర్ అండ్ బి ఎస్.ఈ వనజా రెడ్డి పాల్గొన్నారు.



## సాగర్‌లో పిడిఎస్ బియ్యం పట్టివేత : నిందితుల అరెస్ట్

**ప్రజాపక్షం /నందికొండ:** అక్రమంగా తరలిస్తున్న పిడిఎఫ్ బియ్యాన్ని పట్టుకున్న వైనం నందికొండ మున్సిపాలిటీ లో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే స్థానిక ఎస్సై సంపత్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం నందికొండ మున్సిపాలిటీలోని స్థానిక పైలాన్ కాలనీ కొత్త బ్రిడ్జి అంతర్రాష్ట్ర సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద మధ్యాహ్నం మూడు గంటలకు వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో హాలియా నుండి సాగర్ వైపుకు అనుమానాస్పదంగా వస్తున్నఒక నెంబర్ ప్లేటు లేని బొలెరో వాహనాన్ని ఆపే క్రమంలో వారు వాహనాన్ని ఆపకుండా తప్పించుకునే ప్రయత్నంలో బారికేడ్ ను గుద్దుకొని ఆగిపోవడంతో వెంటనే అందులో ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించగా వారు ఆంధ్రప్రదేశ్ రెంటచింతల గ్రామానికి చెందిన నెమలి నాగిరెడ్డి, మధులుగా గుర్తించడం జరిగిందని వారు నారాయణ,ఓంకార్ రెడ్డి, లతో కలసి చలకుర్తి కి చెందిన సైదిరెడ్డి, నెల్లికల్ కి చెందిన శ్రీదర్ రెడ్డి లతో మాట్లాడుకొని గత కొంతకాలంగా అక్రమంగా రేషన్ బియ్యం వ్యా పారం చేస్తున్నట్టు నిర్ధారణ అయిందని తెలిపారు.అదే క్రమంలో హాలియా నుంచి 20 బస్తాల పిడిఎస్ బియ్యన్ని అక్రమంగా ఆంధ్ర వైపు ఇస్తున్న సమ యంలో వాహనాన్ని పట్టుకోవటం జరిగిందన్నారు. వెంటనే పిడియస్ బియ్యంతో పాటు బొలెరో వాహనాన్ని అందులో ఉన్న రెంటచింతల గ్రామా నికి చెందిన నెమలి నాగిరెడ్డి, మదులను అదుపులోకి తీసుకోని సు నమోదు చేసినట్టు ఎస్సై సంపత్ గౌడ్ తెలిపారు. సీఐ బీసన్న ఆదేశానుసారం నింది తులను పట్టుకొనటలో చాకచక్యంగా వ్యవహరించిన విజయపురి టౌన్ ఎస్ ఐ సంపత్ గౌడ్, ఏఎస్ఐ గురునాదం, కానిస్టేబుళ్లు సురేష్, నాగేంద్ర పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేట్ ఆసుపత్రులు నిర్వహించాలి

జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆసుపత్రులు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ(డిఆర్ఏ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేట్ ఆసుపత్రుల్లో అర్హత కలిగిన వైద్యులు ఉండాలన్నారు. ఒకరి పేరున అనుమతులు తీసుకొని మరోకలు వైద్యం అందిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల అనుమతులకు అన్ని రకాల పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అనుమతుల రెన్యూవల్ కోసం 30రోజుల ముందుగానే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటాచలం, డిఎస్‌పి మట్టయ్య, ఐఎంఎ అధ్యక్షులు ఆనంద్, డిప్యూటి డెమో కె మనోహర్ రాణి, స్టాటిస్టిక్ ఆఫీసర్ వీరయ్య పాల్గొన్నారు.



# ఆర్‌టిసి బస్సులు ఆపాలని ధర్నా



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** మండలంలోని చౌళ్ళ రామారం సమీపంలో అడ్డగూడూరు స్టేజి వద్ద తొర్రూరు వలిగొండ నేషనల్ హైవే పైన నడిపే బస్సులు అడ్డగూడూరు స్టేజి వద్ద ఆర్టీసీ బస్సులను ఆపాలని ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం దాదాపు గంట రాస్తారోకో నిర్వహించారు. అనంతరం అడ్డగూడూరు ఎస్సై డి.నాగరాజు సూచన మేరకు బస్సులలో ప్రయాణించే ప్రయాణికుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని రాస్తారోకో ముగించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ మాట్లాడుతూ అడ్డగూడూరు స్టేజి వద్ద గతంలో ఎక్స్ ప్రెస్, ఆర్డినరీ, డీలక్స్ బస్సులు ఆపేవారని మహాలక్ష్మి ఫ్రీబస్ పథకం వచ్చినప్పటినుండి అడ్డగూడూరు స్టేజి వద్ద బస్సులను ఆపకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దాదాపు మండలంలోని అన్ని గ్రామాలు గట్టుసింగారం, మానాయికుంట, గోవిందపురం, అడ్డగూడూరు, ధర్మారం, లక్ష్మీ దేవి కాలువ ప్రజలు విద్యార్థులు అడ్డగూడూరు స్టేజి వద్దకు వచ్చి హైదరాబాద్ వెళ్లడానికి ఆర్టీసీ బస్సులలో ప్రయాణిస్తుంటారు. స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్, జిల్లా కలెక్టర్ హనుమంతరావు ప్రత్యేక చొరవ తీసుకొని అడ్డగూడుర్ స్టేజి వద్ద ఆర్టిసి బస్సులు ఆపటానికి కృషి చేయగలరని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘాలు ఏస్ఎఫ్ఐ నాయకులు చిప్పలపల్లి వంశీ కుమార్, చెరుకు శివరాజు, జిల్లా రాకేష్, సంతోష్, బిఆర్ఎస్వి నాయకులు ఎడ్ల ప్రేమ్ కుమార్, మేడబోయిన రాజు, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఉప్పల వంశీ, మందుల ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ భవనాన్ని కూల్చివేత

**ప్రజాపక్షం/ఉండవెల్లి:** ఎటువంటి అనుమతి లేకుండా కట్టిన భవనాన్ని అధికారులు జెసిబి ద్వారా వడగొట్టారు. మంగళవారం 44వ జాతీయ రహదారి మీద స్థలం అక్రమానికి గురై భవన నిర్మాణం చేపట్టడంతో జాతీయ హైవే అధికారుల సూచన మేరకు తాసిల్దార్లు వెంకటేశ్వర్లు ఆర్ఐ సుజాత, ఎస్ఐ మహేష్ ఏఎస్ఐ సుబ్బారెడ్డి పోలిసు సిబ్బంది సహకారంతో నిబంధనలు విరుద్ధంగా ఉన్న భవన నిర్మాణాన్ని కూల్చివేశారు. సర్వే నెంబరు 448 ఉండవెల్లి మండల పరిధిలోని పుల్లూరు టోల్ ప్లాజా దగ్గర ఘటన చోటు చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అధికారుల సూచనలు సలహా మేరకు 44 జాతీయ రహదారి వెంబడి అక్రమణ గురైతే కఠిన చర్యలు తప్పవని అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎన్ హెచ్ఐ అథారిటీ సీఈఓ సిబ్బంది పాల్గొన్నారు.



## క్రీడ

### శ్రేయస్ అయ్యర్, శశాంక్ సింగ్
# ఊచ కోత..



ఐపిఎల్ 2025 సీజన్‌ను పంజాబ్ కింగ్స్ బ్యాటర్లు ఘనంగా ప్రారంభించారు. గుజరాత్ టైటాన్స్‌తో అహ్మదాబాద్ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్(42 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్స్‌లతో 97 నాటౌట్) చెలరేగాడు. ఛాంపియన్స్ ట్రోఫీ ఫామ్‌ను కొనసాగిస్తూ.. గుజరాత్ బౌలర్లను చెడుగుడు ఆడాడు. దాంతో ముందుగా బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 243 పరుగుల భారీ స్కోర్ చేసింది. శ్రేయస్ అయ్యర్‌తో పాటు యువ ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య(23 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 47), శశాంక్ సింగ్(16 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 44 నాటౌట్) రాణించారు. గుజరాత్ టైటాన్స్ బౌలర్లలో సాయి కిషోర్(3/30) మూడు వికెట్లు తీయగా.. కగిసో రబడా, రషీద్ ఖాన్ చెరో వికెట్ తీసారు. మహమ్మద్ సిరాజ్ తేలిపోయాడు. 4 ఓవర్లు వేసి 54 పరుగులు సమర్పించుకున్నాడు.

**అరంగేట్ర ప్లేయర్ విధ్వంసం..**

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ కింగ్స్‌కు ఆశించిన శుభారంభం దక్కలేదు. ఓపెనర్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్(5)ను రబడా పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి వచ్చిన శ్రేయస్ అయ్యర్‌తో కలిసి మరో ఓపెనర్, అరంగేట్ర ప్లేయర్ ప్రియాన్ష్ ఆర్య చెలరేగాడు. అయ్యర్ కూడా బ్యాట్‌కు పనిచెప్పడంతో పంజాబ్ పవర్ ప్లేలోనే వికెట్ నష్టానికి 73 పరుగులు చేసింది. హాఫ్ సెంచరీకి చేరువైన ప్రియాన్ష్ ఆర్యను రషీద్ ఖాన్ పెవిలియన్ చేర్చాడు. దాంతో రెండో వికెట్‌కు నమోదైన 51 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది.

**శ్రేయస్ అయ్యర్ ఊచ కోత**

అజ్మతుల్లా ఒమర్జాయ్, గ్లేన్ మ్యాక్స్‌వెల్(0) విఫలమైనా.. శ్రేయస్ అయ్యర్ దూకుడుగా ఆడాడు. 27 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న అతను అనంతరం మరింత దూకుడుగా ఆడాడు. మార్కస్ స్టోయినీస్(20), శశాంక్ సింగ్(20 నాటౌట్) సాయంతో 17.4 ఓవర్లలోనే జట్టు స్కోర్‌ను 200 ధాటించాడు. సెంచరీ చేసే అవకాశం ఉన్నా.. జట్టు కోసం ఆలోచించిన అయ్యర్.. భారీ షాట్లు ఆడుతున్న శశాంక్ సింగ్ స్ట్రైక్ ఇచ్చాడు. అతను సిరాజ్ వేసిన ఆఖరి ఓవర్‌లో ఐదు బౌండరీలతో 23 పరుగులు పిండుకున్నాడు. దాంతో పంజాబ్ 243 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది.

### రెండో మ్యాచ్
# హైదరాబాద్ జట్టు ఇదే!

ఐపిఎల్ 2025 సీజన్‌ను ఘనంగా ప్రారంభించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. గురువారం ఉప్పల్ మైదానం వేదికగా జరిగే మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ 44 పరుగుల భారీ తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే. ఉప్పల్ వేదికగానే రెండో మ్యాచ్ జరగనుండటంతో ఈ సారి 300 స్కోర్ నమోదవుతుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

**బ్యాటింగ్ పిచ్..?:** ఈ మ్యాచ్‌కు కూడా బ్యాటింగ్ పిచ్ తయారు చేయనుండటంతో మరోసారి పరుగుల వరద పారనుంది. మరోవైపు లక్నో సూపర్ జెయింట్స్.. ఈ సీజన్‌ను ఓటమితో ప్రారంభించింది. ఢిల్లీ క్యాపిటల్స్‌తో వైజాగ్ వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో లక్నో వికెట్ తేడాతో ఓటమిపాలైంది. సునాయసంగా గెలవాల్సిన మ్యాచ్‌ను చేజార్చుకుంది. ఈ మ్యాచ్‌లో ఓడినా.. లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటింగ్ లైనప్ భీకరంగానే ఉంది. మిచెల్ మార్ష్, నికోలస్ పూరన్ సూపర్ ఫామ్‌లో ఉన్నారు. బౌలర్లు లయ అందుకుంటే ఆ జట్టుకు తిరుగుండదు. ఈ క్రమంలోనే సన్‌రైజర్స్‌లక్నో పోరు హోరాహోరీగా ఉండనుంది. బౌలింగ్ విభాగంలో షమీ, సిమర్జీత్ సింగ్, ప్యాట్ కమిన్స్, హర్షల్ పటేల్ రాణించారు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడమ్ జంపా పర్వాలేదనిపించాడు. పిచ్ కండిషన్స్ మారితే తప్పా సన్‌రైజర్స్ తుది జట్టులో మార్పు జరిగే అవకాశం లేదు. రాహుల్ చాహర్ ఆడించాలనుకుంటే యువ ప్లేయర్ అనికేత్ వర్మపై వేటు పడుతుంది. అంతే తప్పా మిగతా లైనప్‌లో పెద్దగా మార్పులు ఉండకపోవచ్చు.



### రిషబ్ పంత్ వల్లే గెలిచాం: అక్షర్ పటేల్



ఫ్యాన్స్ దీనిని అలవాటుగా మార్చుకోవాలని ఎందుకంటే తన కెప్టెన్సీలో ఇలాగే జరుగుతుందని ఐపీఎల్ మ్యాచ్ లో లక్నో సూపర్ జెయింట్స్ పై ఒక వికెట్ తేడాతో ఉత్కంఠ భరిత విజయం సాధించిన అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్ అన్నాడు. మొదట బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్ 209 పరుగులు చేసింది. ఢిల్లీ 65 పరుగుల వద్దే 5 వికెట్లను కోల్పోయింది. అయినా కూడా ఢిల్లీ జట్టు మూడు బంతులు మిగిలి ఉండగానే మ్యాచ్ గెలిచింది. 'ఈ మ్యాచ్‌లో రిషబ్ పంత్ పెద్ద తప్పు చేసి గెలిచే మ్యాచ్ ను ఢిల్లీకి అప్పగించాడు. వాస్తవానికి చివరి ఓవర్లో ఢిల్లీ జట్టు గెలవడానికి కేవలం 6 పరుగులు మాత్రమే అవసరం. లక్నో తరఫున షాబాజ్ అహ్మద్ చివరి ఓవర్ వేశాడు. అశుతోష్ కాదు.. మోహిత్ శర్మ బ్యాటింగ్ ఎండ్ లో ఉన్నాడు. అటువంటి పరిస్థితిలో షాబాజ్ అద్భుతమై ఫ్లైట్ బంతిని బౌలింగ్ చేశాడు. దానిని మోహిత్ ఆడలేకపోయాడు. ఈ బంతిని ఆడటానికి ప్రయత్నిస్తుండగా.. మోహిత్ తన కాలును ముందుకు చాపి క్రీజు నుంచి బయటకు వచ్చాడు. కానీ ఆ తర్వాత బంతి బ్యాట్ ముందు తిరిగింది. ఈ క్రమంలో రిషబ్ పంత్ మోహిత్ ను ఔట్ చేయడానికి మంచి అవకాశం లభించింది. కానీ పంత్ బాల్‌ను పట్టుకోలేకపోయాడు. మోహిత్ కు మంచి ఛాన్స్ లభించింది. ఈ మ్యాచ్ లో ఇదే అతిపెద్ద మలుపు. ఈ మ్యాచ్‌లో పంత్ ప్రదర్శన చాలా పేలవంగా ఉంది. సున్నా పరుగులు చేసి ఔటయ్యాడు.' అని అక్షర్ పటేల్ చెప్పుకొచ్చాడు.



### రాబిన్ హుడ్ టికెట్ ధరలపై
# క్లారిటీ ఇచ్చిన మేకర్స్!

యూత్ స్టార్ నితిన్ హీరోగా నటించిన లేటెస్ట్ అవైటెడ్ చిత్రమే రాబిన్ హుడ్. యంగ్ అండ టాలెంటెడ్ హీరోయిన్ శ్రీలీల నటించిన ఈ చిత్రాన్ని హిట్ దర్శకుడు వెంకీ కుడుముల తెరకెక్కించిన సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రం కోసం అభిమానులు మంచి ఆసక్తిగా కూడా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో సినిమాకి ఇంకా కొన్ని రోజులే మిగిలి ఉన్నాయి అనే సమయంలో ఈ సినిమాకి టికెట్ ధరల పెంపు ఉంటుంది అనే టాక్ విస్తృతంగా వైరల్ అయ్యింది.అయితే ఈ వార్తలపై స్వయంగా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ క్లారిటీ ఇచ్చారు. రాబిన్ హుడ్ సినిమాకి ధరలు పెంచాము అనే మాట అవాస్తవం అని పెంచినట్టుగా వైరల్ అవుతున్న వార్తల్లో నిజం లేదని కొట్టి పడేసారు. తాము సినిమాని అంతా చూసే విధంగా సరసమైన ధరలోనే తీసుకొస్తున్నట్టుగా తెలిపారు. అయితే ఆంధ్రలో మాత్రం కేవలం కొన్ని ప్రీమియం ప్రాంతాల్లో మట్టుకు స్వల్ప హైక్ ఉంటుంది తప్పితే రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇంకెక్కడా కూడా ధరల పెంపు లేదని ఒక క్లారిటీ చిత్ర యూనిట్ ఇపుడు అందించింది.

## రీల్

### పార్లమెంట్‌లో
# ఛావా స్పెషల్ షో!?



ఇటీవల బాలీవుడ్ సినిమా దగ్గర వచ్చి భారీ వసూళ్లు సొంతం చేసుకున్న హిస్టారికల్ హిట్ చిత్రం ఛావా కోసం అందరికీ తెలిసిందే. వెర్సటైల్ హీరో విక్కీ కౌశల్ హీరోగా రష్మిక మందన్నా హీరోయిన్ గా దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కించిన ఈ చిత్రం భారతీయుల్ని ఉద్వేగానికి లోను చేసింది.ఇలా ఛత్రపతి శంభాజీ మహారాజ్ జీవిత చరిత్రపై తెరకెక్కించిన ఈ చిత్రం ఇపుడు మరో హిస్టారికల్ మూమెంట్ ని అందుకున్నట్టుగా తెలుస్తుంది. ఈ సినిమా తాలూకా స్పెషల్ స్క్రీనింగ్ ని భారతదేశ పార్లమెంట్ లో వేయనున్నట్టుగా ఇపుడు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ మార్చ్ 27 గురువారం సాయంత్రం 6 గంటలకి ఛావా ప్రత్యేక ప్రదర్శన ఉండబోనుండగా ఈ స్క్రీనింగ్ కి దేశ వ్యాప్తంగా ఎంపిలు అంతా హాజరు కానున్నట్టుగా తెలుస్తుంది. అలాగే దేశ ప్రధాని నరేంద్ర మోడీ కూడా ఈ స్క్రీనింగ్ లో సినిమాని చూడనున్నారట. దీనితో ఈ టాక్ వైరల్ గా మారింది. అయితే నార్త్ లో చాలా మంది మాట్లాడుకుంటున్నప్పటికీ మేకర్స్ నుంచి ఈ ప్రైడ్ మూమెంట్ పై ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. మరి దీనిపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది.





# బన్నీతో త్రివిక్రమ్ భారీ ప్లాన్..

ప్రస్తుతం ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ స్టార్డం పతాక స్థాయిలో ఉన్న సంగతి తెలిసిందే. ఎలాంటి రాజమౌళి బ్రాండ లేకుండా ఇక స్టార్ అల్లు అర్జున్ పాన్ ఇండియా లెవెల్లో తన క్రేజ్ అండ్ మార్కెట్ ని చూపించి బ్రాండ గా నిలిచాడు. అయితే అల్లు అర్జున్ నుంచి నెక్స్ట్ పుష్ప 2 సినిమా తర్వాత పలు భారీ సినిమాలే ఉండగా వాటిలో మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ తో చేయనున్న భారీ చిత్రం కూడా ఒకటి. నిజానికి పుష్ప 2 తర్వాత ఇదే స్టార్ట్ కావాల్సి ఉంది కానీ ఇపుడు దీనిని అట్లీ ప్రాజెక్ట్ రీప్లేస్ చేస్తుంది. అయితే లేటెస్ట్ గా త్రివిక్రమ్ తో సినిమా విషయంలో నిర్మాత నాగవంశీ చేసిన కామెంట్స్ ఇపుడు వైరల్ గా మారాయి. అల్లు అర్జున్ తో తాము ఇండియన్ సినిమా దగ్గర ఎవరూ టచ్ చెయ్యని మైథాలజీ సబ్జెక్టుతో సినిమాని చాలా గ్రాండ లెవెల్లో ప్లాన్ చేస్తున్నట్టుగా తాను రివీల్ చేశారు. ఒక్కసారి ఆ సినిమా వచ్చాక యావత్ భారతదేశం ఈ సినిమా వైపు చూస్తుంది అని కన్ఫర్మ్ చేశారు. అలాగే ఇది మహాభారతం లేదా రామాయణంకి సంబంధించిన కథ కాదు అని మన ఇతిహాసాల్లోనే ఎవరికీ తెలియని ఒక కొత్త పాత్రతో తాము చేస్తున్నట్టుగా తెలిపారు. దీనితో ఈ కామెంట్స్ ఇపుడు అభిమానుల్ని మరింత ఎగ్జైట్ చేస్తున్నాయి.

# పోరాటంతోనే పరిష్కారం



**(మొదటి పేజీ తరువాయి)**

సభ అధ్యక్షత వహించారు. ఈ బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహాసభలనుద్దేశించి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులను విస్మరించిందని, మూడు నల్ల చట్టాలను తెచ్చి రైతులను నిండా ముంచిందన్నారు. చరిత్రాత్మకమైన రైతుల పోరాటాల ఫలితంగానే మూడు రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలు చేయబడ్డాయని గుర్తు చేశారు. మోదీ ప్రభుత్వం బడా కార్పోరేట్లకు కొమ్ము కాస్తుందన్నారు. పేద, మధ్యతరగతి రైతులకు న్యాయం జరిగేలా చట్టాలు రూపొందించడం లేదని హెచ్చరించారు. పసుపు బోర్డు తెస్తామని చెప్పి ఎంపిగా గెలిచిన ధర్మపురి అరవింద్ ఎట్టకేలకు పసుపుబోర్డు తెచ్చినా పసుపుకు మద్దతు ధర ఇవ్వలేక రైతులను మోసం చేస్తున్నారన్నారు. పసుపు మద్దతు ధర ఇవ్వకుండా రైతులు రోడ్డు నెక్కే పరిస్థితి ఏర్పడేలా చేశారన్నారు. దేశంలో నూటికి 75 శాతం మంది రైతులు వ్యవసాయం మీద ఆధారపడ్డారని, వారికి సరైన సదుపాయాలు కల్పించలేకపోవటంతో పండించిన పంటకు గిట్టుబాటు ధర రాకపోవటంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం ప్రతిరోజు దాదాపు 36 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారంటే అందుకు కారణం ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధివిధానాలేనన్నారు. దేశంలో ఎన్నో జీవ నదులున్నప్పటికీ ఎందుకు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ప్రశ్నించారు. దేశంలో పంటలు పండే భూములు లేవా ? జీవనదులు లేవా . కష్టపడి రైతులు లేరా అని ప్రశ్నించారు. కానీ ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవటం వల్లే రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయన్నారు. ప్రపంచ దేశాలలో వ్యవసాయానికి సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహిస్తుంటే మోదీ ప్రభుత్వం మాత్రం సబ్సిడీలు ఇవ్వకుండా అంబానీ, ఆదానీ లాంటి కార్పొరేట్ సంస్థలకు వత్తాసు పలుకుతున్నాయన్నారు. మోదీప్రభుత్వం సాగునీటి కోసం ఏ ఒక్క ప్రాజెక్టును కూడా సంపూర్ణంగా నిర్మించలేకపోయిందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర విభజన చట్టంలో తెలంగాణకు ఎలాంటి ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించలేదన్నారు. ఉత్తర భారతదేశంలో ఉన్న ప్రాజెక్టులకు మాత్రమే జాతీయ హోదా కల్పించి నిధులు విడుదల చేశారన్నారు. రాష్ట్రంలో సైతం కృష్ణానదిలో వాటా తేల్చకపోవటంతో ఆంధ్రకు నీళ్లు దోచుకుపోతున్నారని గుర్తు చేశారు. భాగం హేమంతరావు, పశ్య పద్మ మాట్లాడుతూ కెసిఆర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు ఆకర్షితులై ప్రజలు ఓట్లు వేశారని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వేర్చాలన్నారు. రెండు లక్షల రుణమాఫీ పూర్తిగా అమలు కావటం లేదని రైతు భరోసా పూర్తిగా అందలేదని, రైతులు పండించిన పసుపు, మిర్చి, వరి పంటకు గిట్టుబాటు ధర అందడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వీటిపై దృష్టి పెట్టాలన్నారు. ఇటీవల తెలంగాణ జిల్లాలో వడగళ్ల వానతో తీవ్రంగా పంట నష్టం జరిగిందని, ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మోడీ ప్రభుత్వంతోనే వ్యవసాయం సంక్షోభంలో కురుకుపోయిందన్నారు. కార్పోరేవర్ వర్గాలకు భూమిని అప్పజెప్పి కుట్ర పన్నుతున్నారన్నారు. మోడీ ప్రభుత్వం 16 లక్షల కోట్లు అంబానీ, ఆదానీ అప్పులు మాఫీ చేశారని, రైతులకు మాత్రం మేలు జరిగే పనులు చేయటం లేదన్నారు. ప్రశ్నించే గొంతుకలు శక్తులను సాయి బాబా, వరవరరావు లాంటి వారిని నిర్బంధించి అణచివేసే కుట్రలు చేశారన్నారు. మోడీ ప్రభుత్వం ఛత్తీస్‌గడ్‌లో ఆదివాసీలపై యుద్ధం ప్రకటించి రాజ్యాంగ ఉల్లంఘన చేసి దౌర్జన్యంగా పాలన సాగిస్తుందన్నారు. ఈ దేశంలో రాజ్యాంగాన్ని రక్షించుకోవాలంటే ప్రతిఒక్కరూ కంకణబద్దులు కావలని, రాజ్యాంగాన్ని మార్చేందుకు ఆలోచన చేస్తా ఉన్నదని, అలాంటి కుట్రలు జరుగుతున్నాయని, ప్రజాస్వామికవాదులు, లౌకికవాదులు, కమ్యూనిస్టులు పెద్ద ఎత్తున కలిసి కార్మిక, కర్షకవర్గాలు ఏకమై పోరాటాలు సాగించాలని అందుకు ఈ మూడు రోజుల పాటు ప్రణాళికలు రచించేందుకు ఈ మహాసభలు ఎంతో దోహదపడుతాయన్నారు. బహిరంగ సభనుద్దేశించి ఆహ్వాన సంఘం అధ్యక్షులు నర్ర రామరావు రైతులనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, నాయకులు ఓమయ్య, రాజిరెడ్డి, రాజేశ్వర్,పాల్గొన్నారు.

### పొలంలోకి దూసుకెళ్ళిన లారీ
# మహిళా కూలీలు మృతి

**పరారీలో లారీ డ్రైవర్**





**ప్రజాపక్షం/టేకుమట్ల:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని రామకృష్టపూర్ (టి) గ్రామ శివారులో అతివేగంతో పత్తి గింజల లోడ్‌తో వచ్చిన లారీ రోడ్డు పక్కన పొలంలో పనులు చేసుకుంటున్న వారిపై దూసుకెళ్లింది.దూసుక వెళ్లి బోళ్త పడి పత్తి గింజల బస్తాలు పడడంతో పొలంలో పని చేస్తున్న రామకృష్టపూర్ (టి) గ్రామనికి చెందిన మోకిడి పూలమ్మ (51),మోకిడి సంధ్య(30) ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు.విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకోని జెసిబి సహయంలో మృతి దేహాలను వెతికి తీసారు.లారీ డ్రైవర్ పరారీయ్యాడని స్థానికులు తెలిపారు.చిట్యాల ఎస్సై శ్రావణ్ కుమార్ మృతుదేహాలను చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### టెన్త్‌క్లాస్ పేపర్ లీకేజీ
# నిందితుల అరెస్ట్

**ప్రజాపక్షం/నల్లగొండ:** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పదవ తరగతి పేపర్ లీకేజీ నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణ కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో పేపర్ లీకేజ్ కి కారణమైన వ్యక్తుల ను అరెస్టు చేశామని ఎవరి ఒత్తిడి లేకుండా విచారణ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరుగుతుం దని నల్లగొండ డిఎస్‌పి శివరాంరెడ్డి తెలిపారు. కేసుకు సంబంధించి నిందితుల వివరాలను ప్రకటన రూపంలో వెల్లడించారు.డిఎస్‌పి తెలి పిన వివరాల ప్రకారం గత 21వ తేదీన పదవ తరగతి మొదటి (తెలుగు) పరీక్ష ఉదయం 9.30 గంటల నుండి 12.30 గంటల వరకు నిర్వ హించబడింది. ఈ పరీక్ష మొదలైన అరగంట తర్వాత వాట్సప్ లో తెలుగు ప్రశ్నా పత్రము చక్కర్లు కొడుతు విషయం జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతికి చేరింది. ఆ వెంటనే డిఈఓ ఎంఈఓ కు ఫోన్ చేసి వెం టనే విచారణ చేపట్టాలని ఆదేశించారు.ఎంఈఓ నకిరేకల్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలిక ల గురుకుల పాఠశాల లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో రూమ్ నంబర్ 8 వద్ద ఉదయం 9.50 గంటలకు ఎవరో గుర్తు తెలియని వ్యక్తి కిటికీ వద్దకు వచ్చి పరీక్ష రాస్తున్న అమ్మాయి వద్ద ఆమె ప్రశ్నా పత్రము సెల్ ఫోనులో ఫోటో తీసుకుని వెళ్ళినాడని నిర్ధారిం చుకొని ఎంఈఓ పై అధికారులతో పాటు నకిరేకల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.ఎంఈఓ ఫిర్యాదు మేరకు సిఆర్ నెంబర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసులో పోలీసులు మొత్తం 13 మందిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఇందులో నేరస్తులు ఏ 1 నుండి ఏ 4 వరకు, ఏ 6 నుండి ఏ 11 అండ్ సిసిఎల్1 అందరూ స్నేహితులు.పదవ తరగతిపరీక్షలకు హాజరయ్యే వారి బం ధువులకు అక్రమ మార్గాల ద్వారా ఎక్కువ మార్కులు రప్పించాలనే ఉద్దేశ్యంతో వారందరూ కలిసి పరీక్ష మొదలైన తర్వాత ఎక్కడైనా ప్రశ్నా పత్రము దొరుకుతుందేమోనని వెతికారు. ప్రశ్న పత్రం దొరికిన వెంటనే జవాబులు వ్రాసి వారికి తెలిసిన వారికి ప్రశ్నలకు సమాధానాలు అంధిం చి ఎక్కువ మా ర్కులు పొందాలనే ఉద్దేశ్యంతో ఏ1, ఏ 3, సిసిఎల్ 1 లు ముగ్గురు కలిసి నకిరేకల్‌లోని సాంఘిక సంక్షే మ శాఖ బాలికల గురుకుల పాఠశాల వద్దకు ఉదయము 9.40 గంటలకు స్కూటి మీద వచ్చారు.అక్కడ గేట్ వద్ద అప్పటికే పోలీసు వారు వున్నంధున లోపలికి వెళ్ల దానికి వీలు కాక పోవడంతో వెంటనే వీరు ముగ్గురు స్కూల్ వెనుక వైపునకు వెళ్లారు. అక్కడ ఏ11 కూడా వుం డటంతో సిసిఎల్ 2 పాఠ శాల వెను క గోడ కిటికీ వైపు ఉన్న 1 వ అంత స్తులో రూము నెంబరు 8 లో పరీక్ష రాస్తుండగా అది గమనించిన ఏ1 1 అందులో పరిచయం ఉన్న వి ద్యార్థిని ఉండటంతో ప్రశ్నా పత్రాన్ని చూపిం చ మని సిసిఎల్ 2 సైగ చేయగా ఆమె అందుకు ఒప్పుకోగా వెంటనే సిసిఎల్ 1, ఏ1 ఇద్దరు కలిసి ఏ11 సహాయంతో అక్కడ ఉన్న ప్రహరీ గోడ ఎక్కి సిసిఎల్ 2 వున్న కిటికీ వద్దకు వెళ్ళగా ఆమె ప్రశ్నా పత్రాన్ని చూపించింది. సిసిఎల్ 1 తన ఫోనులో తెలుగు ప్రశ్నా పత్రాన్ని ఫోటో తీసుకుని వెంటనే ఇద్దరు కింధికి దిగారు. ఆ ఫోటోలను సిసిఎల్ 1 నుండి మిగతా నేరస్తులకు ఒకరి నుండి ఒకరికి పంపుకోగా ఆ పేపర్ లో వున్న ప్రశ్నలకు ఏ4 ద్వారా స మాధానాలు తయారు చేసి వాటిని ఏ5 మూసి ఉన్న జీరాక్సు షాప్ లో జీరాక్సు తీసుకున్నారు. నే రస్తులు వారికి తెలిసిన వారికి ఇవ్వడానికి పరీక్షా కేంద్రానికి వెళ్ళ గా అక్కడ వున్న పోలీసు వారిని చూసి దొరికి పోతామేమోనని వె ళ్ళిపోయి నారు.ఎంఈఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మొ త్తం 13 మందిని అదుపులోకి తీసుకొని విచారించి గత 23వ తేదీన నిందితులైన ఏ1 నుండి ఏ5, సిసి ఎల్ 1 (బాల నేరస్థుడు) లను అరె స్టు చేసి జ్యూడీషియల్ రిమాండ్‌కు పంపారు. మిగిలిన నిందితులపై విచార ణ కొనసాగుతుంది. కాగా మొత్తం 13 మంది నిందితుల్లో ఆరుగు రుని రిమాండ్ కు తర లించగా మరి ఆరుగురు పై విచారణ కొనసా గుతుంది ఒకరు పరారీలో ఉన్నారు. మొత్తం 13 మం దిలో ఇద్దరు బాల నేరస్తులు ఉన్నారని కేసు విచారణ నిష్పక్ష పాతంగా పార దర్శకంగా కొన సాగుతుందని డిఎస్‌పి తెలిపారు.

### ప్రభుత్వ భూమే
**(మొదటి పేజీ తరువాయి)**

శాఖ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. టిజిఐఐసి అభివృద్ధి చేస్తున్న 400 ఎకరాల భూమిలో బఫెలో లేక్ లేదా పికాక్ లేక్‌లు లాం టి ప్రకృతి ప్రదేశాలు లేవని స్పష్టం చేశారు. టిజిఐఐసి ఈ భూమిలోని రాతి నిర్మాణాలు, పుట్టగొడుగు ఆకారపు అపురూపమైన రాయిని గ్రీన్ జోన్‌గా ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు పర్యావరణ పరిరక్షణ ప్రణాళికను కూడా సిద్ధం చేసి అమలు చేయనుందన్నారు.టిజిఐఐసి హైదరాబాద్ విశ్వవిద్యాలయ భూమిని ఆక్రమించలేదని, అలాగే నీటి వనరులను లేదా రాతి నిర్మాణాలను తొలగించలేదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.టిజిఐఐసి, ఈ భూమిలో ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ కోసం టెండర్లను ఆహ్వానించడానికి ఏర్పాట్లు చేస్తోందన్నారు.

### అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ నిరవధిక సమ్మె

**ప్రయాగ్‌రాజ్:** జస్టిస్ యశ్వంత్ వర్మ బదిలీ ఉత్తర్వులకు వ్యతిరేకంగా అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ (ఏహెచ్‌సీబీఏ) మంగళవారం నిరవధిక సమ్మెకు దిగింది. విధులు బహిష్కరిస్తూ అలహాబాద్ హైకోర్టు గేట్ నెంబర్ 3 ఎదుట బా ర్ అసోసియేషన్ సభ్యులు సమ్మె చేపట్టారు. ఈ నిరసన ఏ కో ర్టు లేదా జడ్జికి వ్యతిరేకంగా కాదని, న్యాయవ్యవస్థను మోసం చేసిన వారిపైనేని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ తివా రీ పేర్కొన్నారు. అవినీతికి పాల్పడిన వారికి వ్యతిరేకంగా, పారదర్శకత లేని వ్యవస్థకు వ్యతిరేకంగా తమ పోరాటమని అన్నారు. జస్టిస్ యశ్వంత్ వర్మ బదిలీ ఉత్తర్వులను పున:పరిశీలించి ఉపసంహరించుకోవాలనేది తమ ప్రధాన డిమాండ్ అని అన్నారు. ఈ అంశంపై పూర్తిస్థాయిలో పోరాటం చేసేందుకు అసోసియేషన్ సిద్ధంగా ఉందని తివారీ ఉద్ఘాటించారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బది లీ నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకు సమ్మె కొనసాగించాలన్న తీర్మానాన్ని ఏహెచ్‌సీబీఏ ఆమోదించిన సంగతి తెలిసిందే.

### ఇజ్రాయెల్ దాడులు
**(మొదటి పేజీ తరువాయి)**

14,000 మంది మృతదేహాలు ఉండి ఉంటాయని అంతర్జాతీయ పరిశోధనా సంస్థలు అంచనావేశాయి. అదేవిధంగా మరో 1,13,000 మంది ఈ దాడుల్లో మరణించారు. అదేవిధంగా మంగళవారం తెల్లవారుజామున నాబ్లస్, బలాటా సమీపంలో ఉన్న అల్ ఎయిర్ శరణార్థ శిబిరాల్లో ఉన్న ఎనిమిదిమందిని ఇజ్రాయెల్ దళాలు చుట్టుముట్టాయి. రమల్లా సమీపం అల్ బిరాహ్, బిర్జీత్, బీట్‌రిమా,డీర్ ఘసానా,బీతునియా పట్టణాలలో కూడా ఇజ్రాయెల్ దళాలు దాడులు చేశాయి.

18నెలల్లో ఆరుగురు

**అల్ జజీరా జర్నలిస్టులు మృతి**

గాజాలో జరిపిన దాడుల్లో అల్‌జజీరా జర్నలిస్టు షేమ్ షాబత్ మరణించారు. జబాలియాలో ఆయన కారును లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెలీ దళాలు గగనతల దాడులు చేశాయని అల్ జజీరా నెట్‌వర్క్ విమర్శించింది. తమ జర్నలిస్టును హత్యచేయడాన్ని జర్నలిస్టు సంఘం తీవ్రంగా ఖండించింది. దీంతో ఇప్పటికి ఇజ్రాయెల్ ఐదుగురు అల్ జజీరా జర్నలిస్టులను వేటాడి చంపినట్లయింది. సమీర్ అబుదకా, హంజా అల్‌దహ్దా, ఇస్మాయిల్ అల్‌ఘౌల్, అహ్మద్ అల్‌లౌహ్ అనే ఐదుగురు జర్నలిస్టులను ఇజ్రాయెల్ చంపింది. ఇప్పుడు మరణించిన షాబత్ ఆరో జర్నలిస్టు. గాజాలో జర్నలిస్టులు జర్నలిస్టులపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నారు. ప్రపంచ జర్నలిస్టు సంఘాలు వారికి సంఘీభావం ప్రకటించాయి.

**నేతన్యాహూ నివాసం ఎదుట భారీ ప్రదర్శన**

ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నేతన్యాహూ నివాసం ఎదుట సోమవారం రాత్రి భారీఎత్తున ప్రజలు నిరసన ప్రదర్శన చేశారు. వెంటనే బందీలను విడుదల చేయడానికి వీలుగా చర్చల ప్రక్రియ ప్రారంభానికి తలుపులు తెరవాలనీ, గాజాపై దాడులు ఆపాలని వారు డిమాండ్ చేశారు. బందీల కుటుంబాల సంఘం సభ్యులు, పెద్దసంఖ్యలో ప్రజలు ప్రధానమంత్రి నివాసం ఎదుట ప్రదర్శన చేశారు. దేశీయ భద్రతా ప్రధానాధికారి రోనెన్ బార్‌ను పదవి నుండి తొలగించేందుకు ప్రయత్నం చేయడాన్ని కూడా నిరసన ప్రదర్శకులు తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రభుత్వం రాజ్యాంగ చట్టాలను అనుసరించడంలేదని ప్రదర్శకులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. గాజాలో హమాస్ వద్ద ఇప్పటికీ 59 మంది ఇజ్రాయెల్ బందీలున్నారు. వీరిలో కేవలం 24 మంది మాత్రమే సజీవంగా ఉన్నారని ఇజ్రాయెల్ కూడా భావిస్తున్నది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com